www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 21-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 346 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ.1:01 తదుపరి పంచమి; నక్షత్రం: రేవతి రా.7:07 తదుపరి పాడ్యమి; వర్జ్యం: ఉ.7:37-9:09; దుర్ముహూర్తం: ఉ.6:42-8:14; అమృతఘడియలు: సా.4:49-6:21; రాహుకాలం: ఉ.9:00-10:30; సూర్యోదయం: 6:42; సూర్యాస్తమయం: 6:15 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెల్లనివన్నీ పాలు కావు!



ప్రతి 3 శాంపిళ్లలో ఒకదాంట్లో కల్తీ 2

డిటర్జెంట్, యూరియా, కాస్టిక్ సోడా మిక్స్

2025లో దేశవ్యాప్తంగా నిర్వహించిన నాణ్యత పరీక్షల్లో ప్రతి 100 నమూనాల్లో 38 విఫలం

ట్రంప్ సుంకాలు చెల్లవ్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి కనీవినీ ఎరుగని రీతిలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని.. వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద.. అన్ని దేశాలపైనా 10% ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు.

అలా విధించడం రాజ్యాంగ విరుద్ధం: అమెరికా సుప్రీంకోర్టు



- అత్యవసర చట్టం కింద సుంకాలు విధించే హక్కు అధ్యక్షుడికి లేదు
- ఆ చట్టం కింద వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది
- ఇంతకుముందు ఏ అధ్యక్షుడూ ఇలా సుంకాలు విధించలేదు
- టారిఫ్‌లను కొట్టేస్తూ అమెరికా సుప్రీం కోర్టు సంచలన తీర్పు
- 6-3 మెజారిటీతో దిగువ కోర్టు తీర్పును సమర్థించిన ధర్మాసనం
- అమెరికా ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటిదాకా సుంకాల రూపంలో వసూలు చేసింది దాదాపు రూ.16 లక్షల కోట్లు
- తిరిగి చెల్లించాలంటూ కోర్టులను ఆశ్రయించిన దిగుమతిదారులు
- దాని గురించి తీర్పులో ప్రస్తావించని మెజారిటీ న్యాయమూర్తులు
- తీర్పులో భారత్‌పై సుంకాల ప్రస్తావన.. ట్రంప్ నియమించిన ముగ్గురు జడ్జిల్లో ఒక్కరే సుంకాలకు అనుకూలం

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: సుంకాల రంకెలు వేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం ముకుతాడు వేసింది. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. సుంకాల మోత మోగించడానికి

మిగతా 2వ పేజీలో...

భారత ఎగుమతులకు మళ్లీ జోష్.. ప్రతీకార సుంకాల కొట్టివేతతో పాత టారిఫ్‌లే!



సుంకాలు కొనసాగుతాయ్

- ప్రత్యామ్నాయ మార్గాల్లో కొనసాగిస్తాం
- సాధారణ సుంకాలకు అదనంగా మరో 10% విధిస్తున్నా
- సుప్రీంకోర్టు తీర్పు అమెరికా ప్రయోజనాలకు విరుద్ధం
- కొందరు జడ్జీలు విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారు
- భారత్‌తో వాణిజ్య ఒప్పందంలో మార్పులుండవు: ట్రంప్

ఏడాదిలో రూ. 26 లక్షల కోట్లు

- సుంకాలతో అమెరికా ఖజానాకు భారీగా ఆదాయం
- అమెరికా టారిఫ్‌లు చట్టవిరుద్ధమని తేలింది: కెనడా
- తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం: ఈయూ
- అమెరికా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్ పార్టీ

వైసీపీ మహాపచారం

చెప్పులు, బూట్లు వేసుకుని శ్రీవారి పోస్టర్ల ప్రదర్శన

- శ్రీవారి ఫొటోలు సభలోకి తేవడంపై అధికార కూటమి ఆగ్రహం
- వారికి దేవుడంటే భయం, నమ్మకం లేవు
- విచక్షణ లేకుండా వాళ్ల నాయకుడు చెప్పినట్లు నడుచుకుంటున్నారు
- మంత్రి పయ్యావుల మండిపాటు
- చైర్మన్ వద్ద కూటమి నేతల నిరసన
- స్వామి ఫొటోలు తేవడం తప్పేనన్న చైర్మన్
- బొత్సను పిలిపించి వివరణ కోరిన మోషేన్
- క్షమాపణ చెప్పేందుకు విపక్ష నేత ససేమిరా
- మా సభ్యులు చెప్పులు వేసుకున్నారనడానికి ఆధారం చూపించండి.. బొత్స సవాల్
- తక్షణమే వీడియోలను షేర్ చేసిన లోకేశ్

జగన్ డైరెక్షన్‌లోనే మహాపచారం

- దేవుడిని రాజకీయాల్లో వాడుకోవడంలో పరాకాష్ఠకు వైసీపీ.. ఇదేనా పార్టీ విధానం?
- హిందువులకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రులు, కూటమి నేతల డిమాండ్

అసెంబ్లీ ప్రాంగణంలోనే కాదు.. మండలిలోనూ ఇదే తీరు

వాయిదా పడ్డాక పోస్టర్లు, ప్లకార్డులను లోపలే పడేసిన వైనం







మండలిలో చెప్పులేసుకుని శ్రీవారి పోస్టర్లతో వైసీపీ ఎమ్మెల్సీలు. టేబుల్‌పై పడేసిన శ్రీవారి చిత్రాలు

ఈ సాక్ష్యాలు చాలా?

కల్తీ నెయ్యిలో వారి పాపం తేల్చండి

- రిటైర్డు ఐఏఎస్ దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీ ఏర్పాటు
- అప్పటి టీటీడీ సభ్యులు, అధికార్ల తప్పిదాలపై విచారణ 14
- తీసుకోవాల్సిన చర్యలపై 45 రోజుల్లో నివేదిక

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడమే కాదు.. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల శాసనమండలిలోనూ వైసీపీ ఎమ్మెల్సీలు అపచారానికి పాల్పడ్డారు. చెప్పులు, బూట్లు ధరించి.. శ్రీవారి పోస్టర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో వైసీపీ సభ్యులు శుక్రవారం నల్ల కండువాలు, నల్లబాడ్జీలు ధరించి.. అసెంబ్లీ నాలుగో గేటు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు చెప్పులు, బూట్లు వేసుకునే.. శ్రీవారి పోస్టర్లు పట్టుకుని 'గోవిందా గోవిందా'.. 'చంద్రబాబుకు

మిగతా 13వ పేజీలో...

నేడు శ్రీవారి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణలు

- మఠాధిపతులు, స్వామీజీలతో రౌండ్ టేబుల్ భేటీలు.. జూమ్‌లో కూటమి నేతల నిర్ణయం
- చెప్పులేసుకుని స్వామి చిత్రాలతో రావడమా?
- దేవదేవుడికి ఇంత మహాపచారమా?
- వైసీపీ తీరును ప్రజల్లో ఎండగట్టాలని తీర్మానం



లక్ష మంది యువతకు శిక్షణపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం రిసెర్చ్ ఇండియా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అమిత్ సింఘీ తదితరులు

ఏఐ యుగం.. 'పని'లేని ప్రపంచం!

- 90 శాతం ఉద్యోగాలు, ఉపాధికి కోత
- సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో పెనుమార్పు
- 'ఏఐ' వ్యవస్థల యజమానుల వద్దే 99% సంపద.. 90% ప్రజలు 'పని' లేని వారే!
- ప్రతినెలా ప్రభుత్వం నుంచే ఆర్థిక సాయం
- ఏఐ, ఆర్థిక నిపుణుల అంచనా
- వచ్చే ఐదేళ్లలోనే 80 కోట్ల ఉద్యోగాలకు కోతపడవచ్చని మెకిన్సీ నివేదిక

క్వాంటమ్.. కేరాఫ్ ఏపీ!

ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో 7 కీలక ఒప్పందాలు

- అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ వర్సిటీ
- క్వాంటమ్ ఏఐ సెంటర్, టాలెంట్ హబ్ ఏర్పాటు
- విద్యాసంస్థల్లో ఏఐ అకాడమీలు.. ప్రతి విద్యార్థికీ ఏఐ ట్యూటర్
- క్వాంటమ్, సైబర్ సెక్యూరిటీలో లక్ష మందికి శిక్షణ
- ఏఐ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూలు
- క్రియేటర్ ఎకానమీ సెంటర్‌గా ఏపీ.. యువ టెకీలు మా బలం
- సమ్మిట్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ భవిష్యత్ టెక్నాలజీ రంగంలో నవ్యాంధ్రను అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా హస్తిన వేదికగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. క్వాంటమ్ టెక్నాలజీ అనగానే ముందుగా ఆంధ్రప్రదేశ్ పేరే వినిపించేలా రాష్ట్రాన్ని క్వాంటమ్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాజధాని అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసిన రాష్ట్రప్రభుత్వం... దానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి, రాష్ట్రంలో ఏఐ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడానికి ఏడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఢిల్లీలో జరుగుతున్న

మిగతా 12వ పేజీలో...

అనంతబాబుతో పోలీసుల కుమ్మక్కు

దర్యాప్తులో ఉద్దేశపూర్వకంగానే జాప్యం: సుప్రీం



- డిఫాల్ట్ బెయిల్ అందేలా సహకరించారు
- డ్రైవరు హత్య కేసులో దర్యాప్తు తీరుపై సుప్రీం ధర్మాసనం తీవ్ర అసహనం
- 2022 నుంచీ 'బెయిల్'పైనే నిందితుడు
- ఈ నాలుగేళ్లుగా దర్యాప్తు ముందుకు వెళ్లలేదేం?
- ఎస్పీ, అధికారులను డీజీపీ నియంత్రించలేరా?
- డీజీపీకి కొనసాగే అర్హత ఉందా?.. బెంచ్ ఆగ్రహం

న్యూఢిల్లీ, కాకినాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్‌భాస్కర్ (అనంతబాబు) డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిందితుడు అనంతబాబుతో పోలీసులు కుమ్మక్కయ్యారని తేల్చింది. "పోలీసులు, దర్యాప్తు సంస్థలు అనంతబాబుతో చేతులు కలిపాయి. అతనికి డిఫాల్ట్ బెయిల్ అందించడానికి అన్ని ప్రయత్నాలు జరిగాయి. పోలీసులు, రాజకీయ అధికారానికి

మిగతా 14వ పేజీలో...



14

ఆయేషా మీరా కేసు క్లోజ్!

- హత్యాచారం కేసు కొట్టివేస్తూ సీబీఐ కోర్టు తీర్పు
- ఆధారాల్లేకపోవడంతో 18 ఏళ్ల తర్వాత మూసివేత
- న్యాయ సహాయానికి కోర్టు సంసిద్ధత
- కానీ ఇక న్యాయ పోరాటం చేసే ఓపిక, శక్తి, ఆర్థిక స్తోమత లేవన్న ఆయేషా తల్లిదండ్రులు
- దీంతో విచారణ ముగిస్తున్నామన్న న్యాయాధికారి
- సమాధి నుంచి సేకరించిన ఆయేషా అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగించండి
- సీబీఐకి న్యాయస్థానం ఆదేశం

బెంగాల్ 'సర్' విధుల్లో న్యాయాధికారులు

సుప్రీంకోర్టు అసాధారణ నిర్ణయం

- అభ్యంతరాలపై వారే నిర్ణయం తీసుకుంటారు
- ప్రస్తుత అధికారులతో పాటు మాజీ అదనపు జిల్లా జడ్జిలు, జిల్లా జడ్జిలను నియమించాలని ఆదేశం
- న్యాయాధికారుల నియామకంపై నేడు సీఎస్, డీజీపీ తదితరులతో భేటీ నిర్వహించండి
- కలకత్తా హైకోర్టు సీజేకు సుప్రీంకోర్టు ఆదేశం
- రాష్ట్ర ప్రభుత్వం, ఈసీల మధ్య నిందల పర్వం కొనసాగడం దురదృష్టకరమని వ్యాఖ్య



తుది ఓటరు జాబితాపై సర్కారు అభ్యంతరం

తోసిపుచ్చిన ధర్మాసనం.. 28న ప్రచురణకు అనుమతి

2

సుంకాలు కొనసాగుతాయి!

- ప్రత్యామ్నాయ మార్గాల్లో కొనసాగిస్తాం
- సాధారణ సుంకాలకు అదనంగా మరో 10% విధిస్తున్నా
- భారత్‌తో వాణిజ్య ఒప్పందంలో మార్పులు ఉండవు
- పరస్పర సుంకాల కొట్టివేత అనంతరం ట్రంప్ వ్యాఖ్యలు


అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్‌తో ట్రంప్(ఫైల్)

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: సుంకాలను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తీవ్రంగా నిరాశపర్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కోర్టు తీర్పు అమెరికా ప్రయోజనాలకు విరుద్ధమని మండిపడ్డారు. కొందరు న్యాయమూర్తులు విదేశీ శక్తులకు, ఒక చిన్న రాజకీయ ఉద్యమం ప్రభావానికి లోనయ్యారని విమర్శించారు. టారిఫ్‌లకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్న న్యాయమూర్తులు అమెరికాకు అవమానకరమని, వారితీరు సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. చాలా ఏళ్లుగా అమెరికాను దోచుకున్న విదేశాలు కోర్టు తీర్పుతో ఆనందపడుతున్నాయని, వారికా సంతోషం ఎక్కువకాలం ఉండదని చెప్పారు. సుంకాల విధింపు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం కోర్టు తీర్పు అనంతరం ట్రంప్ వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడారు. "కొందరు న్యాయమూర్తులు తాము రాజకీయంగా సరైన పనే చేశామని భావిస్తున్నారు. కానీ వారు వామపక్ష డెమొక్రాట్లకు లోబడిన మూర్ఖులు, పెంపుడు కుక్కలు. వారు దేశభక్తి లేనివారు, రాజ్యాంగంపై విశ్వాసం లేనివారనేది నా అభిప్రాయం. సుంకాల విషయంలో అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ)ను మించిన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. కోర్టు టారిఫ్‌లను రద్దు చేయలేదు. ఐఈఈపీఏ కింద విధించిన నిర్దిష్టమైన టారిఫ్ విధానాన్ని మాత్రమే రద్దు చేసింది. కోర్టు తప్పుగా తిరస్కరించిన టారిఫ్‌ల స్థానంలో.. కోర్టులు, కాంగ్రెస్ ఆమోదం ఉన్న ఆ ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేస్తాం. అవి మరింత ఆదాయాన్ని తెచ్చిపెట్టవచ్చు. అమెరికా మరింత శక్తివంతంగా మారుతుంది. వాణిజ్య చట్టం సెక్షన్ 122, సెక్షన్ 232 కింద అన్ని దేశాలపై ఇప్పుడున్న టారిఫ్‌లకు అదనంగా మరో 10శాతం సుంకాలు విధిస్తున్నాను. వివిధ దేశాలు, సంస్థలు అనుసరిస్తున్న అన్యాయ వాణిజ్య విధానాల నుంచి అమెరికాను రక్షించేందుకు సెక్షన్ 301 కింద టారిఫ్‌ల విధింపునకు చర్యలను చేపడతాం. ఈ నిర్ణయాలు వెంటనే అమల్లోకి వస్తాయి" అని ప్రకటించారు.

భారత్‌తో ఒప్పందంలో మార్పులు ఉండవు

భారత్‌తో వాణిజ్య ఒప్పందంలో ఎటువంటి మార్పులూ ఉండవని, త్వరలోనే ఒప్పందం కుదరబోతోందని ట్రంప్ వెల్లడించారు. తాము భారత్‌కు సుంకాలు చెల్లించబోమని, భారత్ తమకు సుంకాలు చెల్లించదని పేర్కొన్నారు. తాను టారిఫ్‌లను ఉపయోగించి భారత్-పాక్ యుద్ధం సహా ఎనిమిది యుద్ధాలను ఆపానని మరోసారి పేర్కొన్నారు. "ఐఈఈపీఏ కింద ఏ దేశంపై అయినా నేను ఒక్క డాలర్‌కూడా చార్జి విధించలేనని కోర్టు పేర్కొంది. ఆ చట్టం కింద వివిధ దేశాలతో నేను వాణిజ్యాన్ని ఆపేయవచ్చు. ఆ దేశాలను నాశనం చేసేలా నిషేధం విధించవచ్చు. కానీ చార్జి చేయకూడదా. నేను వాణిజ్యం కోసం లైసెన్సు ఇవ్వొచ్చు. కానీ లైసెన్సు చార్జీ వసూలు చేయకూడదా" అని ప్రశ్నించారు.

వాణిజ్య ఒప్పందంపై 23 నుంచి తుది చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా డాక్యుమెంట్ల రూపకల్పనపై చర్చల కోసం ఇరు దేశాల వాణిజ్య ప్రతినిధులు సోమవారం(ఈ నెల 23) నుంచి మూడు రోజుల పాటు సమావేశం కానున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు. ఇందులో భారత బృందానికి దర్పన్ జైన్ నేతృత్వం వహిస్తారని చెప్పారు. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంలో ఇది తుది అంశమన్నారు. మార్చిలో ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల అధినేతలు సంతకాలు చేసే అవకాశం ఉందని వివరించారు. భారత్-అమెరికా ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం వివరాలను సంయుక్త ప్రకటన ద్వారా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, అమెరికా విదేశాంగ మంత్రి రుబియో వచ్చే రెండుమూడు నెలల్లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని ఆ దేశ రాయబారి సెర్జియో గోర్ చెప్పారు.

ఒత్తిళ్లతోనే మోదీ అమెరికాకు దాసోహం: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆయన నోరునొక్కారని.. ఒత్తిళ్ల కారణంగానే ఆయన అమెరికాకు సంపూర్తిగా దాసోహమై ఒప్పందానికి అంగీకరించారని ఆరోపించారు. ఈ ఒప్పందంతో భారత్‌కు చాలా తక్కువ లబ్ధి కలుగుతుందని.. అమెరికాకు ఎన్నో ప్రయోజనాలని శుక్రవారం 'ఎక్స్'లో విమర్శించారు. 'అమెరికన్లను సంతృప్తిపరచడానికి మన అన్నదాతలను ఎందుకు బలిచేశారు? మన చమురు సరఫరాలను అమెరికా నియంత్రించేలా ఇంధన భద్రతపై ఎందుకు రాజీపడ్డారు' అని ప్రశ్నించారు. కాగా.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంతో రైతులపై పడే ప్రతికూల ప్రభావాలను తెలియజేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కిసాన్ సమ్మేళనాలను నిర్వహించనుంది. ఈ నెల 24న వీటికి శ్రీకారం చుట్టనున్నారు. ఆ కార్యక్రమానికి రాహుల్, ఖర్గే హాజరు కానున్నారు.

ఇరాన్‌పై పరిమిత దాడి: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: అమెరికాతో అణు చర్చల తర్వాత కొద్దిరోజుల్లో ప్రతిపాదిత ఒప్పందం సిద్ధమవుతుందని ఇరాన్ భావిస్తున్నట్లు ఆ దేశ దౌత్యవేత్త చెప్పినప్పటికీ.. ఇరాన్‌పై పరిమిత దాడులు సాధ్యమేనంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై పరిమిత సైనిక దాడి విషయాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అణు ఒప్పందం విషయమై ఇరు దేశాల మధ్య చర్చలు జరగుతున్న క్రమంలో ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు పరిమిత దాడికి ప్రయత్నిస్తారా అంటూ ట్రంప్‌ను ఓ జర్నలిస్టు అడగ్గా.. 'అవును.. ఆ విషయాన్ని పరిశీలిస్తున్నాను' అని చెప్పారు. అంతకుముందు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఖ్చీ ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రాబోయే రెండు, మూడు రోజుల్లో ముసాయిదా ఒప్పందాన్ని ఖరారు చేయాలని చూస్తున్నాం. అది పూర్తవ్వగానే వాషింగ్టన్‌కు పంపాలని యోచిస్తున్నాం' అని అన్నారు.

ట్రంప్ సుంకాలు చెల్లవ్!

(మొదటి పేజీ తరువాయి)

1977నాటి ఐఈఈపీఏ చట్టాన్ని ట్రంప్ ఉపయోగించిన తీరు ఆయన అధికార పరిధిని మించి ఉందంటూ దిగువ కోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో సమర్థించింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. "పన్నులు విధించే అధికారంలో ఏ భాగాన్నీ కార్యనిర్వాహక శాఖకు రాజ్యాంగం అప్పగించలేదు" అని ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ తన తీర్పులో విస్పష్టంగా పేర్కొన్నారు. గతంలో ఇతర అధ్యక్షులు ఈ చట్టాన్ని పలుమార్లు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ తన తీర్పులో విస్పష్టంగా పేర్కొన్నారు. గతంలో ఇతర అధ్యక్షులు ఈ చట్టాన్ని పలుమార్లు వినియోగించారుగానీ.. వారు ఆంక్షలు విధించడానికి మాత్రమే వాడారు. దిగుమతి పన్నులు వేయడానికి ఈ చట్టాన్ని వాడిన మొట్టమొదటి అధ్యక్షుడు ట్రంపే. ఈ నేపథ్యంలో.. "ఐఈఈపీఏలో అలాంటి అధికారం ఉందని ఇప్పటివరకూ ఏ అధ్యక్షుడూ గుర్తించకపోవడమే.. అసలు ఆ అధికారం అక్కడ లేదనడానికి బలమైన సాక్ష్యం" అని చీఫ్ జస్టిస్ రాబర్ట్స్ తన తీర్పులో పేర్కొన్నారు. అయితే.. మెజారిటీ తీర్పుతో న్యాయమూర్తులు శామ్యూల్ అలిటో, క్లారెన్స్ థామస్, బ్రెట్ క్యావనో విభేదించారు. అధ్యక్షుడి చర్య పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం కాదని, కొన్ని సందర్భాల్లో కార్యనిర్వాహక శాఖకు కూడా టారిఫ్‌లు విధించే అధికారం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. కాగా.. టారిఫ్‌ల రూపంలో ఇప్పటికే వందల కోట్ల డాలర్లు చెల్లించిన కంపెనీలు తిరిగి ఆ సొమ్మును పొందవచ్చా లేదా అనే విషయంపై కోర్టు ఎలాంటి ప్రస్తావనా చేయలేదు. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25% అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. "చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణను ముగించడానికి 2025 ఆగస్టు 6న ఆయన.. ప్రత్యక్షంగా/పరోక్షంగా రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా (25%) సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారు" అని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. ఎస్అండ్‌పీ 500, డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 0.4 శాతం మేర పెరగ్గా.. నాస్‌డాక్ కాంపోజిట్ 0.6% మేర పెరిగింది.



వసూలు చేసింది ఎంత?

జాతీయ అత్యవసర చట్టం కింద ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు (రూ.12 లక్షల కోట్లు) వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల (రూ.16 లక్షలకోట్ల)కు పైగానే ఉంటుందని అంచనా. "ఆ సుంకాలన్నింటినీ తిరిగి చెల్లించాలంటే.. అసలు ఏ వస్తువుపై ఎంత పన్ను పడింది? ఆ పన్ను భారాన్ని ఇప్పటికే కంపెనీలు వినియోగదారులపై వేశాయా? ఒకవేళ అలా వేసి ఉంటే.. ప్రభుత్వం తిరిగి ఇవ్వాల్సింది కస్టమర్లకా? కంపెనీలకా? ఇలాంటి ప్రశ్నలు పుట్టుకొస్తాయి. ఇవ్వకుంటే కంపెనీలు పెద్ద ఎత్తున కోర్టులను ఆశ్రయిస్తాయి. అందుకే.. 'తిరిగి చెల్లింపుల ప్రక్రియ గందరగోళంగా మారే అవకాశం ఉంది" అని న్యాయమూర్తి బ్రెట్‌క్యావనో హెచ్చరించారు. కాగా, ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధమంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. కట్టు తప్పిన వ్యవస్థను దారిలోకి తెచ్చేలా అమెరికా న్యాయవ్యవస్థ ఉందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ట్రంప్ టారిఫ్ విధానాలను కొట్టిపారేస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వడం గొప్ప నిర్ణయమంటూ జైరాం రమేశ్ పొగడ్తలు కురిపించారు.

ఇలా విధించారు!

నిరుడు ఏప్రిల్ 2న సుంకాల మోత మోగించిన ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: అమెరికాతో వాణిజ్యసంబంధాలున్న అన్ని దేశాలపైనా జాతీయ అత్యవసర చట్టం(ఐఈఈపీఏ) కింద 10% కనిష్ఠ (బేస్‌లైన్) సుంకం ఉంటుందని, తమపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై దానికి అదనంగా ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్టు గతేడాది ఏప్రిల్ 2న ట్రంప్ ప్రకటించారు. అందులో భాగంగా తమపై 52% సుంకాలు విధిస్తున్న భారతదేశంపై తాము అందులో సగం, అంటే 26% సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. చైనాపై 54%, యూరోపియన్ యూనియన్ దేశాలపై 20%, వియత్నాంపై 46%, థాయ్‌ల్యాండ్‌పై 36%, కంబోడియాపై 49%, తైవాన్‌పై 32%, జపాన్‌పై 24%, బంగ్లాదేశ్‌పై 37%, పాకిస్థాన్‌పై 29%, శ్రీలంకపై 44%.. ఇలా దేశాలవారీగా సుంకాల మోత మోగించారు. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది.

తీర్పును అధ్యయనం చేస్తున్నాం


- ప్రపంచ దేశాల స్పందన

లండన్, ఫిబ్రవరి 20: ట్రంప్ టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రపంచ దేశాలు స్పందించాయి. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది.

అమెరికా రాజ్యాంగం ఏం చెబుతోంది?

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: వివిధ దేశాలపై అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల్ని చట్టవ్యతిరేకమంటూ అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో.. ఆ తీర్పు ఉన్నదున్నట్లు అమలవుతుందా? ఎవరూ ఊహించని విధంగా ప్రవర్తించే ట్రంప్ ఏమైనా తిరకాసు పెడతారా? అన్న ఆసక్తి నెలకొంది. అమెరికా రాజ్యాంగం ఈ విషయంలో ఏం చెబుతోంది అన్న చర్చ మొదలైంది. మన దేశ రాజ్యాంగంలాగే అమెరికా రాజ్యాంగం కూడా అధికారం ఏ ఒక్క వ్యవస్థలోనూ కేంద్రీకృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది. దాని ప్రకారం.. పన్నులు, సుంకాలపై చట్టాలు చేసే అధికారం అమెరికా కాంగ్రెస్‌కు (ఆ దేశ అత్యున్నత చట్టసభకు) మాత్రమే ఉంది. ఆర్టికల్-1 ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించింది. ఆర్టికల్-2 అధ్యక్షుడి అధికారాల్ని నిర్వచిస్తుంది. దీని ప్రకారం, కాంగ్రెస్ చేసే చట్టాల్ని అధ్యక్షుడు అమలు చేయాలి. ఆర్టికల్-3 ప్రకారం చట్టాల్ని సుప్రీంకోర్టు విశదీకరిస్తుంది, న్యాయపరమైన వివాదాల్ని పరిష్కరిస్తుంది. సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో.. ఈ అధికారాల విభజననే ఉటంకిస్తూ.. పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌దేకానీ, అధ్యక్షుడిది కాదని స్పష్టం చేసింది. తద్వారా, ట్రంప్ విధించిన సుంకాలు చట్టవ్యతిరేకమని తేల్చింది. చట్టాలకు భాష్యం చెప్పే అధికారం కోర్టులదే కాబట్టి.. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పును పక్కనపెట్టటానికి ట్రంప్‌కు అధికారం లేదు. అంటే, ప్రస్తుతానికైతే, సుంకాలు వెనక్కి తీసుకోక తప్పదనే విశ్లేషకులు అంటున్నారు. అయితే, రాజ్యాంగాన్ని అనుసరిస్తూనే కొన్ని మార్గాల్లో ఆ తీర్పును అడ్డులేకుండా చేసుకునే అవకాశాలు ట్రంప్ ముందున్నాయి. అవేమిటంటే.. 1. అధ్యక్షుడు విధించిన సుంకాల్ని ఆమోదిస్తూ కాంగ్రెస్ చట్టం చేయటం 2. తదనంతర కాలంలో సుప్రీంకోర్టే.. ప్రస్తుతం ఇచ్చిన తీర్పును పక్కన పెట్టి కొత్త తీర్పు ఇవ్వటం. కాంగ్రెస్‌లో ట్రంప్‌నకు చెందిన రిపబ్లికన్ పార్టీకే మెజారిటీ ఉన్నందున.. చట్టం తీసుకురావటానికి అవకాశాలున్నాయి. అయితే, రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ విధానాలపై పూర్తి సానుకూలత లేదు. కొంత అసమ్మతి ఉంది. కాబట్టి, పార్టీ ఎంపీలందరూ మద్దతిస్తారా అన్న సందేహం కూడా వ్యక్తమవుతోంది.

లోకం తీరు



ముగ్గుర్ని నియమిస్తే.. ఒక్కరే అనుకూలం

తీర్పునిచ్చిన జడ్జీల్లో ముగ్గురు ట్రంప్ నియమించినవారే


క్యావనాప్

దిగుమతులపై భారీ సుంకాలను విధించడానికి ట్రంప్ ఈ చట్టాన్ని ఉపయోగించుకోవడాన్ని సవాల్ చేస్తూ.. ఈ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపార సంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. కానీ, ఆ ముగ్గురు జడ్జీల్లో బ్రెట్ క్యావనాప్ మాత్రమే అనుకూలంగా తీర్పునివ్వగా.. మిగతా ఇద్దరూ (నీల్ గోర్సచ్, అమీ కోనీ బారెట్) ప్రతికూల తీర్పునిచ్చిన మెజారిటీ జడ్జీల్లో ఉన్నారు. జడ్జీలే కాదు.. రిపబ్లికన్ పార్టీకి ఎప్పుడూ మద్దతుగా ఉండే వ్యాపార అనుకూల బృందాలన్నీ ఈ విషయంలో ట్రంప్‌ను వ్యతిరేకిస్తుండడం గమనార్హం. టారిఫ్‌ల వల్ల ధరలు కూడా పెరుగుతుండడంతో ప్రజల నుంచి కూడా వ్యతిరేకత వస్తోంది.

ఏడాదిలోనే 26 లక్షల కోట్లు

ట్రంప్ సుంకాలతో అమెరికా ఖజానాకు భారీగా ఆదాయం

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వస్తువులపై భారీగా సుంకాలు విధించటం ద్వారా అమెరికా ఖజానాను నింపాలన్న ట్రంప్ ఆశయం గతేడాది నెరవేరింది. 2025 ఏప్రిల్‌లో భారత్ సహా అనేక దేశాలపై సుంకాలను భారీగా విధించిన తర్వాత నుంచి కస్టమ్స్ డ్యూటీ, ఇతర పన్నులు, ఫీజుల ద్వారా అంతకు ముందు ఉన్న సుంకాలతో కలిపి మొత్తంగా దాదాపు రూ.26,06,300 (287 బిలియన్ డాలర్లు) కోట్ల ఆదాయం వచ్చింది. 2024తో పోల్చితే ఇది ఏకంగా మూడింతలు అధికం కావటం గమనార్హం. అన్ని దేశాలపై కలిపి ట్రంప్ సగటున 17%సుంకాలు విధించారు. 1932 తర్వాత ఇవే అత్యధిక సుంకాలు.

వాణిజ్య లోటు తగ్గినా..

ఇతర దేశాలతో అమెరికాకు ఉన్న వాణిజ్య లోటును తగ్గించి, తన దేశంలోని వస్తూత్పత్తి పరిశ్రమను బలోపేతం చేయటం కోసమే సుంకాలు విధిస్తున్నట్లు నాడు ట్రంప్ ప్రకటించారు. ఇతర దేశాల నుంచి అమెరికా కొంటున్న వస్తువులు అధికంగా, ఇతర దేశాలకు అమెరికా అమ్ముతున్న వస్తువులు తక్కువగా ఉంటున్నాయని.. ఈ పరిస్థితిని సుంకాల ద్వారా మార్చేస్తానని ఆయన తెలిపారు. ట్రంప్ ఆశించినట్లుగానే వాణిజ్య లోటు 2009 సెప్టెంబర్ స్థాయికి తగ్గింది. అయితే, అమెరికాలో తయారీ పరిశ్రమ భారీగా వృద్ధి సాధిస్తుందని, ఉద్యోగాల కల్పన జరుగుతుందన్న ట్రంప్ అంచనాలు తప్పాయి. సుంకాల వల్ల ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల ధరలు పెరిగినప్పటికీ.. అమెరికా కంపెనీలు కొనుగోళ్లను కొనసాగించాయి. దీంతో అమెరికాలో ఆ వస్తువుల ధరలు పెరిగి అంతిమంగా ఆ దేశ ప్రజలపైనే అధిక భారం పడింది. మరోవైపు అమెరికాలో వస్తూత్పత్తి ఆశించిన స్థాయిలో పెరగకపోవటంతో ఉద్యోగాల కల్పన కూడా జరగలేదు. సుంకాలు అధికంగా ఉన్న ఆటోమొబైల్ పరిశ్రమ మరింత ఒత్తిడికి గురైంది. అయితే, దీర్ఘకాలంలో దేశంలోనే కొత్త కంపెనీలు పుట్టుకొస్తాయని ట్రంప్ వాదన.

అమెరికా ప్రజలపైనే భారం

ట్రంప్ సుంకాలు అంతిమంగా ఆయన దేశ ప్రజలపైనే అధిక ధరల భారం మోపాయి. అమెరికా ప్రజలు వినియోగిస్తున్న వస్తువుల్లో అత్యధికం ఇతర దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుండటంతో.. సుంకాల వల్ల వాటి ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రిటైల్ సంస్థలు ప్రారంభంలో వస్తువుల ధరలను పెంచాయి. తర్వాతి కాలంలో కొనుగోలుదారులను కోల్పోవాల్సి వస్తుందన్న భయంతో లాభాలను కొంతవరకు తగ్గించుకొని ధరలను తగ్గించాయి. దీంతో 2025 చివరి నాటికి అమెరికాలో రిటైల్ ద్రవ్యోల్బణం సాధారణ స్థితికి వచ్చింది. అయినా, ట్రంప్ టారిఫ్‌ల వల్ల తమ జీవితాలు దుర్భరంగా మారాయని ఓ సర్వేలో 51% మంది తెలిపారు.

భారత ఎగుమతులకు మళ్లీ జోష్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ట్రంప్ ప్రతీకార సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయడంతో భారత ఎగుమతులకు మళ్లీ జోష్ రానుంది. ముఖ్యంగా భారత్ నుంచి వస్త్రాలు, పలు రకాల వ్యవసాయ ఉత్పత్తులు, రొయ్యలు, రత్నాలు-ఆభరణాలు, వాహన విడిభాగాలు, యంత్ర పరికరాల పరిశ్రమలు, ఎగుమతిదారులకు ప్రయోజనం కలగనుంది. ప్రతీకార సుంకాల రద్దుతో అమెరికా మార్కెట్లో భారత ఉత్పత్తుల ధరలు తగ్గి, డిమాండ్ ఊపందుకునే అవకాశముంది.

పాత టారిఫ్‌లు మూడు శాతమే..

ప్రతీకార సుంకాల కొట్టివేతతో భారత ఉత్పత్తులపై అంతకుముందటి యాంటీ డంపింగ్, కౌంటర్ వెయిలింగ్, జాతీయ భద్రత ఆధారిత టారిఫ్‌లు కొనసాగనున్నాయి. సుమారు రూ.75.3 వేల కోట్ల (8.3 బిలియన్ డాలర్లు) విలువైన ఉత్పత్తులకు అవి వర్తించనున్నాయి. అమెరికాకు భారత మొత్తం ఎగుమతులు రూ.7.26 లక్షల కోట్ల (80 బిలియన్లు)లో.. పాత సుంకాలు వర్తించే ఉత్పత్తుల విలువ సుమారు 10.4శాతమే. ప్రతీకార సుంకాల తరహాలో కాకుండా.. ఆయా ఉత్పత్తులను, రకాలను బట్టి వేర్వేరుగా ఆ టారిఫ్‌లు వర్తిస్తాయి. ఆ టారిఫ్‌లన్నీ కూడా ట్రంప్ సుంకాల కంటే చాలా తక్కువ. సగటున మొత్తం భారత ఉత్పత్తులపై సుంకాలు 3.3 శాతమే. అదే వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌పై ప్రకటన సందర్భంగా చెప్పిన సుంకాలు ఏకంగా 18శాతం కావడం గమనార్హం.

ఆయా ఉత్పత్తులపై పాత టారిఫ్‌లు ఇవీ..

డబ్ల్యూటీవోలో భారత్ సభ్యదేశం కావడంతో.. అమెరికా భారత్‌కు 'మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్)' హోదా ఇచ్చింది. దాని ప్రకారం చాలా ఉత్పత్తులపై టారిఫ్‌లు ఉండవు. కొన్నింటిపై మాత్రం ఉత్పత్తులు, వాటి ఉప ఉత్పత్తులకు విడివిడిగా ప్రత్యేక టారిఫ్‌లు వర్తిస్తాయి. భారత ఎగుమతుల్లో సగటున ఫార్మాపై 1.06%, రసాయనాలపై 7%, ఎలక్ట్రానిక్స్‌పై 0.45%, యంత్రాలు, కంప్యూటర్లపై 1.3%, వస్త్రాలపై 9%, ప్లాస్టిక్, కళాకృతులపై 8%, రత్నాలు-ఆభరణాలపై 2.1%, ఇనుము, ఉక్కుపై 5%, ఖనిజాలు, పెట్రోలియం ఉత్పత్తులపై 7% వరకు పాత టారిఫ్‌లు ఉన్నాయి.

బెంగాల్ 'సర్' విధుల్లో న్యాయాధికారులు

సుప్రీంకోర్టు అసాధారణ నిర్ణయం

- రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మధ్య నిందల పర్వం దురదృష్టకరమని వ్యాఖ్య


సుప్రీం ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పశ్చిమబెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-సర్) ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు అసాధారణ ఆదేశాలు జారీ చేసింది. సర్ విధుల్లో ప్రస్తుత, మాజీ జిల్లా న్యాయాధికారులను నియమించాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది. సర్‌పై బెంగాల్ సర్కారు, కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) మధ్య పరస్పర నిందల పర్వం కొనసాగుతోందని.. ఇది దురదృష్టకరమని అభిప్రాయపడింది. వాటి మధ్య విశ్వాసం లోపించిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం.పంచోలీ ధర్మాసనం శుక్రవారం వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో సర్ ప్రక్రియ పూర్తికి పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియలో ఎన్నికల అధికారులకు సాయం చేసేందుకు జ్యుడీషియల్ అధికారులను డిప్యుటేషన్‌పై నియమించాలని హైకోర్టును ఆదేశించింది. సర్ దరఖాస్తులపై వచ్చే అభ్యంతరాలను వీరు పరిశీలించి, పరిష్కరిస్తారని స్పష్టం చేసింది. బెంగాల్‌లో సర్ ప్రక్రియ పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ అధికారులను నియమించకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "రెండు రాజ్యాంగబద్ధ సంస్థల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం వ్యవస్థల మధ్య అపనమ్మకాన్ని సూచిస్తోంది. అభ్యంతరాల స్వీకరణ దశలో ఈ ప్రక్రియ ఆగిపోయింది" అని పేర్కొంది. సర్ ప్రక్రియ సజావుగా సాగేందుకు కొందరు న్యాయాధికారులను కేటాయించాలని, మరికొందరు మాజీ జిల్లా జడ్జిలు, అదనపు జిల్లా జడ్జిలను కూడా నియమించాలని కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్‌ను ధర్మాసనం ఆదేశించింది. శనివారం రాష్ట్ర సీఎస్, డీజీపీ, ఈసీ అధికారి, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్, కేంద్ర అదనపు సొలిసిటర్ జనరల్, హైకోర్టు రిజిస్ట్రార్లతో సమావేశమై నియామకాలను ఖరారు చేయాలని ఆదేశించింది. సర్ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా చూసేందుకు న్యాయాధికారులను నియమించడం తప్ప తమకు మరో మార్గం కనిపించలేదని వ్యాఖ్యానించింది. బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ.. ఈ నెల 28న తుది ఓటరు జాబితా ప్రచురణకు అనుమతి ఇస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. ఆ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. 28న తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు ఈసీకి అనుమతి ఇచ్చింది.

డీజీపీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది..

బెంగాల్ సీఎం మమత తరఫున శ్యామ్ దివాన్ వాదనలు వినిపిస్తూ.. ఓటరు జాబితా అధికారులు (ఈఆర్వో) ఇచ్చిన ఆదేశాలను ప్రస్తుతం ప్రత్యేక ఓటరు జాబితా అధికారులు (ఎస్ఆర్వోలు) పరిశీలిస్తున్నారని, వారి ఆదేశాలను ఎస్ఆర్వోలు ఎలా గంపగుత్తగా తిరస్కరిస్తారని ప్రశ్నించారు. ఈ ఆరోపణను ఈసీ తోసిపుచ్చింది. సర్ ప్రక్రియ ప్రారంభం నుంచీ ఎస్ఆర్వోలు ఉన్నారని తెలిపింది. ఈసీ తరఫు న్యాయవాది డీఎస్ నాయుడు వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం సహకరించడం లేదన్నారు. వివిధ పార్టీల నేతలు, సంస్థలు ఎన్నికల సంఘంపై చేసిన ప్రకటనలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. వారిపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదన్నారు. స్పందించిన సీజేఐ.. ఎన్నికల సమయంలో కొందరు బాధ్యతారహిత ప్రకటనలు చేస్తుంటారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోకపోతే డీజీపీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. అలాగే ఈసీ అధికారులకు భద్రత కల్పించాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ధర్మాసనం ఆదేశించింది.

తెల్లనివన్నీ పాలు కావు!

- ప్రతి 3శాంపిళ్లలో ఒకదాంట్లో కల్తీ..పాలల్లో యూరియా, కాస్టిక్ సోడా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఉదయం అల్పాహారం తీసుకోవడం కాస్త ఆలస్యమైనా భరిస్తాం కానీ కాఫీ, టీ చేతికి అందకపోతే కేకలేస్తాం! బడికి వెళ్లే పిల్లలైతే ఉదయం, సాయంత్రం గ్లాసుడు పాలు తాగుతారు. మరి.. పెద్దవాళ్లు, పిల్లలు తాగుతోంది నాణ్యమైన పాలేనా? ఎందుకీ అనుమానం అంటే.. ఇటీవల కొన్నేళ్ల నుంచి పాల నాణ్యతను పరీక్షిస్తే దేశవ్యాప్తంగా ప్రతి మూడు శాంపిళ్లలో ఒకదాంట్లో కల్తీ జరుగుతున్నట్లు నిర్ధారణ జరుగుతోంది. గుజరాత్‌లో ఇటీవల అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఓ డెయిరీ సంస్థపై అధికారులు దాడి చేస్తే దిగ్భ్రాంతికరమైన విషయం బయటపడింది. అక్కడ ప్రతి 300లీటర్ల స్వచ్ఛమైన పాలల్లో డిటర్జెంట్, యూరియా, కాస్టిక్ సోడా కలిపిన 1800 లీటర్ల ద్రావణాన్ని మిక్స్‌చేసి 'ప్యాకెట్ పాలు'గా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గత ఏడాది మధ్యప్రదేశ్‌లో ఓ డెయిరీ కంపెనీకి చెందిన తొమ్మిది కేంద్రాలపై ఈడీ అధికారులు దాడి చేశారు. ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు లేని పాల ఉత్పత్తులను బెహ్రెయిన్, సింగపూర్, ఒమన్, యూఏఈకి ఎగుమతి చేసేందుకు 63 ఫోర్జరీ పత్రాలను ఆ కంపెనీ నిర్వాహకులు సృష్టించినట్లు అధికారులు గుర్తించారు. 2025లో దేశవ్యాప్తంగా పాల ఉత్పత్తులకు సంబంధించి ప్రతి వంద శాంపిళ్లలో 38 శాంపిళ్లు పరీక్షలో విఫలమయ్యాయి. కాగా, గత పదేళ్లలో మనదేశంలో పాల ఉత్పత్తి 63.56% పెరగడం విశేషం. 2015లో 146 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తి జరిగితే 2025లో అది 239 మిలియన్ టన్నులుగా నమోదైంది. 2025లో తలసరి పాల లభ్యత 471 గ్రాములుగా నమోదైంది. ఇది ప్రపంచ సగటు(322 గ్రాములు) కన్నా ఎక్కువ.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్ గుప్తా

క్రీడా పోటీలతో పోలీసుల్లో మానసికోల్లాసం

- మంగళగిరి ఏపీఎస్పీలో పోలీస్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీసులకు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని హోం మంత్రి అనిత అన్నారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో రెండవ ఆలిండియా పోలీస్ సౌత్ జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్, ఐటీబీపీ, బోర్డర్ జట్ల సభ్యుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. హోంమంత్రి అనిత మహిళా సిబ్బందికి కూడా ఈ తరహా పోటీలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో పెరిగిన ఎండ.. కర్నూలులో 36.3 డిగ్రీలు

- నేడు, రేపు పిడుగులతో కూడిన వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఎండ తీవ్రత పెరిగింది. కర్నూలులో 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం శుక్రవారం బలహీనపడింది. అయితే దీనిపై ఆవరించిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయవ్యంగా పయనించి శ్రీలంక వైపు రానున్నది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

గంజాయి కేసులో భీమిలి ఎంపీటీసీ అరెస్టు

- కిర్లంపూడిలో పట్టుబడిన చెల్లూరి నగేష్‌బాబు
- నిందితుడికి బొత్స కుటుంబంతో సంబంధాలు!

కాకినాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పట్టుబడి పరారీలో ఉన్న నిందితుడును కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెంలో జగ్గంపేట పోలీసులు పట్టుకున్నారు. వీరిలో విశాఖ జిల్లా భీమిలి మండలం దాకమర్రికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు ఉన్నారు. నిందితుడు వైసీపీ ఎమ్మెల్సీ బొత్స మేనల్లుడికి, భీమిలి ఎంపీపీ సూర్యనారాయణరాజుకు ప్రధాన అనుచరుడని తెలుస్తోంది. జగ్గంపేట పోలీసుల కథనం ప్రకారం... గత సెప్టెంబరు 23న విశాఖ నుంచి కారులో గంజాయిని తరలిస్తుండగా నాగేశ్‌బు సహా 8 మందిని పోలీసులు గుర్తించారు. 355.570 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో నలుగురిని అరెస్టు చేయగా వారు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. మరో నలుగురు పరారీలో ఉండగా... వారిలో నగేష్‌బాబును శుక్రవారం అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ శ్రీనివాస్ వెల్లడించారు.

ఉగాదికి అన్ని దేవాలయాల్లో అక్షరాభ్యాసం

- హెచ్‌డీపీటీ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్(హెచ్‌డీపీటీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉగాది అన్ని దేవాలయాల్లో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల హెచ్‌డీపీటీ కోఆర్డినేటర్లు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు, అర్చకుల సమాఖ్యతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ గోదావరి, కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని ఇప్పటినుంచే ఆయా నదుల వెంట దేవతా వృక్షాలు నాటించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. మార్చి 7న కంచి పీఠాధిపతి, సీఎం చంద్రబాబు సమక్షంలో ప్రకాశం బ్యారేజీ నుంచి హంసలదీవి వరకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. దుర్గగుడి ఈవో శీనానాయక్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రాంప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగపూడి గోపాలకృష్ణ తదితరులు ప్రసంగించారు.

రామ్మూర్తి ఘనాపాఠి కన్నుమూత

- రుగ్వేద సలక్షణ ఘనాపాఠిగా కీర్తి.. ప్రముఖ వేద పండితుల సంతాపం



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత వేద పండితుడు రామ్మూర్తి ఘనాపాఠి(72) శుక్రవారం కన్నుమూశారు. తిరుపతి జిల్లా చంద్రగిరిలో నివసించే ఆయన కంచిలో ఉండే తనయుడు రాజీవ్‌ను చూడడానికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురైన ఆయన్ను ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం సాయంత్రం చంద్రగిరి తీసుకొచ్చి మిట్టపాళెంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. రామ్మూర్తి తండ్రి కృష్ణమూర్తి తిరుమలలో ఉంటూ ఇతర ప్రాంతాల్లో పౌరోహిత్యం నిర్వహించేవారు. రామ్మూర్తి తిరుమలలో పుట్టి, అక్కడి వేద పాఠశాలలో చదువుకొని, అదే పాఠశాలలో అధ్యాపకత్వం వహించారు. రుగ్వేదంపై పరిశోధన చేసి రుగ్వేద సలక్షణ ఘనాపాఠిగా కీర్తి గడించారు. దేశంలో వేద భాష్యం చదువుకున్న పది మంది వేద పండితుల్లో రామ్మూర్తి ఒకరు. జ్యోతిష్యంలో మంచి ప్రావీణ్యం ఉన్నట్టు శిష్యులు చెబుతారు. ఆయన వద్ద వేదం చదువుకున్న వందమంది ప్రస్తుతం తిరుమల సహా పలు ప్రముఖ క్షేత్రాల్లో వేదపండితులుగా ఉన్నారు. టీటీడీ ఈవోలుగా చేసిన రమణాచారి, ఐవైఆర్ కృష్ణారావు, ఎల్వీ సుబ్రమణ్యం వేద సంబంధ అంశాలను తెలుసుకునేందుకు ఈయనను సంప్రదించేవారు. రామ్మూర్తి మృతి పట్ల పలువురు ప్రముఖ వేద పండితులు సంతాపం ప్రకటించారు.



మిరప ఎగుమతికి నాణ్యతే కీలకం: : మంత్రి అచ్చెన్న

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యమైన మిర్చికి విపరీతమైన డిమాండ్ ఉందని, రైతులు దీనిపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరులో శుక్రవారం జరిగిన మిర్చి యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. 2019-24 మధ్య ధ్వంసమైన యార్డును పునఃనిర్మాణం చేయాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉందన్నారు. గుంటూరు యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు మాట్లాడుతూ దేశంలోనే యార్డు ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.



శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని వన్నమ్మకాలనీ సమీపంలో 81 సెంట్ల విస్తీర్ణంలో సొంతింటి నిర్మాణానికి తన సతీమణి వసుంధరాదేవితో కలిసి శుక్రవారం భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



ఐఓఎన్ఎస్ తొమ్మిదవ సదస్సుకు హాజరైన వివిధ దేశాల నౌకాదళ అధికారులతో భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి

పరస్పర సహకారంతోనే సముద్రాల రక్షణ!

- ఏ దేశానికి సాయం కావాలన్నా భారత్ సదా సిద్ధం
- నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి వెల్లడి
- విశాఖలో ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం నిర్వహణ
- 33 దేశాల నౌకాదళ ప్రతినిధులు హాజరు
- థాయ్ నేవీ నుంచి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భారత్
- 16 సంవత్సరాల తర్వాత తిరిగి అధ్యక్ష స్థానంలోకి

విశాఖపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత దేశాలు అవసరమైన సమయాల్లో ఒకరికొకరు సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకున్నపుడే సముద్రాలు సురక్షితంగా ఉంటాయని భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి అన్నారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో భాగంగా హిందూ మహా సముద్రాన్ని ఆనుకొని ఉన్న దేశాల నౌకాదళ ప్రతినిధులతో 'ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం(ఐఓఎన్ఎస్)' తొమ్మిదో సదస్సును విశాఖలోని నోవాటెల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో నౌకాదళ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి మాట్లాడుతూ ఐఓఎన్ఎస్‌కు ఇప్పటివరకూ రాయల్ థాయ్ నేవీ అధ్యక్షత వహిస్తుండగా, ఇప్పుడు ఆ బాధ్యతను భారత నౌకాదళం స్వీకరించిందన్నారు. పరిశీలక దేశంగా ఫిలిప్పీన్స్ వ్యవహరించనుందని తెలిపారు. సహాయ కార్యక్రమాల బృందంలో కొత్తగా ఒమన్ చేరిందన్నారు. 2008 నుంచి 2010 వరకు భారత నౌకాదళం నాయకత్వం వహించిందని, తిరిగి పదహారేళ్ల తర్వాత అధ్యక్ష పదవి చేపట్టిందని తెలిపారు. ఇటీవల హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు, మానవ సంక్షోభాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, అలాంటి సందర్భాలలో పొరుగు దేశాలు తగిన సాయం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో భారతదేశం అన్ని రకాలుగా ఉన్నతస్థానంలో ఉందన్నారు. నేవీ నౌకలు పెద్ద మొత్తంలో ఆహారం, నీరు, మందులు, ఇంజనీరింగ్ పరికరాలు, వైద్య బృందాలను తీసుకెళ్లగలుగుతాయని, వాటికి హెలికాప్టర్లు కూడా అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. గాలింపు, రక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టగలుగుతామని, ఏ దేశానికి ఎలాంటి సాయం కావాలన్నా చేయడానికి భారత నౌకాదళం సదా సిద్ధంగా ఉంటుందన్నారు. ఇలాంటి వాటి కోసమే సాగర్, మిషన్ సాగర్-2లను 2020లోనే ప్రారంభించామని చెప్పారు. కొవిడ్ సమయంలో భారత నౌకలు కేసరి, ఐరావత్ ఆహారం, మందులు, ఆక్సిజన్ తదితరాలను మాల్దీవులు, మారిషస్, సీషెల్స్, మడగాస్కర్, సూడాన్, మొజాంబిక్‌లకు అందించాయని తెలిపారు. ఆపరేషన్ సముద్ర సేతు కూడా నేవీ సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. 2024లో కెన్యాలో వరదలు వచ్చినప్పుడు ఐఎన్ఎస్ సుమేధ భారీగా సహాయ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. మయన్మార్ భూకంపం సమయం(2025)లో ఆపరేషన్ బ్రహ్మ, శ్రీలంక తుఫాన్ సమయంలో ఆపరేషన్ సాగర్ బంధు భారతదేశం నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ఇవన్నీ ఒక్కరే చేస్తే సరిపోదని, అన్ని దేశాలూ వీలైనంతగా ఒకరికొకరు సహకరించుకోవాలని, అదే ఈ సదస్సు ఉద్దేశమని వివరించారు. సదస్సుకు 33 దేశాల నౌకాదళ ప్రతినిధులు హాజరయ్యారు. అప్‌గ్రేడ్ చేసిన ఐఓఎన్ఎస్ వెబ్‌సైట్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- పల్లెబాట పట్టిన నేవీ డెలిగేట్స్.. ఆడి పాడిన విదేశీ వనితలు
- 50 దేశాల అధికారుల కుటుంబాల సందడి



విశాఖ జిల్లా పెందుర్తి మండలం పెద్దగాడిలోని సంకల్ప కళా గ్రామంలో సందడి చేస్తున్న వివిధ దేశాల నేవీ అధికారుల కుటుంబాల మహిళలు

పెందుర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026లో పాల్గొనేందుకు విశాఖ విచ్చేసిన దేశ, విదేశాలకు చెందిన నౌకాదళ అధికారుల కుటుంబ సభ్యులు పల్లె వాతావరణంలో సందడి చేశారు. సుమారు 50 దేశాలకు చెందిన ప్రతినిధులు శుక్రవారం ప్రత్యేక బస్సులో విశాఖ జిల్లా పెందుర్తి మండలం పెదగాడిలోని సంకల్ప కళా గ్రామాన్ని సందర్శించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఉల్లాసంగా గడిపారు. గ్రామంలో నిర్వహించిన టై అండ్ డై వర్క్‌షాపులో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సహజ సిద్ధమైన రంగులతో ఉన్న చేనేత వస్త్రాలను చూసి మురిసిపోయారు. స్వయంగా వస్త్రాలు నేసి, రంగులు అద్దారు. మగ్గంతో నేతపై ఆసక్తి కనబరిచారు. కొబ్బరి చిప్పలతో చేసిన కళాకృతులు, దేశీయ హస్తకళలను తిలకించారు. భక్తి గీతాలకు కోలాటం కళాకారులతో కలిసి నృత్యాలు చేశారు. వెదురు టోపీలు ధరించారు. కంచు బిందెలు తలపై, నడుముపై పెట్టుకుని ర్యాంప్ వాక్ చేసి నవ్వులు పూయించారు.

ఐకానిక్ భవనాలపై సబ్‌కమిటీ తొలి సమావేశం

- శాఖల వారీగా ఉద్యోగుల వివరాలు, అవసరమైన స్థలం, సదుపాయాలపై చర్చించాలంటూ అధికారులకు ఆదేశం
- కచ్చితమైన వివరాలకు ప్రతి శాఖ నుంచి ఒకరిని నామినేట్ చేయమని సీఎస్‌ను కోరతాం: మంత్రి నారాయణ



రాజధాని అమరావతిలో హైకోర్టు నూతన భవన నిర్మాణంలో శుక్రవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. ఒకేసారి నాలుగు రాఫ్ట్‌ల్లో ఏకధాటిగా 15వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ శ్లాబ్ (రాఫ్ట్) నిర్మాణానికి మంత్రి నారాయణ పనులు ప్రారంభించారు.

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ఐకానిక్ భవనాల నిర్మాణం, పార్కింగ్ సదుపాయాలు వంటి అంశాలతో పాటు రాష్ట్ర స్థాయి ఉద్యోగులు ఎంత మంది ఉన్నారనే దానిపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. సచివాలయంలో ఏ శాఖకు ఎంత స్థలం అవసరమవుతుంది అనే దానిపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం మొదటసారి సమావేశమైంది. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, బాలవీరాంజనేయ స్వామి, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. 'శాఖల వారీగా ఉద్యోగుల వివరాలు, వారికి కావాల్సిన స్థలం, సదుపాయాలపై చర్చించాలని అధికారులను ఆదేశించాం. 2014-19 మధ్యలో 52.72 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో భవనాలు డిజైన్ చేశాం. దానిలో కార్పెట్ ఏరియా 31.71 లక్షల చ.అడుగులు. ఆ కాలంలో 26,700 మంది ఉద్యోగులు ఉన్నారన్న సమాచారం మేరకు డిజైన్ చేశాం. అయితే ప్రస్తుతం ఉన్న అవసరాలపై పూర్తిగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు కేబినెట్ సబ్‌కమిటీని నియమించారు. తాజా సమాచారం ప్రకారం మొత్తం 39,882 మంజూరైన పోస్టులున్నాయి. అయితే కచ్చితమైన లెక్కల కోసం ప్రతి డిపార్ట్‌మెంట్ నుంచి ఒకరిని నామినేట్ చేయాలని సీఎస్‌ను కోరుతాం. మరో వైపు ఇటీవల కొత్తగా నిర్మించిన నయారాయపూర్, హైదరాబాద్‌లోని సచివాలయాలను కూడా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. వచ్చే సోమవారం మరోసారి సబ్‌కమిటీ సమావేశమై ఆయా అంశాలపై చర్చిస్తుంది. రాజధానిలో సాధారణ పరిపాలనశాఖ టవర్‌తో పాటు నాలుగు హెచ్‌ఓడీ టవర్లను ప్రభుత్వం నిరిస్తుంది. ఈ టవర్లను ఐకానిక్ భవనాలుగా నిర్మించేలా ప్రభుత్వం డిజైన్లు రూపొందించింది. ఇప్పటికే పనులు కూడా ప్రారంభమయ్యాయి. గతంలో సెక్రటేరియట్‌లో కేవలం ముఖ్యకార్యదర్శులతో పాటు ఆయా శాఖలకు చెందిన సెక్షన్లు మాత్రమే ఉండేవి. కానీ కొత్తగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల్లో సెక్రటేరియట్ విభాగాలతో పాటు శాఖాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్ కార్యాలయాలు కూడా ఒకే చోట ఉండేలా నిర్మాణం చేస్తున్నారు' అని మంత్రి నారాయణ వివరించారు.


శ్రీశైలం ఆలయంలో కల్తీ నెయ్యిపై సమగ్ర విచారణ చేయాలి : ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో జరిగిన కల్తీ నెయ్యి వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు డిమాండ్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో మే 2023 నుంచి మార్చి 2024 వరకు కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని తెలిపారు. అంతకుముందు విజయా డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యిని కాదని.. డెయిరీ సంస్థలే కాకుండా ట్రేడర్స్ కూడా పాల్గొనవచ్చు అని నిబంధనలు మార్చి టెండర్లు నిర్వహించారని వివరించారు. దీంతో ఆనాడు ఎలాంటి అనుభవం లేకపోయినా రాజేశ్ కార్పొరేషన్‌కు టెండర్లు అప్పజెప్పారని, వారి హయాంలోనే ఈ కల్తీ నెయ్యి సరఫరా జరిగిందన్నారు. దీని వెనుక గత ముఖ్యమంత్రి జగన్ కేబినెట్‌లోని ఒక మంత్రి, అప్పటి ఓ శాసనసభ్యుడితో పాటు ఓ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి హస్తం ఉందని ఆరోపించారు.

బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

ఆన్‌లైన్‌లో రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌తో కార్యకలాపాలు

- నెల్లూరులో ఇద్దరు అరెస్టు.. మరో ఇద్దరు పరార్
- రూ.34 లక్షలు, ల్యాప్‌టాప్, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- బ్యాంక్ ఖాతాలోని మరో రూ.1.64 కోట్లు సీజ్



స్వాధీనం చేసుకున్న నగదు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, కత్తులను పరిశీలిస్తున్న నెల్లూరు ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు ఎస్పీ అజిత వేజెండ్ల శుక్రవారం ఆ వివరాలను విలేకరులకు వెల్లడించారు. నెల్లూరులోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ వ్యాపారిని ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ఫోన్ నెంబరును బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన కె.వేణుగోపాల్ ఇచ్చాడు. దీంతో వ్యాపారి పలు దఫాలుగా ఆ నెంబర్‌కు రూ.53 లక్షల నగదు డిపాజిట్ చేశారు. ఆదాయం రాకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సాంబశివరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందం గురువారం రాత్రి బుచ్చిరెడ్డిపాలెంలో వేణుగోపాల్‌కు చెందిన ఓ గదిలో తనిఖీ చేసింది. వేణుగోపాల్‌తోపాటు అక్కడే ఉన్న బి.వెంకటరమణను అదుపులోకి తీసుకుని విచారించగా క్రికెట్ బెట్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. వేణుగోపాల్ అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరితో కలిసి ఆర్777 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వేణుగోపాల్, వెంకటరమణలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.34,65,800 నగదు, ల్యాప్‌టాప్, టీవీ, 13 మొబైల్ ఫోన్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలోని రూ.1,64,74,600ను సీజ్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.

ఆర్టీసీ ఎండీగా బాలసుబ్రహ్మణ్యం బాధ్యతల స్వీకరణ



ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు తీసుకుంటున్న బాలసుబ్రహ్మణ్యం

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ఆర్టీసీ) వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్‌గా ఎన్.బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని, ప్రాధాన్యత క్రమంలో అవసరమైన పనులు త్వరితగతిన చేపడతానని, ఉద్యోగుల ప్రమోషన్స్, బెనిఫిట్స్‌పై దృష్టి సారిస్తానని, ఎలక్ట్రిక్ బస్సులను త్వరగా అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శుభ సంకేతాలు

బంగ్లాదేశ్ ఎన్నికల్లో తమ ఘోరపరాజయానికి మాజీ ప్రధాని షేక్‌హసీనా, భారతదేశం, ఇప్పుడు ఘనవిజయం సాధించిన తారీఖ్ రహ్మాన్ ఉమ్మడి కుట్ర కారణమని నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్సీపీ) నాయకుడు నహీద్ ఇస్లామ్ గురువారం చేసిన ఆరోపణలో ఏ మాత్రం నిజం ఉన్నా సంతోషించాల్సిందే. ఆయన చెప్పినట్టుగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ ఘనవిజయంలో భారతదేశం కీలకహస్తం ఉన్నపక్షంలో తారీఖ్ రహ్మాన్ కొత్తప్రభుత్వంతో దౌత్యసంబంధాలకు ఇక తిరుగే ఉండదని అర్థం. హసీనాకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమాన్ని నడిపి, ఆమెను దేశంనుంచి వెళ్ళగొట్టిన ఈ నాయకుడు తమ కష్టమంతా సీట్లుగా మారనందుకు నిరాశలో ఏదో మాట్లాడుతున్నాడు. జమాత్ ఏ ఇస్లామీ కూటమి అద్భుతవిజయాలు సాధించి అధికారంలోకి రావాల్సివుండగా, ఈ కుట్రవల్లనే అది దూరంగా ఉండిపోవాల్సివచ్చిందని నహీద్ అంటున్నారు. ఎన్నికల్లో బీఎన్పీ ఘనవిజయం సాధించగానే దేశంలో చాలాచోట్ల స్థానిక అవామీలీగ్ నాయకులు తమ పార్టీ కార్యాలయాలు తెరిచారని, తామే ఎన్నికల్లో గెలిచినంత సంబరంగా నినాదాలు చేశారని, ఉమ్మడికుట్రకు ఇది బలమైన నిదర్శనమని ఈ యువనేత అంటున్నాడు. హసీనాను దేశంనుంచి తరిమివేసిన తరువాత ఆమె పార్టీ నాయకులమీదా, హిందువులతో సహా ఆమె మద్దతుదారులమీదా జమాతే దాడులు చేసిన సంగతి తెలిసిందే. నోబెల్ పురస్కార గ్రహీత మహ్మద్ యూనిస్ అండదండలతో బంగ్లాదేశ్‌లో జమాతే శక్తులు వరుస హత్యలకు తెగబడ్డాయి. హసీనా పేరెత్తడానికే వొణికిపోయే వాతావరణాన్ని తాము సృష్టిస్తే, ఇప్పుడు బీఎన్పీ రాగానే పరిస్థితులు మళ్ళీ మొదటికొచ్చాయని ఇతగాడి బాధ కాబోలు.

అధ్యక్షుడి అధికారిక నివాసం బంగభవన్‌లో కాక, పార్లమెంట్ భవనంలో పదవీ ప్రమాణం చేయడం ద్వారా తారీఖ్ రహ్మాన్ చక్కని సందేశం ఇచ్చారు. ఏడాదిన్నరపాటు అల్లకల్లోలంగా ఉన్న దేశం తిరిగి గాడినపడిన ధైర్యం బంగ్లాదేశీయులకు కచ్చితంగా కలిగివుంటుంది. ఇద్దరు బేగమ్‌ల మధ్య దశాబ్దాలపాటు సాగిన యుద్ధంలో బంగ్లాదేశ్ నలిగిపోయింది. సమస్త వ్యవస్థలూ ఆ గట్టూ ఈ గట్టూ లెక్కనే పనిచేశాయి. ఇప్పుడు ఖలీదా ఈ లోకంలో లేరు, హసీనా దేశంలోనే లేరు కనుక ఒక కొత్తశకం ఆరంభమైందని బంగ్లామేధావులు నమ్ముతున్నారు. తారీఖ్ రహ్మాన్ తన తీరులో, మాటలో ఇప్పటికైతే ప్రజాస్వామికంగానే కనిపిస్తున్నారు. బంగ్లా ప్రజలకు అసలైన ప్రజాస్వామ్యాన్నీ, హక్కులనూ హామీ ఇస్తున్నారు. మత, జెండర్ వివక్షలు లేని సమాజం గురించి మాట్లాడుతున్నారు. ఒక రాజకీయ కుటుంబం వారసుడుగా కాక, దేశాన్ని ఉద్ధరించి, ఉచ్ఛస్థితిలో నిలపెట్టబోయే మహానాయకుడుగా జనానికి కనిపించే ప్రయత్నం చేస్తున్నారు. దేశం మొత్తాన్ని ఒక్కటిగా ఉద్దేశించి మాట్లాడుతున్నారు. సంప్రదాయ బీఎన్పీ ఓటర్లతోపాటు అవామీలీగ్ ఓటర్లు, ముఖ్యంగా తమ రక్షణ గురించి తీవ్రంగా భయపడుతున్న హిందూ ఓటర్లతో సహా మైనారిటీలంతా ఆయనకే ఓటుచేశారు. యూనిస్ ఏలుబడిలో తమకు జరిగిన అన్యాయం ఇక పునరావృతం కాబోదని వారు ఆశపడుతున్నారు. తాలిబాన్ ఏలుబడిలో అఫ్ఘానిస్థాన్ మాదిరిగా తమ దేశం తయారు కాకూడదని కోరుకున్నవారంతా జమాతేను తారీఖ్ అదుపు చేయగలరని నమ్ముతున్నారు. తన రాజకీయమనుగడకోసం తారీఖ్ తీరు మార్చుకోరని అనుకుంటున్నారు.

ఖలేదాజియా అనారోగ్యంతో ఉన్నప్పుడూ, అనంతరకాలంలోనూ భారతదేశంనుచి తారీఖ్‌కు సానుకూల, సయోధ్య సందేశాలు అనేకం అందాయి. ఆయన కూడా చక్కగానే ప్రతిస్పందించాడు. అయితే, షేక్ హసీనా అప్పగింత వ్యవహారం ఉభయదేశాల మధ్యా ఒక కీలకమైన, వివాదాస్పద అంశంగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు. కానీ, ఆ విషయంలో ఒత్తిడి కొనసాగిస్తున్నప్పటికీ, ఇతరత్రా అంశాల్లో సత్సంబంధాలతో దానిని ముడిపెట్టే ఆలోచన తమకు లేదని తారీఖ్ రహ్మాన్ పార్టీ తన ఘన విజయం అనంతరం విస్పష్టంగా ప్రకటించడం పెద్ద ఊరట. హసీనాకాలం నాటి సాన్నిహిత్యం సాధ్యపడకపోయినా, యూనిస్ ఏలుబడిలో మాదిరిగా ఉభయదేశాల సంబంధాలు దిగజారవని అనుకోవచ్చు. అయితే, 208 స్థానాల్లో 68 గెలుచుకొని రెండవ అతిపెద్దపార్టీగా అవతరించిన జమాతే ఇస్లామీ, వాటిలో 58 స్థానాలు భారత్ సరిహద్దుల్లోనే సాధించిన విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రధానంగా పశ్చిమబెంగాల్, అసోం రాష్ట్రాలకు అటువైపున ఈ సంస్థ బలంగా ఉన్నందున, భారత్ అప్రమత్తంగా ఉండటంతో పాటు, మన నాయకుల మాటలూ చేష్టలూ అదుపులో ఉండటం కూడా అవసరం.

ఆశ గొలుపుతూ భయపెడుతున్న ఏఐ

నవ నవీన సాంకేతిక కృత్రిమ మేధ మన జీవితాలలోకి ప్రవేశించింది. ఇది మానవ సామర్థ్యాలను, ఉత్పాదకతను ఇతోధికంగా (ఇది చాలా చిన్న విశేషణమే) పెంపొందిస్తోందన్న మాట ఎటువంటి మినహాయింపు లేని నిజం.

భారత్‌కు మానవ వనరులు అపారంగా ఉన్నాయి. కనీసం 2050 సంవత్సరం దాకా ఇవి అంతకంతకూ పెరుగుతూనే ఉంటాయి. అయితే మన మానవ వనరుల నాణ్యత, అభివృద్ధి చెందిన దేశాలలోని మానవ వనరుల నాణ్యతకు భిన్నమైనది. అభివృద్ధి చెందిన ప్రతి దేశంలోనూ ప్రతి ఒక్కరూ పాఠశాల విద్య పూర్తి చేసినవారై ఉంటారు. వారిలో అత్యధికులు కళాశాల విద్యాభ్యాసాన్ని కూడా తప్పక పూర్తి చేస్తారు. జీవిత పర్యంతం చదువుకునే, కొత్త నైపుణ్యాలను సమకూర్చుకునే అవకాశాలు అభివృద్ధి చెందిన దేశాలలో పుష్కలంగా ఉన్నాయి. మన దేశంలో జనాభా లబ్ధి (పనిచేసే వయసుగల వారి సంఖ్య అత్యధికంగా ఉండడం)తో జనాభా భారాలు అనివార్యమవుతున్నాయి. పని చేయగల వారికి ఉపాధి లభించక పోతే వారు దేశానికి భారమవడంతో పాటు సామాజిక అశాంతి ప్రబలిపోయి జనాభా లబ్ధి జనాభా విపత్తుగా పరిణమించే ప్రమాదమూ ఉన్నది. ప్రాథమిక విద్య స్థాయిలో బడుల్లో చేరేవారి సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ ప్రాథమికోన్నత, మాధ్యమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్న వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఉన్నత విద్య స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి 40 నుంచి 50శాతంగా ఉంటోంది. కళాశాల విద్యార్థుల్లో చాలా మంది అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ సముపార్జించుకుంటున్నారు. అయితే ఆ అర్హతతో వారికి ఎటువంటి 'నైపుణ్యాలు' సమకూరడం లేదు. 'ఉద్యోగ నియామకాలకు అర్హులు' కాలేకపోతున్నారు. అసంఖ్యాక యువతీ యువకులకు సరైన ఉద్యోగం లభించకపోవడానికి ప్రధాన కారణం– వారు నైపుణ్యాలు, ఇతర అర్హతలు కొరవడినవారు కావడమే. ఇది ఎవరూ కొట్టివేయలేని ఒక కఠోర వాస్తవం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

Dario Amodei (ఆంత్రోపిక్ సీఈఓ) రాసిన 'The Adolescence of Technology' సారాంశాన్ని చదివాను. సకల వృత్తి రంగాలలోను కార్మిక మార్కెట్లను ఏఐ మనుముందెన్నడు చూడని రీతిలో మహా వేగంగా విచ్ఛిన్నం చేస్తుందని, చాలా ఉద్యోగాలను, ముఖ్యంగా వైట్ కాలర్ ఉద్యోగాలను సమీప భవిష్యత్తులోనే మటుమాయం చేస్తుందని డేరియో పేర్కొన్నారు. ఈ సంభావ్య వాస్తవం భయం కలిగించడం లేదా? భారత్‌లో ఏఐ కులాన్ని గుర్తిస్తుందని మరో అధ్యయనం వెల్లడించింది. ఏఐకు కుల పక్షపాతాలు నేర్పేనా? ఊహించడానికే భయానకంగా లేదా? సందేహం లేదు, ఇవి వణుకు పుట్టిస్తున్న భయాలు.

కృత్రిమ మేధ భవిష్యత్తు ద్వారాలు తెరిచిందని, అద్భుతావకాశాలు వేస్తోందని మన ప్రధానమంత్రి సరిగానే చెప్పారు. మరి ఉద్యోగాలను కోల్పోతామనే భయమూ ఉన్నది. టిక్కెట్ల జారీ, వాటి తనిఖీదారులు, బస్సు, రైలు కండక్టర్లు, రైల్వే సిగ్నల్ పర్సన్స్, ట్రాఫిక్ పోలీస్ ఆఫీసర్లు, స్టెనోగ్రాఫర్లు, టైపిస్టులు, టూరిస్ట్ గైడ్స్, ట్రాన్స్‌లేటర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ బ్యాంక్ టెల్లర్స్, ప్రైవేట్ ట్యూటర్స్ తదితర ఉద్యోగాలు అంతరించిపోతాయి. వైట్ కాలర్ ఉద్యోగాలకు సంబంధించిన చాలా పనులు స్వయంచాలకమవుతాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ చెప్పారు. 2025లో ఆ కంపెనీ వేలాది ఉద్యోగాలను రద్దు చేసింది. తమ సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 12వేల మంది ఉద్యోగులను 'పంపించివేస్తున్నట్టు' టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 2025లోనే ప్రకటించింది. రాబోయే ఐదేళ్లలో ఐటీ సర్వీసుల్లో ఉద్యోగాలు పోతాయని, బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ సంస్థలు దాదాపుగా అదృశ్యమైపోతాయని వెంచర్ క్యాపిటలిస్ట్, టెక్నాలజీ బిలియనీర్ వినోద్ ఖోస్లా గట్టిగా చెబుతున్నారు.



'పని'– మనిషిని నిర్వచిస్తుంది. ఆహారం కోసం వేటాడడం మినహా మరే జీవీ స్వచ్ఛందంగా పనిచేయదు. మనం చేసే సమస్త పనులను ఏఐనే చేసి, అందరికీ సిరిసంపదలు సమకూరిస్తే ఇక మనుషులు చేసేదేమిటి? ఈ ప్రశ్న గురించి మనం లోతుగా ఆలోచించాలి.

ఉద్యోగాల కొరతే భారతదేశాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య. 'అధికారిక' గణాంకాల ప్రకారం నిరుద్యోగిత రేటు ప్రస్తుతం 5.1శాతంగా ఉన్నది. అయితే అది మరింత అధికంగా ఉండి ఉంటుందని మనకు తెలుసు. యువత నిరుద్యోగిత రేటు 15 శాతం. 'ఉద్యోగాల్లో' ఉన్నవారిలో 55శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నవారు లేదా రోజువారీ వేతనాల శ్రామికులే. సంపన్న ప్రాంతాలలో వ్యవసాయ కార్యకలాపాలు ఇప్పటికే యాంత్రీకరణ అయ్యాయి. పట్టణ ప్రాంతాలలో బ్లూ కాలర్ ఉద్యోగాలు కూడా భారీగా తగ్గిపోయాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఐటీ ఉత్పత్తులు, 'సేవలు మొదలైన 'నైపుణ్యాల' రంగాలలోని విద్యావంతులైన యువతకు కూడా ఉద్యోగ రాహిత్యం వేగంగా వ్యాపిస్తోంది. పరిస్థితులు దిగజారుతూ భయానకమవుతున్నాయి.

కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో మనమేమీ వెనుకబడి లేము. అయితే ఈ సత్వర అమలు వల్ల ఫ్యాక్టరీ ఉద్యోగాలు గణనీయంగా తగ్గిపోయాయన్నది కూడా కొట్టివేయలేని వాస్తవం. నవ సాంకేతికతల సృష్టికి, వాటి వ్యాప్తికి మధ్య కొంత వ్యవధి ఉంటుందని, ఈ వెసులుబాటు సమయంలో కఠినచర్యలు తీసుకుంటే అధునాతన సాంకేతికత వాడకంతో ఉత్పన్నమయ్యే ప్రతికూల ప్రభావాలను తగ్గించుకోవచ్చని లండన్ మ్యాగజైన్ 'ఎకనామిస్ట్' పేర్కొంది. ఏఐ అనివార్య ప్రభావ ఉధృతికి భారత్ ఎలా సంసిద్ధమవ్వాలో చూద్దాం.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలే కాకుండా మన దేశంలో పాఠశాల స్థాయిలోనే విద్యాభ్యాసం నుంచి వైదొలుగుతున్న వారికోసం వివిధ రకాల ఉద్యోగాలను సృష్టించవలసిన అవసరమున్నది. అభిరుచి, ప్రతిభల ప్రాతిపదికన ఉన్నత పాఠశాల స్థాయిలో అకడమిక్, నాన్–అకడమిక్ విద్యార్థులను వేరు చేయాలి. సైన్స్ యేతర సబ్జెక్టుల్లో బహుళ సంఖ్యలో ఉన్న 'పాస్' కోర్సులకు స్వస్తి చెప్పి, ఆ విద్యార్థులను స్టెమ్ లేదా స్కిల్లింగ్ కోర్సుల వైపు మళ్లించాలి. విద్య, ఆరోగ్యభద్రత, పర్యావరణ నిర్వహణ రంగాలలో పెద్ద ఎత్తున మదుపులు చేయాలి. స్థానికంగా నాణ్యమైన సరుకుల, సేవల ఉత్పత్తిని, వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఇందుకు స్థానిక, ప్రాంతీయ మార్కెట్లు అవసరమైన మద్దతును బ్యాంకులు సమకూర్చాలి. బిగ్ బిజినెస్, బిగ్ మార్కెట్స్, బిగ్ చైన్స్, బిగ్ బ్యాంకులపై మోజును విడనాడాలి. ఈ దృష్ట్యా ప్రస్తుతం పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టిస్తున్నది ఎమ్ఎస్ఎమ్ఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) అన్న వాస్తవాన్ని గుర్తించాలి, అంగీకరించాలి. ఐటీ మంత్రి హామీ ఇచ్చినట్టుగా ఎమ్ఎస్ఎమ్ఈలకు ఏఐ సాంకేతికతలు సమకూరితే అవి మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తాయనడంలో సందేహం లేదు. నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు భారత్ ఏటా కనీసం 80 లక్షల ఉద్యోగాలను సృష్టించవలసి ఉన్నదని సీఈఏ అన్నారు. నిజానికి అంతకంటే ఎక్కువ ఉద్యోగాలనే సృష్టించవలసి ఉన్నదన్న వాస్తవం ఆయనకు మాత్రం తెలియదా? ఏఐను ఉపయోగించుకోవడం ద్వారా ఉద్యోగాల నష్టానికి కారకులయ్యేవారు విధిగా కొత్త ఉద్యోగాలు సృష్టించవలసిన అవసరమున్నది. వారు ఈ బాధ్యత తప్పక నిర్వర్తించేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.

ఉద్యోగాలు లేని లేదా కొద్ది ఉద్యోగాలు మాత్రమే ఉండే ప్రపంచం నరకప్రాయ భవిష్యత్తును చూడనున్నది. 'పని'– మనిషిని నిర్వచిస్తుంది. ఆహారం కోసం వేటాడడం మినహా మరే జీవీ స్వచ్ఛందంగా పనిచేయదు. మనం చేసే సమస్త పనులను ఏఐనే చేసి, అందరికీ సిరిసంపదలు సమకూరిస్తే ఇక మనుషులు చేసేదేమిటి? రాబోయే కొద్ది సంవత్సరాలలోనే ఏఐ ప్రభావాల సమగ్ర స్వరూప స్వభావాలు మన అనుభవంలోకి రానున్నాయి. ఈ లోగా పై ప్రశ్న గురించి మనం లోతుగా ఆలోచించాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

గాడ్గిల్, బెటీల్: జ్ఞాన స్రష్టలు, భావిద్రష్టలు

మతపరమైన లేదా ఆధ్యాత్మిక ఉపదేశాలు కోరుకునేవారికి ఒక గురువు అవసరమవుతాడు. ఆ గురువు బోధిస్తాడు. అంతేకాదు తాను సరైనదని భావించిన ధర్మపథంలో నడవాలని కూడా శిష్యులను ఆదేశిస్తాడు. తన ఉపదేశాలను ప్రశ్నించకుండా అనుసరించాలనేది ఆ ఆధ్యాత్మిక గురువు అభిమతంగా ఉంటుంది. అయితే విద్వజ్జులమవ్వాలని అభిలషించేవారు గురువు మార్గదర్శకత్వాన్ని కోరుకోవడం వివేకరాహిత్యమే అవుతుంది. విమర్శనాత్మక విచారణ, మౌలిక పరిశోధనకు నిర్దిష్ట మానసిక స్వాతంత్ర్యం తప్పనిసరి. ఇతరుల ఆలోచనలను, వారెంత గొప్పవారైనప్పటికీ నిరాలోచనగా స్వీకరించకుండా తన సొంత మేధా ఆసక్తులకు దోహదం చేసే లేదా అవరోధమయ్యే సిద్ధాంతాలు, పద్ధతులను అనుసరించాలి లేదా వదిలివేయాలి. విచారకరమైన విషయమేమిటంటే మన దేశంలో ఆధ్యాత్మిక శోధన, విద్వత్ అన్వేషణ మధ్య ఉన్న ఈ ప్రధాన వ్యత్యాసం చాలావరకు విస్మరణకు గురవుతోంది. మన విద్యా జగత్తులో భూస్వామ్య మనస్తత్వం పరిపూర్ణంగా విలసిల్లుతోంది.




■ రామచంద్ర గుహ

పెత్తందారీ మేధా సంస్కృతి జ్ఞాన సృష్టిని నియంత్రిస్తోంది. వయో ఆధిక్యులు, ఉన్నత హోదాలలో ఉన్న వారు గురువులుగా వ్యవహరిస్తూ శిష్యుల నుంచి మినహాయింపులు లేని విధేయతను, అపరిమిత గౌరవాదరాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆధిపత్య మేధా సంస్కృతి మన విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో సర్వవ్యాపకంగా ఉన్నది. నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థను మార్క్సిజం వ్యతిరేకిస్తుంది. అయితే కోల్‌కతాలోని మార్క్సిస్టు ప్రొఫెసర్లు తమ జూనియర్ సహచరుల పట్ల ఆ సామాజిక అంతరాలను వారణాసిలో హిందూ మితవాద దృక్పథమున్న ఆచార్యుల రీతిలోనే పాటిస్తున్నారు!

ఇటీవల మన మధ్య నుంచి ఇద్దరు జ్ఞానమూర్తుల శాశ్వత నిష్క్రమణ మన మేధాసంస్కృతిపై ఈ నిశిత వ్యాఖ్యలకు నన్ను పురిగొల్పింది. నా యవ్వనంలో నన్ను అమితంగా ప్రభావితం చేసిన ఆ మేధా సమున్నతులలో ఒకరు పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్, మరొకరు సామాజిక శాస్త్రవేత్త ఆంద్రే బెటీల్. గాడ్గిల్ గత నెల 7న ఎనభై మూడేళ్ల వయస్సులోను, బెటీల్ ఈ నెల 3న తొంభై ఒకటవ ఏట మరణించారు. 1982లో గాడ్గిల్‌ను నేను మొదటిసారి కలుసుకున్నప్పుడు నా వయసు 24 ఏళ్లు కాగా ఆయన 40 వసంతాల యువకుడు. బెటీల్‌తో 1988లో నాకు పరిచయమైనప్పుడు నేను 30వ పడిలోకి ప్రవేశించగా ఆయన తన నడిమి యాభైలలో ఉన్నారు. వయోభేదం ఎంతగా ఉన్నప్పటికీ ఆ ఇరువురితో తొలిసారి సంభాషించిన క్షణానే మా మధ్య స్నేహభావం అంకురించి, కుసుమించి తుదివరకూ దినదినమూ ప్రవర్ధమానమయింది. అప్పుడప్పుడూ మా కుటుంబాల గురించి మాట్లాడుకున్నప్పటికీ ఆ ఇరువురితో నా సంభాషణలు, సమాలోచనలు చాలావరకు సమాజం, రాజకీయాలు, చరిత్ర, పర్యావరణం, భారతదేశం, ప్రపంచం గురించి జరిగేవి. ఇరువురి జీవిత ప్రస్థానాలు భిన్నమైనవి. గాడ్గిల్ మరాఠీ భాషీయుడు. పూణేలో పెరిగారు. బెటీల్ తండ్రి ఫ్రెంచ్ జాతీయుడు, తల్లి బెంగాలీ. చంద్రనాగోర్‌లో పుట్టి పెరిగిన బెటీల్ విద్యాభ్యాసం చాలావరకు కలకత్తాలో జరిగింది. విద్యాలయాల్లో ఆంగ్లంలోనూ, ఆటపాటల సందర్భాలలో స్నేహితులతో బెంగాలీలోనూ సంభాషిస్తుండేవారు. బెటీల్ తన డాక్టోరల్ డిగ్రీ భారత్‌లోనే తీసుకోగా, గాడ్గిల్ అమెరికాలో పీహెచ్‌డీ సముపార్జించారు. గాడ్గిల్ వృత్తి జీవితం చాలావరకు బెంగళూరులో, బెటీల్ బోధన, పరిశోధన వ్యాపకాలు ఢిల్లీలో జరిగాయి. గాడ్గిల్, బెటీల్ ఎప్పుడూ కలుసుకోలేదు. అయితే తమ పరస్పర స్నేహితుడు అయిన ఈ వ్యాసకర్త ద్వారా సదా ఒకరి విషయాలు మరొకరు తెలుసుకుంటూ ఉండేవారు. గాడ్గిల్, బెటీల్ జీవిత ప్రస్థానాలు భిన్నమైనవని అన్నానా? కావచ్చు కానీ ఇరువురి మధ్య ఒక సమున్నత ఏకత్వం ఉన్నది. వారి మేధా జీవితాలను చూడండి. అద్భుతమైన సారూప్యతలు కనిపిస్తాయి. ఇరువురి చింతనా ధోరణి, మేధా జీవితాచరణలలో పది గుణాత్మక విశిష్టతలు ప్రస్ఫుటమవుతాయి. అవి నన్ను ప్రభావితం చేశాయి. మేధా జీవితాలను గౌరవించే వారెవరికైనా అవి స్ఫూర్తిదాయకమైనవే, సందేహం లేదు. వాటిని విపులీకరిస్తాను:

ఒకటి– గాడ్గిల్, బెటీల్ ఇరువురూ తమ దృక్పథంలో నికార్సయిన ఇంటర్–డిసిప్లినరీ విద్వజ్జులు (బహుళ విద్యా విభాగాల సిద్ధాంతాలు, పద్ధతులు అంతర్దృష్టులను సమగ్రపరిచి, ఒకే విద్యా విభాగం నుంచి అర్థం చేసుకోలేని సంక్లిష్ట సమస్యలను విశ్లేషించే ప్రాజ్ఞులు). చరిత్రకారులు, ఆర్థికవేత్తలు, న్యాయశాస్త్ర కోవిదులను తన పరిశోధనలలో భాగస్వాములను చేసుకున్న సామాజిక శాస్త్రవేత్త బెటీల్. మానవ శాస్త్రవేత్తలు, చరిత్రకారులతో సహకార పరిశోధనలు నిర్వహించిన పర్యావరణవేత్త గాడ్గిల్; రెండు– తమ మేధా కృషిలో ఇరువురూ సిద్ధాంతం, అనుభావిక పరిశోధనలను సమన్వయపరిచినవారు. మానవ జాతుల అధ్యయనవేత్తగా శిక్షణ పొందిన బెటీల్ తులనాత్మక సామాజిక శాస్త్రవేత్తగా పరిణమించగా, పర్యావరణం పట్ల సైద్ధాంతిక దృక్పథంతో విద్వత్ జీవితాన్ని ప్రారంభించిన ప్రాకృతిక ప్రపంచంతో వైవిధ్య మానవ పరస్పర చర్యల ప్రభావాలను పరిశోధించేందుకు విస్తృతంగా క్షేత్ర అధ్యయనాలు నిర్వహించారు గాడ్గిల్; మూడు– ఇరువురూ తమ బోధనా విధులను నిబద్ధతతో నిర్వహించినవారు. అంతేకాదు సంస్థా నిర్మాణం పట్ల అంకితభావం చూపినవారు. బెటీల్ అధ్యాపక జీవితం ఢిల్లీ విశ్వవిద్యాలయం, ముఖ్యంగా సామాజికశాస్త్ర విభాగంతో పూర్తిగా ముడివడి ఉన్నది. గాడ్గిల్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ముఖ్యంగా ఆ ప్రతిష్ఠాత్మక సంస్థలోని సెంటర్ ఫర్ ఎకోలాజికల్ సైన్సెస్‌తో భావోద్వేగ అనుబంధం ఉన్నది; నాలుగు– తమ విద్వత్ కృషిని ప్రజలకు వివరించడంలో ఇరువురూ ప్రభావశీల ఫలితాలను సాధించారు. అయితే తమను తాము కార్యకర్తగా గానీ లేదా క్రియాశీలి–మేధావిగా గానీ ఇరువురూ భావించుకోలేదు. తమ విద్వత్ కృషికి సంబంధించిన అంశాలలో మాత్రమే తమ ప్రజా బాధ్యతలను పరిమితం చేశారు; అయిదు– ఇరువురూ తమ కన్న ఊరు, సొంత రాష్ట్రం వెలుపల విద్యాభ్యాసం, పరిశోధనలు చేయడం, వృత్తి జీవితం గడపడం ద్వారా తమ మేధా ప్రపంచాన్ని విశాలం చేసుకున్నారు. పరిపూర్ణమైన విద్వత్ కృషి చేశారు. కలకత్తాలో కాకుండా ఢిల్లీలో బెటీల్ బోధన, పరిశోధనలు జరిగాయి. గాడ్గిల్ వృత్తి జీవితమంతా పూణేలో కాకుండా బెంగళూరులో జరిగింది. సొంత రాష్ట్రాలకే పరిమితమైన విద్వజ్జుల కంటే విశాల దృక్పథంతో సమున్నతమైన విద్యా కృషి చేశారు. బెటీల్ తన క్షేత్ర పరిశోధనలను తమిళనాడులో నిర్వహించగా, కర్ణాటక, కేరళలో గాడ్గిల్ పరిశోధనలు జరిగాయి. అయినప్పటికీ ఇరువురూ తమ సొంత ప్రదేశాలు, వాటి సంస్కృతికి దూరం కాలేదు;





ఆరు– భారత్ వెలుపల విశాల ప్రపంచం పట్ల ఇరువురూ విశేష శ్రద్ధాసక్తులు చూపేవారు. అన్ని దేశాల విద్వజ్జులతో కలిసి తమ మేధా వ్యాసంగాలను కొనసాగించేవారు తమ మేధా ఆసక్తులలో ఇరువురూ నిక్కమైన భారతీయులు, నిజమైన అంతర్జాతీయవాదులు; ఏడు– తమ మనో వైఖరులు, ఆలోచనా రీతులలో ఎటువంటి సంకుచితత్వం ఏ కోశానా లేకపోయినా ఇరువురూ భారత్‌లోనే నివసిస్తూ, వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూ జాతి మేధా జీవితాన్ని సమున్నతపరిచారు. గాడ్గిల్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపక ఉద్యోగాన్ని వదులుకుని స్వదేశానికి వచ్చేశారు. కేంబ్రిడ్జ్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాలు ఆహ్వానించినప్పటికీ స్వదేశంలోని ఢిల్లీ విశ్వవిద్యాలయానికే అంకితమైన ఆచార్యోత్తముడు బెటీల్; ఎనిమిది– ఇరువురూ ఉత్తమ దేశభక్తులు. భారతదేశం పట్ల తమ ప్రేమాభిమానాలను మనసా వాచా కర్మణా వ్యక్తపరిచారు. కులం, వర్గం, జెండర్, మతపరమైన అంతరాలకు అతీతంగా తమ విద్యార్థులు, సహచరులను సమభావంతో సమాదరించారు. తద్వారా భారతీయ మేధా జీవితానికి ఎనలేని తోడ్పాటునందించారు; తొమ్మిది– ఇరువురి దేశభక్తిలోనూ గుడ్డి ఆరాధన లేదు. ఆలోచనారహిత భక్తి లేదు. 'సహ పౌరులకు, ఇరుగు పొరుగు దేశాల పౌరులకు వ్యతిరేకంగా తమ దేశం, ప్రభుత్వం పాల్పడుతున్న నేరాలు, అమానుషాలకు సిగ్గుపడలేని వ్యక్తులు నిజమైన జాతీయవాదులు కారు' అన్న ఆంగ్లో– ఐరిష్ చరిత్రకారుడు బెనెడిక్ట్ అండర్సన్ (1936–2015) మాటలతో గాడ్గిల్, బెటీల్ ఇరువురూ పూర్తిగా ఏకీభవిస్తారు. భారతీయ సమాజంలో విస్తృతంగా ఉన్న అసమానతలకు వారు సిగ్గుపడేవారు, దుఃఖపడేవారు. ఆ అసమానతల అమానుషత్వాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకువెళ్లి వారిలో మానవతా భావాలను ప్రదీప్తపరిచేందుకు ప్రయత్నించేవారు; పది– చాలామంది సహచర ప్రొఫెసర్ల వలే గాడ్గిల్, బెటీల్ ఎప్పుడూ గురువులుగా వెలుగొందాలని ఆకాంక్షించలేదు. తమ విద్యారంగాలలో అనుభవజ్ఞులైన వృద్ధ పండితులు స్వీయ సంచిత జ్ఞానాన్ని యువ పరిశోధకులకు సమకూర్చడం ద్వారా జ్ఞాన సృష్టికి తోడ్పడుతూ ఆ యువ విద్వజ్జుల జిజ్ఞాస, భావసాహస ప్రవృత్తి నుంచి స్ఫూర్తి పొందుతారని గాడ్గిల్, బెటీల్ విశ్వసించేవారు. రాజకీయ, మేధా సంబంధ వ్యవహారాలలో ఇరువురూ ఉదారవాదులే. ఏ విషయంలోనూ శుష్క వాదనలు చేసేవారు కాదు. విశాల దృక్పథంతో భారతదేశాన్నీ, విశాల ప్రపంచాన్నీ అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యమిచ్చేవారు.

గురుకులం, శాఖ, పార్టీ పాఠశాలల్లో కొత్తవారికి బోధిస్తారు, ఉపదేశిస్తారు. ఎలా ఆలోచించాలో, ప్రవర్తించాలో ఆదేశిస్తారు, సిద్ధాంతాలను మనసుకెక్కిస్తారు. అయితే, పాండిత్య పరిశోధన అందుకు భిన్నమైనది. భిన్న వ్యక్తులు, భిన్న విద్యా విభాగాలు, భిన్న సైద్ధాంతిక దృక్పథాలు, పరిశోధనా శైలులు, సామాజిక నేపథ్యాలు, జాతీయ అనుబంధాలు, మరీ ముఖ్యంగా భిన్నతరాల మధ్య పరస్పర అధ్యయనం, సంభాషణలు, సమాలోచనలు, భావాల మార్పిడి ద్వారా విద్వత్ వ్యాసంగం వికసిస్తుంది, పరిపూర్ణమవుతుంది. ఈ విశిష్ట మేధా సాధన సత్యాలను నేను గాడ్గిల్, బెటీల్ నుంచి నేర్చుకున్నాను. ఇటీవలి సంవత్సరాలలో యువ మేధావులు, రచయితలతో తరచూ మాటామంతీ ద్వారా ఆ సత్యాలు నాకు పదే పదే మరింతగా విశదమయ్యాయి. మార్గదర్శకత్వం కోసం వచ్చిన యువ పరిశోధకులు నాకు చాలా మంచి విషయాలు నేర్పారు.

> మాధవ్ గాడ్గిల్, ఆంద్రే బెటీల్ జీవిత ప్రస్థానాలు భిన్నమైనవి కావచ్చు కానీ వాటి మధ్య ఒక సమున్నత ఏకత్వం ఉన్నది. వారి మేధా జీవితాలలో అద్భుతమైన సారూప్యతలు కనిపిస్తాయి. ఇరువురి చింతనా ధోరణి, మేధా జీవితాచరణలలో అనేక గుణాత్మక విశిష్టతలు ప్రస్ఫుటమవుతాయి. అవి నన్ను ప్రభావితం చేశాయి. మేధా జీవితాలను గౌరవించే వారెవరికైనా అవి స్ఫూర్తిదాయకమైనవే.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఐఆర్‌డీఎస్ ఒక జాతీయ అవసరం!

భారతదేశ అభివృద్ధి ప్రణాళికలు ఎంత విశాలంగా, సమగ్రంగా రూపొందించినా అవి క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. కేంద్రం, రాష్ట్రాలు వేల కోట్ల రూపాయలతో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాలు కాగితాలపై అద్భుతంగా కనిపిస్తున్నా గ్రామాల్లో వాస్తవ పరిస్థితుల్లో ఆశించిన మార్పును తీసుకురాలేకపోతున్నాయి. ప్రభుత్వ పథకాలు గ్రామాలకు చేరుతున్నాయి గానీ, వాటి అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం, ప్రజలకు కలిగే ప్రత్యక్ష ప్రయోజనం విషయంలో అనేక లోపాలు కనిపిస్తున్నాయి. దీనికి మూలకారణం గ్రామీణాభివృద్ధికి అంకితమైన ప్రత్యేక పరిపాలనా సేవ లేకపోవడమే.



దేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ప్రధానంగా ఐఏఎస్ అధికారులకు లేదా ఇతర కేంద్ర, రాష్ట్ర సేవల అధికారులకు అదనపు బాధ్యతలుగా అప్పగిస్తున్నారు. ఒక అధికారికి రెవెన్యూ, అభివృద్ధి, ఎన్నికలు, శాంతిభద్రతలు వంటి అనేక బాధ్యతలుండగా, గ్రామీణాభివృద్ధి మరో అదనపు అంశంగా మారుతోంది. ఫలితంగా ఇది తాత్కాలిక పరిపాలనా బాధ్యతగా మిగులుతోంది. గ్రామీణాభివృద్ధి అనేది అత్యంత సున్నిత, విస్తృతమైన ప్రజల జీవితాలతో నేరుగా ముడిపడిన రంగం. దీనికి ప్రత్యేక శిక్షణ, దీర్ఘకాలిక దృష్టి, క్షేత్రస్థాయి అనుభవం, స్థానిక అవసరాలపై లోతైన అవగాహన కలిగిన అధికారుల సేవలు అత్యవసరం.

1993లో అమలులోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణ భారతదేశ ప్రజాస్వామ్యంలో ఒక మైలురాయి. దీంతో పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక స్వయంపాలనా సంస్థలుగా గుర్తించి, గ్రామీణ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ హోదా కల్పించారు. ఈ సవరణలో భాగంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలు గ్రామ పంచాయతీలకు బదలాయించి విధులు, నిధులు, సిబ్బంది వికేంద్రీకరణను అమలు చేయాల్సి ఉంది. అయితే ఈ సవరణ అమలై మూడు దశాబ్దాలు గడిచినా అనుకున్న లక్ష్యం సిద్ధించలేదు. చాలా రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ సంస్థలు పేరుకే స్వయంపాలనా సంస్థలుగా మిగిలిపోయాయి. విధులు అప్పగించకపోవడం, నిధులపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ కొనసాగడం, సిబ్బంది ఇతర శాఖలకు లోబడి ఉండడం వంటి కారణాల వల్ల పంచాయతీలు స్వతంత్రంగా పని చేయలేకపోతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ గ్రామీణ అభివృద్ధి సర్వీస్ (ఐఆర్‌డీఎస్) ఏర్పాటు చేయడం ద్వారా 73వ రాజ్యాంగ సవరణ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఈ అధికారులు ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి కోసం శిక్షణ పొందిన వారుగా, పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో పనిచేస్తూ విధులు, నిధులు, సిబ్బంది వికేంద్రీకరణను సమర్థవంతంగా అమలు చేయగలరు. స్థానిక ప్రజల అవసరాలు, సమస్యలు, వనరులు గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం ఐఆర్‌డీఎస్ ద్వారా సాధ్యమవుతుంది.

గ్రామీణాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ఉపాధి, కార్యక్రమాల సమన్వయం, మౌలిక వసతుల అభివృద్ధి, నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం వంటి వాటిని ఐఆర్‌డీఎస్ ద్వారా బాధ్యతాయుతంగా అమలుచేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విభిన్న శాఖల మధ్య చీలిపోయిన బాధ్యతలు ఐఆర్‌డీఎస్ ద్వారా ఒకే వ్యవస్థలోకి రావడంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు స్పష్టత లభిస్తుంది. వికసిత భారత్ వంటి జాతీయ లక్ష్యాలు, వీబీజీరామ్‌జీ వంటి గ్రామీణ ఉపాధి, ఆర్థిక స్వావలంబన పథకాలు విజయవంతం కావాలన్నా కూడా ఈ ఐఆర్‌డీఎస్ వ్యవస్థ అవసరం.

గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న నిరుద్యోగం, నగరాల వైపు యువత వలసలు, వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల ఆదాయ అస్థిరత, పథకాల అమలులో లోపాలు– ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక పరిపాలనా సేవ లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఆర్థికంగా, పాలనాపరంగా బలపడాలంటే ఐఆర్‌డీఎస్ అత్యవసరం. అందువల్ల కేంద్ర ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసి 73వ రాజ్యాంగ సవరణలో ఊహించిన విధంగా పంచాయతీరాజ్‌కు ప్రాణం పోయాల్సి ఉంటుంది.

● టీఎంబీ బుచ్చిరాజు
అధ్యక్షులు, ఏపీ పంచాయతీరాజ్,
గ్రామీణాభివృద్ధి ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం

మంగళగిరిలో చేనేత గర్జన

కళాత్మకమైన చేనేత వృత్తి, నేడు దారుణమైన కష్టాల్లో కూరుకుపోయి ఉన్నది. ఈ దుస్థితికి కేంద్రం, రాష్ట్రంలో ఏడు దశాబ్దాలకు పైగా పరిపాలించిన వివిధ ప్రభుత్వాలు అనుసరించిన చేనేత వ్యతిరేక, జౌళి పరిశ్రమ అనుకూల విధానాలు, ఆచరణలు కారణం. వార్షిక బడ్జెట్ల కేటాయింపుల్లో చేనేతకు కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయి. చేనేత పరిశ్రమ రక్షణకూ, కార్మికుల జీవనానికీ, మనుగడకూ తోడ్పడే న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలను నెరవేర్చడం లేదు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.25 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్లు కేటాయించాలి. రాష్ట్ర అధినాయకత్వం తమ వాగ్దానం మేరకు– నేతన్నలతో పాటు, చేనేత ఉపవృత్తులు చేసుకునే కార్మికులందరికీ ప్రతి సంవత్సరం రూ.25వేల ఆర్థిక సహకారం అందించాలి. 200 యూనిట్ల వరకూ విద్యుత్‌ను వారికి ఉచితంగా అందించే పథకాన్ని అమలుపరచాలి. సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.203 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. వీటితో పాటు, ఆ సంఘాల్లోని రుణాలనూ రద్దు చేయాలి. చిలప నూలు, పట్టు, రంగులు, రసాయనాలను సబ్సిడీ రేట్లకు సప్లై చేయాలి. వీటితో పాటు చేనేత వస్త్రాలపై జీఎస్టీని రద్దు చేయాలి. నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వాలు కొనుగోలు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో నేతన్నలకు రూ.10 వేల ఆర్థిక సహకారం అందించాలి. ఆత్మహత్యలు, ఆకలి చావులతో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలి. కేంద్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలి... వంటి డిమాండ్లతో ఫిబ్రవరి 22న ఉదయం 10 గంటలకు 'చలో మంగళగిరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ


ప్రమాణం చేస్తున్న మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే పుల్లారావు

రబీ.. రికార్డు



పల్నాడులో 190 శాతం

పల్నాడు జిల్లాలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,36,387 ఎకరాలుగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే ఊహకు అంద ని రీతిలో పంటలు సాగయ్యాయి. 2,58,590 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయగా 190 శాతంగా సాగు నమోదైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది.

పదేళ్లలో లేనంతగా పెరిగిన సాగు

- గత ఏడాది కన్నా 2.24 లక్షల ఎకరాలు పెరుగుదల
- ఒక్క మొక్కజొన్న పంటే 2.75 లక్షల ఎకరాల్లో సాగు


వరుణుడు కరుణించాడు.. ప్రకృతి సహకరించింది.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది.. సకాలంలో సాగు నీరు అందింది. అన్నీ అనుకూలంగా ఉండటంతో రబీలో రైతులు రికార్డు స్థాయిలో పంటలు సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో అంచనాలకు అందనంతగా పంటలు సాగయ్యాయి. గత పదేళ్లలో ఎన్నడూ లేనంతంగా రైతులు పంటలను సాగు చేశారు. వ్యవసాయశాఖ సాధారణ విస్తీర్ణ అంచనాలు తారుమార య్యాయి. రబీలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గత ఏడాది 6.10 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయ గా ఈ సారి 8,35,035 ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. గత ఏడాది కన్నా 2.24 లక్షల ఎకరాల్లో సాగు పెరిగింది. రబీలో ప్రధానంగా మొక్క జొన్న, వరి, శనగ, మినుము, పెసర, జొన్న పంటల ను రైతులు సాగు చేశా రు. వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం ఆయా పంటల సాగు ఆశాజనకంగా ఉంది.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

విస్తారంగా వర్షాలు కురవడంతో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. సాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయాయి. పైగా వైసీపీ ఐదేళ్ల పాడు బెట్టిన కాల్వలకు కూటమి ప్రభుత్వం మరమ్మతులు నిర్వహించింది. చివరి భూములకు పుష్కలంగా సాగు నీరు అందింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో రైతులు రికార్డు స్థాయిలో పంటలను సాగు చేశారు. రైతులు సాగు చేసిన పంటల్లో మొక్కజొన్న, వరి సగానికి పైగా ఉన్నాయి. మొక్కజొన్న సాగు కు రైతులు పెద్దఎత్తున మొగ్గు చూపా రు. దీంతో మొత్తం విస్తీర్ణంలో ఒక్క మొక్క జొన్న పంట 2.75 లక్షల ఎకరాల్లో సాగు చేయడం విశేషం. మొక్క జొన్న సాధా రణ విస్తీర్ణం 1,49,950 ఎకరా లు కాగా 2,75,242 ఎకరాల్లో అంటే 83 శాతం పెరగడం విశేషం. పల్నాడు జిల్లాలో వరి సాగు (మిగతా 8వ పేజీలో)

బాపట్ల, గుంటూరులో 142 శాతం

బాపట్ల జిల్లాలో సాధారణ విస్తీర్ణం 3,41,560 ఎకరాలు కాగా 3,79,625 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గుంటూరు జిల్లాలో సాధారణ విస్తీర్ణం 1,38,690 ఎకరాలు కాగా 1,96,820 ఎకరాల్లో సాగు చేశారు. సాగు 142 శాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది.



గత ఐదేళ్లల్లో పంటల సాగు జిల్లాల వారీగా ఎకరాల్లో...

జిల్లా	2026	2025	2024	2023	2022
పల్నాడు	2,58,590	1,33,627	52,030	58,357	55,245
బాపట్ల	3,79,625	3,11,685	1,27,857	1,10,675	1,45,800
గుంటూరు	1,96,820	1,60,655	48,702	38,260	36,357

మిర్చియార్డుకు.. రైతే అతిథి

- విశాలమైన ప్రాంతంలో యార్డు ఏర్పాటు అవసరం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు
- అట్టహాసంగా జరిగిన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో ప్రాధాన్యం, తొలి అతిథి రైతే కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కే అచ్చె న్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు చేబ్రోలు హనుమయ్య ప్రాం గణంలో శుక్రవారం మిర్చి యార్డు పాలక వర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి ప్రసంగించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా యార్డు ద్వారా ఉపాధి పొందుతున్న 1,50,000 మంది సంక్షేమాన్ని గుర్తుపెట్టుకుని పాలన సాగాలని కమిటీకి సూ చించారు. గిట్టుబాటు, మద్దతు ధరలతో (మిగతా 8వ పేజీలో)


గుంటూరులో ర్యాలీ


గుంటూరులో కుర్రా అప్పారావు ప్రమాణస్వీకారానికి హాజరైన జన సందోహం


గుంటూరులో యార్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పారావు


సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

గ్రామీణ డాక్ సేవక్‌లు.. తపాలా వ్యవస్థకు బలమైన పునాది

సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి

జీడీసీసీబీ నిధుల దుర్వినియోగం

- మరో నిందితుడి అరెస్టు

మనసు పడవ.. ఇల్లు కదిలితే!

- తీరానికి సరికొత్త పర్యాటక శోభ
- రూ.9.5 కోట్లతో 2 హౌస్‌బోట్లు
- నేడు నిర్మాణపనులు ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

8

ఉపాధి హామీకి బీజేపీ తూట్లు

తెనాలిలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో కోట్లాది మంది పే దలకు లబ్ధి చేకూరుస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బీజేపీ ప్రభుత్వం తూ ట్లు పొడుస్తుందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమ ర్శించారు. ఉపాధి హామీ పరిరక్ష ణలో భాగంగా శుక్రవారం తెనాలి మార్కెట్ సెంటర్‌లో జరిగిన బ హిరంగ సభలో ఆమె ప్రసంగిం చారు. ఆకలి చావులు లేకుండా చే సేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్ర వేశపెట్టిన ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ నాయకులు నాశ నం చేయాలని చూస్తున్నారన్నారు. కాంట్రా క్టర్లకు, బినామీలకు డబ్బులు అందడం లేద నే ఉద్దేశంతో ఈ పథకంపై పడ్డారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. గాంధీ పథకం వల్ల గ్రామాలు బాగుపడ్డాయని చెప్పారు. రాష్ట్రా ల పెత్తనం లేకుండా కేంద్రం కనుసన్నల్లో ఉపాధి కల్పన నూరుశాతం విజయవంత మైందన్నారు. ఈ పథకానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం 60 శాతం స మకూరిస్తే, 40 శాతం రాష్ట్రాలు భరించాల ని చెప్పడం ఈ పథకం నీరుగార్చే ప్రయ త్నమేనని ఆరోపించారు. మాజీ ముఖ్యమం త్రి జగన్, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబా బు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తూ ప్రజల చేతికి చిప్ప సిద్ధం చేస్తున్నారని దు య్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరే క విధానాలను కాంగ్రెస్ ఎదుర్కొంటుందని ఇందుకు ప్రజలు తమతో కలిసి రావాలన్నా రు. రుణమాఫీ, ప్రత్యేక హోదా, ఉద్యోగ అ వకాశాలు కాంగ్రెస్ వల్లనే సాధ్యమవుతా యని చెప్పారు. తొలుత సభకు వచ్చిన ప్ర జలతో నేరుగా సంభాషించారు. మాజీ ఎం పీ జేడీ శీలం, షేక్ మస్తాన్‌వలి, డాక్టర్ చం దు సాంబశివుడు, కూచిపూడి విజయ తది తరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షర్మిల

స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు ● చెత్త లేని పరిసరాల సాధనే లక్ష్యంగా కార్యక్రమాలు



గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్ని విజయ వంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశిం చారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ను నిర్వహించారు. 'జీరో లిటర్ గవర్నెన్స్' థీమ్‌తో కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో మున్సిపల్, పంచాయతీ ఇతర శాఖలు విజ యవంతంగా నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రంలో శుభ్రతను ప్రోత్సహించేందుకు 'జీరో లిటర్ గవర్నెన్స్' థీమ్‌తో పూర్తిగా చెత్త లేని పరిసరాలను సాధించే లక్ష్యంతో రూపొందించారన్నారు. జీరో లిటర్ గవ ర్నెన్స్ అంటే రోజువారీగా వ్యర్థాల రహిత జీవన విధానం, సమాజంలో చెత్త నిర్మూలన, నిర్వహణ ద్వారా పరిసరాలను శుభ్రంగా మార్చవచ్చున్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర జీరో లిటర్ గవర్నెన్స్ భాగంగా అన్ని మున్సిపాలిటీల్లో, మండలాల్లో గ్రామ, వార్డు స్థాయిల్లో పరిశుభ్రమైన వార్డు, గ్రామంపై అవగాహన కార్యక్రమాలు అన్ని శాఖల అధి కారులు నిర్వహిం చాలన్నారు. విద్యా సంస్థలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించా లన్నారు. పరిశుభ్ర పరిసరాల వల్ల ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించ వచ్చని చెప్పారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సాయంత్రం 6.18 (శనివారం)
సహరి : ఉదయం 5.13 (ఆదివారం)

- రేపటి నుంచి మంగళాద్రిలో ఉత్సవాలు
- శ్రీవారి పెండ్లి కుమారుడి ఉత్సవంతో శ్రీకారం

బ్రహ్మోత్సవాలకు వేళాయే





మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మంగ ళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి మార్చి 5వ తేదీ వరకు జరగనున్నాయి. దిగువ సన్నిధిలోని ఆలయంలో ఆదివారం ఉదయం పెండ్లి కుమారుని ఉత్సవంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్ట మైన ధ్వజారోహణను 23న రాత్రి నిర్వహిస్తారు. మరుసటి రోజు నుంచి స్వామి వారి వాహన సేవలు ఆరంభమ వుతాయి. 24న హనుమంత వాహనం, 25న రాజాధిరాజ, 26న ఉదయం ముత్యాల పల్లకి, రాత్రి యాలి వాహనం, 27న ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి సింహ వాహ నం, 28న ఉదయం హంస వాహనం, రాత్రి గజ వాహ నం, మార్చి ఒకటో తేదీన ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి పొన్న వాహనసేవ, 2న ఉదయం అశ్వ వాహన సేవ నిర్వహిస్తారు. 2న అర్ధరాత్రి స్వామి వారి కల్యాణ మహో త్సవం జరుగుతుంది. శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మిద్దె సెంటరులోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయనున్నారు.

రథోత్సవానికి గ్రహణం అడ్డంకి

మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థాన చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈమారు స్వామివారి దివ్యరథోత్స వానికి గ్రహణం అడ్డుతగిలింది. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏటా స్వామి వారి కల్యాణం అనంతరం అశేష జనవాహిని నడుమ మంగళగిరి తిరునాళ్లు గా పిలువబడే శ్రీవారి దివ్య రథోత్సవం నిర్వ హించడం ఆనవాయి తీ. అయితే, ఈ ఏడాది రథోత్సవం జరిగే సమయంలోనే చంద్ర గ్రహణం సంభవించనుండటం, ఆరు గంటల ముందు ఆలయానికి కవాట బంధనం చేయాల్సి ఉండడంతో రథోత్సవం రద్దు చేస్తున్నట్లు స్థానాచార్యులు నల్లూరి శ్రీరామచంద్ర భట్టా చార్యులు, ప్రధాన అర్చకులు దీవి అనంత పద్మనాభా చార్యులు, మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు, ఈవో కే.సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 3న ఉద యం 9 గంటలకే కవాట బంధనం చేయాల్సి ఉండడంతో స్వామి వారి కల్యాణం అనంతరం పూజాది కార్యక్రమాలు, మహర్నివేదన అనంతరం ఆలయ మాడవీధుల్లో బంగారు గరుడోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఏటా మాదిరిగానే రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి ఉదయం సుమారు 7:30 నుంచి 8:30 గంటల వరకు భక్తులకు రథాంగ దర్శనం మాత్రమే కల్పిస్తామని తెలిపారు. అనం తరం ఎగువ, దిగువ సన్నిధుల్లో కవాట బంధనం చేసి సాయంత్రం గ్రహణ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం 4వ తేదీ నుంచి దర్శనానికి ఏర్పాట్లు చేస్తారని చెప్పారు.

హైకోర్టు నిర్మాణానికి సామూహిక కాంక్రీటింగ్

- పూజలు చేసి ప్రారంభించిన మంత్రి నారాయణ
- ఏకబికిన 15 వేల క్యూబిక్ మీటర్ల నింపే ప్రక్రియ ప్రారంభం
- 600 మంది కార్మికులు, 100 మంది ఇంజనీర్లు విధుల నిర్వహణ

తుళ్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావ తిలో శాశ్వత హైకోర్టు నిర్మాణ పనులు రికార్డు బ్రేక్ చేసే దిశగా కొనసాగుతున్నాయి. హైకోర్టు ఫౌండేషన్‌లో ఒకేసారి 15 వేల క్యూ బిక్ మీటర్ల కాంక్రీట్ శ్లాబ్(రాఫ్ట్) నింపే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. 600 మంది కార్మికులు, 100 మంది సైట్ ఇంజ నీర్లు, భద్రత నిపుణులు, ఏపీసీఆర్‌డీఏ అధికారులు మూడు షిఫ్టు ల్లో 24 గంటలు విధుల్లో నిమగ్నమయ్యారు. ఇందుకోసం 2,300 మెట్రిక్‌టన్నుల స్టీల్‌ను వినియోగిస్తున్నారు. ఎనిమిది కాంక్రీట్ బూం పంపులను సైట్‌లోకి తీసుకొచ్చారు. రికార్డు సమయంలో ఈ కాంక్రీట్ పనిని పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఆర్ డీఏ వర్గాలు తెలిపాయి. కాగా మంత్రి నారాయణ శుక్రవారం పూ జలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మొత్తం నిర్మాణంలో 65,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీ ట్‌ను వినియోగిస్తుండగా, ఇప్పటికే 15,000 క్యూబిక్ మీటర్ల పను లు వేగంగా జరుగుతున్నాయన్నారు. మొత్తం 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ భవనంలో 52 కోర్టు హాళ్లు అందుబాటులోకి రానున్నాయన్నారు. నిర్మాణంలో అత్యంత కీలక మైన రాఫ్ట్ ఫౌండేషన్ పనులు పూర్తయితే.. మిగిలిన భవన నిర్మా ణం చాలా వేగంగా కొలిక్కి వస్తుందని తెలిపారు. అమరావతిలో అధికారులు ఉద్యోగుల కోసం మొత్తం 4,026 ఇళ్ల నిర్మాణం జరుగు తుందన్నారు. వీటిల్లో 3,500 ఇళ్ల నిర్మాణం మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని చెప్పారు. ఆయన వెంట సీఆర్ డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు వున్నారు.


రాఫ్ట్ పౌండేషన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ


స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సిద్ధం చేసిన ప్రజావేదిక

నేడు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

- సీఎం పర్యటనకు.. సర్వం సిద్ధం
- నేడు వినుకొండలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర
- చంద్రబాబు కార్యక్రమాల విజయవంతానికి ఏర్పాట్లు

వినుకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఎన్ఎస్‌పీ కాలనీలో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్య టన విజయవంతానికి అధికారు లు సర్వం సిద్ధం చేశారు. ఎన్ ఎస్‌పీ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రజావేదికను పోలీసులు స్వాధీ నంలోకి తీసుకున్నారు. పార్టీ శ్రేణులతో సమావేశం కోసం ప్రజావేదిక ముందు ప్రత్యేకంగా మరో వేదికను ఏర్పాటు చేశారు. 1200 మంది ఆశీనులయ్యేందుకు కుర్చీలను ఏర్పాటు చేశారు. వినుకొండ నుంచి నరసరావు పేట వెళ్లే జాతీయ రహదారి గుండా ప్రజావేదికలోకి ప్రవేశ మార్గాన్ని ఏర్పాటు చేశారు. లబ్ధి దారులకు వెలుగు పథకం ద్వారా రూ.100 కోట్లు, మెప్మా ద్వారా రూ.50 కోట్ల రుణాలతో పాటు పంచా యతీలకు 50 స్వచ్ఛ రథాలు, 43 పుష్‌గార్డ్‌లను పంపి ణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్య మంత్రి వినుకొండ ప్రభుత్వ వైద్యశాల సందర్శిం చనున్న నేపథ్యంలో వైద్యశాలలో ఏర్పాట్లను శుక్రవా రం సీఎం ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, కలె క్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలి కాప్టర్‌లో శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి జూని యర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగ నున్నారు. ఈ క్రమంలో ట్రైల్‌రన్‌ను విజయ వంతం గా నిర్వహించారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం నుం చే పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.


వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జగన్ రైతులను మోసం చేశాడు

- ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమలు నిర్మించరా?
- శాసన సభలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో రెండు దశాబ్దాల క్రితం సిమెంట్ పరిశ్రమలు స్థాపిస్తామని రైతుల వద్ద నుంచి తక్కువ ధరకే వేల ఎకరాలు కొనుగోలు చేసి.. ఇప్పటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర అన్యాయమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం శాసనసభలో ప్రస్తావించారు. పరిశ్రమల పేరుతో భూములు కోల్పోయిన రైతులు ఉద్యోగాలు లేక రైతు కూలీలుగా మారిపోయారని, పరిశ్రమలు ఎప్పుడు నిర్మిస్తారో స్థానికులకు ఎప్పుడు ఉపాధి కల్పిస్తారో... అనే విషయాలు ప్రభుత్వం స్పష్టమైన గడువు ప్రకటించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని యజమానులపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ కుటుంబం సరస్వతి పవర్ ప్రాజెక్టు పేరుతో వేల ఎకరాలు ఇష్టానుసరంగా రైతుల నుంచి కారుచౌకగా భూములు కొనుగోలు చేసిందన్నారు. 2019-24 మధ్య అడ్డగోలుగా సున్నపురాయి లీజు, నీటి కేటాయింపులు చేసేసుకున్నారన్నారు. 20 ఏళ్లుగా భూములు కోల్పోయిన రైతులను జగన్ మోసం చేస్తూనే ఉన్నాడన్నారు. కొనుగోలు సమయంలో ప్రతి రైతుకు ఉద్యోగం, ఉపాధి చూపిస్తామని హామీ రెండు దశాబ్దాలుగా అతిగతి లేదన్నారు. పల్నాడు జిల్లాలో రైతులతో సమావేశాలు నిర్వహించి, ఎప్పటిలోగా పరిశ్రమలు స్థాపిస్తారో స్పష్టమైన గడువు ప్రకటించాలన్నారు. అప్పటి వరకు ఆ భూముల్లో రైతులు సాగు చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానం ఇస్తూ... భూములు కొనుగోలు చేసిన యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి, పరిశ్రమలు ఎందుకు నిర్మించలేదో వివరణ తీసుకుంటామన్నారు. డీపీఆర్ ప్రకారం పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని వివరణిచ్చారు.

పోలీస్ శాఖకు అత్యున్నత గౌరవం

సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని అసత్య ప్రచారాలు చేసేవారిపై కఠినంగా వ్యవహరించేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శాసన సభలో కోరారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగానికి అత్యున్నత గౌరవం ఉందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పోలీస్ శాఖ గౌరవాన్ని, హుందాతనాన్ని పెంచుతున్నారన్నారు. వైసీపీ హయాంలో నకిలీ మద్యం విచ్చల విడిగా తయారు చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీతో మెరుగ్గా ఉందన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పై స్క్వేర్ టెక్నాలజీ సీఈఓ శ్రీనివాసరాజు



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

తాడికొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకుని, భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి చలపతి ఉద్ఘోష్ 2కే 26 కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పాల్గొని, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలో ఎన్నో ఆలోచనలు ఉంటాయని, లక్ష్యం, బాధ్యతను మరిచిపోవద్దని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నేరవేర్చే విధంగా చదువుకోవాలని చెప్పారు. బెంగళూరుకు చెందిన పై స్క్వేర్ టెక్నాలజీ ముఖ్య కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇంటర్నెట్ వచ్చిన కొత్తలో ఉద్యోగాలు పోతాయని ప్రచారం జరిగిందని, సాంకేతిక అభివృద్ధి చెందుతున్న తరుణంలో కొత్త టెక్నాలజీతో ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. ఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు తగ్గిపోతాయని భయాందోళనలో యువత ఉందని, ఏ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన మరికొన్ని కొత్త ఉద్యోగాలు అవకాశం ఉంటుందే తప్ప ఉద్యోగాలు తగ్గడం ఉండదని తెలిపారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫిబ్రవరిలో ఉద్ఘోష్ నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తిస్తున్నామని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో క్రీడలు, సాంకేతిక, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందారు. మలినేని లక్ష్మయ్య, ఆర్‌వీఆర్ అండ్‌జేసీ, ఎన్ఆర్ఐ, కేహెచ్ఐటీ, అదిత్య, విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రటరి వై.సుజిత్‌కుమార్, డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, జి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ కొల్లా నాగశ్రీనివాసరావు, కె.కిరణ్‌కుమార్ ఉద్ఘోష్ కన్వీనర్ పి.రత్నబాబు, జి.రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128 , 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

డెడికేటెడ్ కమిషన్ నియామకంపై హర్షం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): బీసీ కులగణన జరిపి, జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లు కచ్చితంగా అమలు జరిపేలా డెడికేటెడ్ కమిషన్‌ను నియ మించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హర్షం వెలిబుచ్చారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓబీసీ సంఘాలు దేశ వ్యాప్తంగా మూడు దశాబ్దాల నుంచి స్థానిక సంస్థలు, చట్టసభల్లో జనాభా దామాషా మేరకు బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని పోరాడుతూనే ఉన్నాయన్నారు. సుప్రీం ట్రిపుల్ టెస్ట్ ఆర్డర్‌లోని రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న పరిమితిని రద్దు చేయకుండా.. 42 శాతం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, 34 శాతం ఏపీ సీఎం చంద్రబాబు బీసీలకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు.

మార్కెటింగ్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు కాకుమాను శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి లభించింది. దీర్ఘకాలంగా జేడీ హోదాలో విధులు నిర్వహిస్తున్న ఆయనకు శుక్రవారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా ప్రమోషన్ కల్పిస్తూ ఆ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రికి మార్కెటింగ్ కమిషనర్‌గా డైరెక్టర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో జేడీ, డీడీ, ఏడీ పోస్టుల్లో ఉన్న కొందరికి ప్రమోషన్లు లభించనున్నాయి.

వైసీపీ విద్యార్థి నాయకుల ఆందోళన

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రధాన గేటు వద్ద వైసీపీ విద్యార్థి నాయకులు ఆందోళనకు దిగారు. వర్సిటీలోకి రావడానికి యత్నించగా పెద్దకాకాని సీఐ నారాయణస్వామి అదుపు చేశారు. అంతకుముందు వీసీ కె.గంగాధరరావుకు వినతిపత్రం అందించారు. ఇంజనీరింగ్ కళాశాల బ్లాక్‌కు వైఎస్సార్ పేరు తొలగింపుపై ప్రశ్నించారు. అనంతరం సాయంత్రం అంబటి రాంబాబు వస్తున్నారంటూ హడావిడి చేశారు. దీంతో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కూడా ప్రధాన గేటు వద్దకు వచ్చారు. పోలీస్ సిబ్బంది వారందరిని ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఇరువర్గాల విద్యార్థి నాయకులతో సీఐ మాట్లాడారు. దూరవిద్య కేంద్రం పరీక్షల నిర్వహణ అధికారి రామచంద్రన్ సీఐతో మాట్లాడుతూ దీనిపై త్వరలో కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వర్సిటీలో కళాశాలకు ఆ నాయకుల పేరు ఉందని స్పష్టం చేశారు.

GUNTUR MUNICIPAL CORPORATION

PUBLIC NOTICE

OBSERVATION OF SOLID WASTE MANAGEMENT RULES 2016 GUNTUR MUNICIPAL CORPORATION, GUNTUR.

All the residents of Guntur Municipal Corporation and the public in general visiting Guntur are here by informed to observe the guidelines of the Solid Waste Management Rules 2016 in order to keep the city clean and green and help the Municipal Corporation to serve better by maintaining health and hygiene within the jurisdiction. The resident of Guntur are here by informed that garbage collection is being done from Dor to Door in all wards. All the residents and citizens are required to segregate the waste generated in the houses, shops and establishments. They are required to segregate the wet waste in green bins and the dry waste in blue bins dispose of the sanitary waste stacked in a separate box and likewise the hazardous waste in red bins and hand over the same to the garbage collector separately. Also, it is required to avoid the sale, purchase or usage of polythene bags and avoid throwing or accumulating such waste on water structures canals, sewers, drains, pathways, empty plots etc. The general public is required to note that as per Plastic Waste Management Rules for 2021 manufacturing, supplying, carrying and using materials of a non-bio degradable nature including polythene bags below 120 microns are punishable. Like wise construction and demolition (C&D) waste is required to be disposed as per the guidelines prepared for disposal of the same. The toll free number 0863-2345103 can be used to collect the C&D waste. The owners of marriage halls, gardens, hotels/restaurants, hospitals, community buildings, residential buildings and other institutions etc. Within Guntur Municipal Corporation limits who generate more than 100 kg of garbage or waste will be considered as Bulk Waste Generator (BWG) according to the Solid Waste Management Rules 2016. It is mandatory for such BWGs to follow the Solid Waste Management rules 2016, which require wet and dry waste segregation in their own premises for proper disposal.

Violaters will be punished and penalised as per the provisions of the Solid Waste Management Rules 2016 which may amount up to Rs.5000/- per violation. A fine of Rs.1000/- will be levied on the violators for open defecation and Rs.500/- for open urination.

The desludging operators who discharge untreated faecal waste in the drains, open areas or water bodies will be penalized as per rules.

To avoid being penalised the general public and residents of Guntur Municipal Corporation are here by required to observe these rules and dispose of waste and garbage in accordance with them. The corporation and coordination of the general public and residence for proper disposal of waste and garbage will help the Guntur Municipal Corporation to maintain health and hygiene and garbage free environment in the City.

Sd/- **Commissioner, Guntur Municipal Corporation.**

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది: 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు జోనల్ ఆఫీస్ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.బ్రాంచి **ఆఫీస్ : గుంటూరు -2** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము. ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	**1. షేక్ అన్వర్ బాషా,** తండ్రి : హుస్సేన్ మహ్మద్, డి.నెం. 13-26, సీతమ్మ కాలనీ, చల్లావారిపాలెం, గుంటూరు జిల్లా -522005. **2. షేక్ షకీలా,** భర్త : అన్వర్ బాషా, డి.నెం. 13-26, సీతమ్మ కాలనీ, చల్లావారిపాలెం, గుంటూరు జిల్లా -522005. **3. షేక్ చంద్ బాషా,** తండ్రి : ఖాదర్ వలి షేక్, డి.నెం. 78-7-477, పాత పోలీస్‌లైన్, లాలాపేట్, గుంటూరు జిల్లా -522003. **4. షేక్ ఆరిఫ్ బాషా,** తండ్రి : అబ్దుల్ అజీజ్, డి.నెం. 19-03-20, పదర్తివారి వీధి, సంగడిగుంట, గుంటూరు జిల్లా -522001.	07-06-2025 / Rs. 50,00,000/-	29-01-2026 / ది. 29-01-2026 నాటికి మొత్తం రూ. 53,37,234/- (అక్షరాలా యాభై మూడు లక్షల ముప్పై ఏడు వేల రెండు వందల ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **GNTR4TF2410080026**		
	షెడ్యూల్ ఆస్తులు శ్రీ షేక్ చన్ బాషా @ షేక్ చంద్ బాషా గారికి చెందినవి : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, గుంటూరు నగరం, మంగళగిరి రోడ్డు, ఎన్.టి.ఆర్. నగర్, 1వ లైన్, మున్సిపల్ ఓల్డ్ వార్డ్ నెం. 5, కొత్త వార్డ్ నెం. 6, బ్లాక్ నెం. 1, టౌన్ సర్వే నెం. 26/3 వద్ద ఎకరా 2.36 సెంట్లు, దీనిలో మున్సిపల్ అసిస్టెంట్ నెం. 42314, పాత అసిస్టెంట్ నెం. 17266/బి, కొత్త అసిస్టెంట్ నెం. 1021058572, పాత డోర్ నెం. 8-24-5ఎ, కొత్త డోర్ నెం. 8-24-2, దీనిలో 303 చ॥గ॥లు లేదా 253.35 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలం, దానిలో ఆర్‌సిసి రూఫ్ డాబా మరియు ఎసిసి షీట్ రూఫ్ షాపులు ఉన్నాయి: **హద్దులు : తూర్పు:** గుంటూరు నుండి విజయవాడ రోడ్డు- 63.0 అ॥లు, **దక్షిణం:** దామరచర్ల సుబ్బారావు గారి ఆస్తి కొంతవరకు (30.0 అ॥లు) మరియు చాంద్ బాషాలోని షేక్ చాన్ బాషా ఆస్తి కొంతవరకు (37 అ॥లు)-67.0 అ॥లు, **పడమర :** చాంద్ బాషాలోని షేక్ చాన్ బాషా ఆస్తి- 30.0 అ॥లు, **ఉత్తరం:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్-48.0 అ॥లు, పైన పేర్కొన్న హద్దుల మధ్య 303 చ॥గ॥లు లేదా 253.35 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలం అందలి ఆర్‌సిసి రూఫ్ డాబా (ప్లింత్ ఏరియా-1864 చ॥అ॥లు) మరియు ఎసిసి షీట్ రూఫ్ షాపులు (ప్లింత్ ఏరియా-546 చ॥అ॥లు) మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. గుంటూరు యొక్క డాక్యుమెంట్ నంబర్ 3365/2014 కి అనుగుణంగా ఉంటుంది).		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : గుంటూరు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది: 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు జోనల్ ఆఫీస్ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.బ్రాంచి **ఆఫీస్ : వినుకొండ** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	**1.అబ్దుల్ గఫార్ షేక్,** తండ్రి : అబ్దుల్ సత్తార్, వయస్సు : 41 సం॥లు, ఓసిసి : మా ట్రేడర్స్ & జనరల్ మర్చంట్స్ బిజినెస్, ఆర్/ఓ. డి.నెం. 5-24, ముస్లీం బజార్, ఫిరంగిపురం, గుంటూరు జిల్లా -522529. **2. షేక్ అబ్దుల్ సత్తార్,** తండ్రి : మహబూబ్, వయస్సు : 62 సం॥లు, ఆర్/ఓ. డి.నెం. 5-24, ముస్లీం బజార్, ఫిరంగిపురం, గుంటూరు జిల్లా -522529. **3. కరసాల శాంసన్,** తండ్రి : భూషణం, వయస్సు 53 సం॥లు, ఆర్/ఓ. డి.నెం. 16-16-175, అల్లి నగర్, 2వ లైన్, గుంటూరు జిల్లా -522001.	31-03-2019 / Rs. 18,00,000/-	10-02-2026 / ది. 10-02-2026 నాటికి మొత్తం రూ. 43,25,807/- (అక్షరాలా నలభై మూడు లక్షల ఇరవై ఐదు వేల ఎనిమిది వందల ఏడు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **VNKN3TF1701280001**		
	షెడ్యూల్ ఆస్తులు శ్రీ షేక్ అబ్దుల్ గఫార్ గారికి చెందినవి : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం సబ్ డిస్ట్రిక్ట్, ఫిరంగిపురం గ్రామ పంచాయితీ ఏరియా, ఫిరంగిపురం గ్రామం, డి.నెం. 608/ఏ మరియు తహశీల్దార్ ఆమోదం ప్రకారం, ఫిరంగిపురం గ్రామం, డి.నెం. 608/ఏ1, అసిస్ట్ నెం. 925, వార్డు నెం. 5, ఎఫ్.ఎల్.ఆర్.నెం. 729/16, 06.12.2016, ఫిరంగిపురం గ్రామం నందు 59 1/4 చ॥గ॥లు లేదా 48 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలం. **హద్దులు : తూర్పు:** షేక్ హుస్సేన్ సాహెబ్ గారి ఉమ్మడి గోడ; **దక్షిణం:** బజార్; **పడమర :** గల్లీ బజార్; **ఉత్తరం:** షేక్ ముల్లా మొహిద్దీన్ గారి స్థలం. పైన పేర్కొన్న స్థలంలో 59 1/4 చ॥గ॥లు లేదా 48 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలం మరియు దానికి చెందిన డోర్ నెం. 5-24 మరియు అసిస్టెంట్ నెం. 925 ఉన్న ఇల్లు మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. ఫిరంగిపురం యొక్క డాక్యుమెంట్ నెం. 738/1972 మరియు 4301/2016 లకు అనుగుణంగా ఉంటుంది)		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : వినుకొండ — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి-బెంచ్ 2, చెన్నై, తేది: 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది మరియు జోనల్ ఆఫీస్ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.బ్రాంచి **ఆఫీస్ : తెనాలి** లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	**1. అశోక్ కుమార్ గుంటుపల్లి,** తండ్రి : సాంబశివరావు, వయస్సు 49 సం॥లు, ఓ.సి.సి. : శ్రీ దుర్గా పిండి మిల్లు, ఆర్/ఓ. డి.నెం. 2-147, పాడిబండ్లవారి వీధి, వడ్లమూడి, గుంటూరు జిల్లా-522213. **2. గుంటుపల్లి దుర్గా సాయి కిరణ్,** తండ్రి : అశోక్ కుమార్, వయస్సు 23 సం॥లు, ఆర్/ఓ. డి.నెం. 2-147, పాడిబండ్లవారి వీధి, వడ్లమూడి, గుంటూరు జిల్లా-522213. **3. గుంటుపల్లి కల్పన,** భర్త : అశోక్ కుమార్, వయస్సు 44 సం॥లు, ఆర్/ఓ. డి.నెం. 2-147, పాడిబండ్లవారి వీధి, వడ్లమూడి, గుంటూరు జిల్లా-522213. **4. సయ్యద్ హుస్సేన్,** తండ్రి : సయ్యద్ అహ్మద్, వయస్సు 62 సం॥లు, ఆర్/ఓ. డి.నెం. 6-77, వడ్లమూడి, గుంటూరు జిల్లా -522219.	31-01-2019 / Rs. 13,00,000/-	10-02-2026 / ది. 10-02-2026 నాటికి మొత్తం రూ. 27,33,885/- (అక్షరాలా ఇరవై ఏడు లక్షల ముప్పై మూడు వేల ఎనిమిది వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే)
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **TENALTF1705240001**		
	షెడ్యూల్ ఆస్తులు శ్రీ గుంటుపల్లి దుర్గాసాయి కిరణ్ గారికి చెందినవి : గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్ డిస్ట్రిక్ట్, వడ్లమూడి గ్రామ పంచాయతీ ప్రాంతం, వడ్లమూడి గ్రామం, బ్లాక్ నెం. 2, డి.నెం. 440-16 (లింక్ డాక్యుమెంట్ ప్రకారం), వద్ద 108 చ॥గ॥లు లేదా 90.72 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలం, ఇంటికి చెందిన డోర్ నెం. 2-147 & అసిస్టెంట్ నెం. 152. **సరిహద్దులు: తూర్పు:** బేతపూడి కోటేశ్వరరావు గారి స్థలం- 11 గజాలు; **దక్షిణం:** గొల్లమూడి వెంకటరావు గారి స్థలం- 9 గజాలు; **పడమర :** గొల్లమూడి వెంకటరావు గారి స్థలం - 13 గజాలు; **ఉత్తరం:** గల్లి బజార్-9 గజాలు. పైన పేర్కొన్న దానిలో 108 చ॥గ॥లు లేదా 90.72 చ॥మీ॥ల ఇంటి స్థలం దాని డోర్ నెం. 2-147 & అసిస్టెంట్ నెం. 152 మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. చేబ్రోలు యొక్క డాక్యుమెంట్ నెం. 2671/2004 కి అనుగుణంగా ఉంటుంది).		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : తెనాలి — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

గుంటూరు సిటీ వార్తలు

గుంటూరు తూర్పు ● పశ్చిమ

డ్రైయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల అంచనాలను వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో శుక్రవారం ఆయన మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, వాటి పెండింగ్ వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం 16వ ఆర్థిక సంఘ నిధులు రాబట్టుకునేందుకు డ్రైయిన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. నియోజకవర్గంలో మణిపురం బ్రిడ్జి నుంచి అమరావతి గడి వరకు, ఇస్లాంపేట నుంచి వాసవీనగర్ వరకు, వెంకటరమణ కాలనీ నుంచి మొండిగేటు వరకు, జియాఉద్దీన్ నగర్ నుంచి మొండిగేటు వరకు డ్రైయిన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా ముంపు సమస్యకు చెక్ చెప్పబోతున్నామని అన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను వేగంగా, నాణ్యంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఎన్టీఆర్ సేడియం కార్యదర్శి పదవికి పోటీలో ఇద్దరు

● పలు పదవులు ఏకగ్రీవం : అధికారి సీహెచ్ శ్రీనివాస్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికకు సం బంధించి నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సెక్రెటరీకి ఇద్దరు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కి 11 మంది (పురుషులు), ముగ్గురు (మహిళలు) పోటీలో ఉన్నారని డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికల అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నామినేషన్ అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. వైస్ ప్రెసిడెంట్ (దామా మహేశ్వరరావు), జాయింట్ సెక్రెటరీకి (పాకనాటి ఉమామహేశ్వరరావు), ట్రెజరర్ కి (కండె కాంతారావు)ల నామినేషన్లు ఒక్కొక్కటి ఉన్నాయని, దీంతో ఎన్నిక లేకుండా ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కి సంబంధించి మార్చి ఒకటిన ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అనంతరం లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు.

ఆహార సరఫరాను కమిటీ సభ్యులు పర్యవేక్షించాలి

● ఏపీ అన్నక్యాంటీన్ల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో వంశీధర్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్ల ద్వారా జరుగుతున్న ఆహార సరఫరాను కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని, లోపాలు గుర్తిస్తే ట్రస్ట్ దృష్టికి తీసుకురావాలని ఏపీ అన్న క్యాంటీన్ చారిటబుల్ ట్రస్ట్ సీఈవో వంశీధర్ పోతుల కోరారు. శుక్రవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదే శాల మేరకు గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్ల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమా వేశంలో క్యాంటీన్ ఛారిటబుల్ ట్రస్ట్ సీఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్ల సీఈవో మాట్లాడుతూ మౌలిక వసతుల్లో లోపాలు ఉంటే స్థానిక అధికారులకు, ఆహారంలో సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జీఎంసీ అన్న క్యాం టీన్‌ల నోడల్ అధికారి, ఉపా సెల్ పీవో సింహాచలం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏపీ అన్న క్యాంటీన్ల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో వంశీధర్

మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

● ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎన్టీఏ నాయకులు విజ్ఞప్తి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ పాఠశాలలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కొన్ని సంవత్సరాలుగా జీతాల నుంచి పీఎఫ్ తగ్గించడంలేదని, వీరికి చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోతున్నాయని వెంటనే సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌కు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సచివాలయంలో వినతిపత్రం అందించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వ ఉద్యోగికి అయినా పీఎఫ్ మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయీస్ గోడౌ న్ల వద్ద పనిచేసే ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలని ఏపీ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ ముఠాకార్మిక వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్, సివిల్ సప్లయీస్ సంస్థ ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయ న మాట్లాడుతూ కార్మికుల బిల్లులను ప్రతి నెల 10వ తేదీ లోపు విడుదల చేయాలన్నారు. రెండేళ్లకు కార్మికుడికి మూడు జతల యూనిఫాం ఇవ్వాలని, 2020 నుంచి నేటి వరకు అవి అందలేదన్నారు. అధికారులు స్పందించి యూనిఫామ్, కుట్టుకూలిని త్వరగా మంజూరు చేయాలని కోరారు. కార్మికులను గుర్తింపు కార్డు, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం అకౌంట్స్ అసిస్టెంట్ మేనేజర్ స్రవంతికి వారు వినతి పత్రం అందజేశారు. నిరసనల్లో కోట్ల మరియదాసు, కార్మికులు పాల్గొన్నారు.



సివిల్ సప్లయీస్ సంస్థ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ప్రమాణ స్వీకారోత్సవ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు



ప్రదర్శనలో పాల్గొన్న ట్రాక్టర్లు

భారీ ర్యాలీతో హోరెత్తిన గుంటూరు

● అట్టహాసంగా మిర్చియార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు నూతన పాలక కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా శుక్రవారం పాలకవర్గం ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో భారీ ర్యాలీ జరిగింది. చేబ్రోలు హనమయ్య ప్రాంగణంలో ప్రమాణ స్వీకార వేడుక జరగ్గా అంతకుమందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యానగర్‌లో కుర్రా అప్పారావు నివాసం నుంచి ప్రారంభమైన ర్యాలీ కొరిటెపాడు, లక్ష్మీపురం, ఎన్టీఆర్ స్టేడియం నుంచి హనమయ్య ప్రాంగణం వరకు సందడిగా సాగింది. మరో వైపు గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి మద్దతుగా బైక్, కార్ల ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో నాయకులు పాల్గొని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. కూటమి శ్రేణుల నినాదాలు, దారిపొడవునా బాణసంచాలతో నగరం హోరెత్తింది. కాగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏపీ శిల్పారామం



కుర్రా అప్పారావును సత్కరిస్తున్న జనసేన నేతలు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్



కుర్రా అప్పారావుని సత్కరిస్తున్న తూర్పు ఎమ్మెల్యేలు నసీర్ (తూర్పు), గళ్ళా మాధవి (పశ్చిమ)

చైర్మన్ మంజులారెడ్డి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీడీఎస్ చైర్మన్ డేగల ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమినేని వందనాదేవి, టీడీపీ, బీజేపీ, జనసేన అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, చెరుకూరి తిరుపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, పల్నాడు టీడీపీ అధ్యక్షుడు జాన్ సైదా, చిలకలూరిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా, ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు, నల్లపాటి రాము, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, వడ్రణం మార్కెండేయులు, ధారు నాయక్, మల్లి, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు హాజరై నూతన కమిటీని అభినందించారు.

పరీక్ష భవన్లో సీఎస్‌టీఈ హ్యాకథాన్

గుంటూరు విద్య ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని పరీక్ష భవన్లో శుక్రవారం కంప్యూటర్ సైన్స్ టీచింగ్ ఎక్సలెంట్ స్కోడింగ్ అనే అంశంపై హ్యాక్ థాన్ పోటీలు నిర్వహించారు కార్యక్రమంలో 1400కు పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టెక్నాలజీ ద్వారా సమస్యల పరిష్కారం కోసం పోటీలు నిర్వహించినట్లు డీఈవో షేక్ సలీం బాషా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తోట వీరయ్య, శ్రీలలిత, ప్రత్యూష, మధు, లోకేశ్ , అనిల్, జ్యోతి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యారేజ్ ప్రైవేటు పరం నిర్ణయం ఉపసంహరించుకోవాలి

● జేఏసీ నాయకుడు రవిశంకర్

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పేరుతో గుంటూరు-2 గ్యారేజ్‌ను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసం హరించుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. గుంటూ రు-2 డిపో జేఏసీ చైర్మన్, కన్వీనర్‌లు పి.అమర్‌నాథ్, ఎస్‌టీ దత్తు ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే దీక్షలను ఆయన శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. ఉద్యోగులంతా సంఘటితమై పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అనేక ఆర్టీసీ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో గ్యారేజ్‌ను ప్రైవేటు పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. రిలే దీక్షల్లో జేఏసీ నాయకులు డిఎమ్‌కే రెడ్డి, ఆర్ఎస్ రావు, వీవీ లక్ష్మీ తదితరులున్నారు.



రిలే దీక్షల్లో రవిశంకర్, అమర్‌నాథ్ తదితరులు

● గుంటూరు-2 డిపో గ్యారేజ్ ప్రైవేటుపరం చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ డిపో జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24న మహాధర్నా నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్, కన్వీనర్‌లు అమర్‌నాథ్, ఎస్‌టీ దత్తు తెలిపారు. ఈ మేరకు ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చినట్లు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు 3, 4 తేదీల్లో ఆటల పోటీలు

● ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏపీ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మార్చి 3, 4 తేదీలలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్‌జీవో అసోసియేషన్ నేతలు తెలిపారు. అలాగే 7న శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. మహిళా ఉద్యోగులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ నాగుల్ షరీఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ ఎస్‌కె.తాజున్నీసా, కన్వీనర్ ఎం విజయలక్ష్మి, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎన్జీవో అసోసియేషన్ నాయకులు

రేపు జిల్లా స్థాయి పారా బ్యాడ్మింటన్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 22 తేదీన గుంటూరు, బీఆర్ స్టేడియంలో అన్ని విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి పారా బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు డాక్టర్ వై.శ్రీనివాస్‌గౌడ్, పి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25, 26 తేదీల్లో విజ యనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 7013569514, 99129 21602లలో సంప్రదించాలని సూచించారు.



మొక్కలు అందజేస్తున్న డాక్టర్ రమణ యశస్వి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్క రు మొక్కలు నాటాలని ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి కోరారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో రోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల మూడో శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రమణ తెలిపారు. మొక్కలను పెంచడం మన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ఆయన సూచించారు. ఆస్పత్రిని సందర్శించే రోగుల సహాయకులు పాటించాల్సిన నియమ, నిబంధనలు ఆయన వివరించారు. అదేవిధంగా మొక్కలను పెంచే కార్యక్రమంలో భాగస్తులైన జాగృతి సేవా సంస్థ సౌజన్యంతో నాగరాజకుమారి దాతృత్వంలో రోగులకు మొక్కలను అందజేశారు.

ఘనంగా శ్రీలక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్, 1వ లైన్, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన 80వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్ర వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఉదయం విగ్నేశ్వర ఆరాధన, విశ్వక్సేన పూజ, కలశారాధన నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి విశేషాభిషేకాలు, తిరుమంజన సేవ, విశేష హారతులు రుత్వికులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించా రు. సాయంత్రం హనుమద్వాహనంపై శ్రీలక్ష్మీనారాయణుల తిరువీధి ఉత్స వం కనుల పండువగా జరిగింది. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ సభ్యులు ధనకుదరం సీతారామానుజాచార్యులు పర్యవేక్షించారు.



స్వామికి హారతి ఇస్తున్న వేదపండితులు

వైభవంగా స్వామి వారి కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్, శ్రీమారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నా యి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చకులు పూజ పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, యాగశాల ప్రవేశం, కలశస్థాపనలు చేశారు. సువాసినులచే సాముహిక కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీనృసింహస్వామి వారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్ని కార్య దర్శి తంగిరాల శ్రీనివాస్, సభ్యుడు కొర్రపాటి రామారావు పర్యవేక్షించారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కమ్మ వైరస్ అంటూ కులాన్ని రెచ్చగొట్టింది అంబటి కాదా?

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇది కరోనా వైరస్ కాదు.. కమ్మ వైరస్ అని తీవ్రంగా దూషించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు నేడు తనకి తాను సచ్ఛీలుడినని కితాబు ఇచ్చుకోవటం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబటి జైలు నుంచి వచ్చాక సానుభూతి కోసం ప్రాకులాడుతూ అసత్యాలు మాట్లాడటం తగదని అన్నారు. ప్రతిపక్షనేతల ఇళ్లమీద, కార్యాలయాలపైనా దాడులు చేసే విషసంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్ రెడ్డేనన్న విషయం అంబటి మర్చిపోకూడదన్నా రు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కుటుంబసభ్యులపై నీచాతినీచంగా మాట్లాడిన కొడాలి నాని, పోసాని కృష్ణమురళి, వంశీ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులపై కేసు లు పెట్టి ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబుని దూషించటం తప్పేనని అంటున్న అంబటి, ఆయనకు క్షమాపణలు చెప్పకుండానే చెప్పానని అబద్ధాలు మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. లోకేశ్ రెడ్ బుక్కుకు నా కుక్క కూడా భయపడదని, దమ్ముంటే తనను అరెస్టు చేసుకోవచ్చని, బెయిల్ కోసం కూడా ప్రయత్నించనని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన ఆయన, న్యాయమూర్తి ముందు తనకు 70 ఏళ్ళని, న్యాయవాదినని, మాజీ మంత్రినని అన్నింటికీ మించి స్లీప్ యాప్నియా అనే వ్యాధి ఉన్నదని, వెంటనే బెయిల్ ఇవ్వాలని న్యాయమూర్తి ముందు ఎందుకు ప్రాధేయపడ్డాడో చెప్పాలని నిలదీశారు. పోలీసులు అంబటికి రక్షణ కల్పించకపోతే పరిస్థితులు మరో రకంగా ఉండేవని అన్నారు. అంబటి ఇకనైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని కనపర్తి హెచ్చరించారు.

హెరిటేజ్‌పై వైసీపీ నిరాధార ఆరోపణలు

● ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హెరిటేజ్‌పై వైసీపీవన్నీ నిరాధార ఆరోపణలేన ని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజం గడప దాటకముందే అబద్ధం ఊరు చుట్టేస్తుందన్నట్లుగా రాష్ట్రంలో పరిస్థితి ఉందన్నారు. నోటికి వచ్చిన అబద్ధాలు ఆడ టం, ఆరోపణలు చేయడం, దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం వైసీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్యగా మారిపోయిందని విమర్శించారు. వైసీపీ హయాంలో టీటీడీలో ఎన్నో ఘోరాతి ఘోరాలు, మరెన్నో పాపిష్టి పనులకు తెగబడిన జగన్ అండ్ కో, ఇప్పుడు తాము ఏదో పవిత్రులం అయినట్లు జగన్నాటకాలు ఆడటం విడ్డూరంగా ఉందన్నారు. గత 35 ఏళ్లుగా మచ్చలేకుండా నడుస్తున్న హెరిటేజ్ సంస్థపై జగన్ తన అక్కసును వెళ్లగక్కుతున్నాడని మండిపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ మహాపాపం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తప్పుడు ఆరోపణలు చేస్తూ.. శుక్రవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు ఏకంగా దేవుడి ఫొటోలతో గదరగోళం సృష్టించడం మరింత దారుణమన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తమ తప్పులు బయటపడకుండా వైసీపీ సభ్యులు ఎంతటి నీచానికైనా దిగజారిపోతున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం బయ టకు రావడంతో జగన్, వైసీపీ సభ్యులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

అన్న క్యాంటీన్ కూల్చివేతతో మాకు సంబంధం లేదు

● టీడీపీ 39వ డివిజన్ అధ్యక్షుడు వీరయ్య

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పలకలూరు రోడ్డులోని అన్న క్యాంటీన్ కూల్చి వేతతో తమకు ఎలాంటి సంబంధం లేదని టీడీపీ 39వ డివిజన్ అధ్యక్షుడు శింగంశెట్టి వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకుగానీ, స్థానిక ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రకుగానీ, తెలుగుదేశం పార్టీకి చెందిన ఇతర సభ్యులకుగానీ ఎవరికీ దీనిపై సమాచారం లేదని తెలిపారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రెండు జేసీబీలు, కమిటీ సభ్యులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారన్నారు. కొన్ని వార్తా పత్రికల్లో దీనిపై తప్పుడు కథనాలు వస్తున్నాయని వాటిని ఖండిస్తు న్నామని తెలిపారు. శివాలయానికి దారి కోసం ఆలయ కమిటీ, స్థానికులు తీసుకున్న తొందరపాటు నిర్ణయమే తప్ప, అందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని వివరించారు.



జిల్లా సహకార బ్యాంకు ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

సహకరించే వరకు.. ఆందోళన విరమించం

● సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

● ఐదవ రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మె

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించేవరకు నిరసనల్లోనే ఉంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. నిరసనల్లో భాగంగా శుక్రవారం బ్రాడీపేట, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిపాలన కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి సమ్మెలో ఉన్నప్పటికి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నాలుగు నెలలుగా నిరసనలు, ధర్నాలు చేపట్టినప్పటికి ప్రభుత్వం అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. జీవో 36 అమలు చేసి, ఉద్యోగుల గ్రాట్యుటీ చట్టాన్ని తీసుకురావాలన్నారు. ప్రతి ఉద్యోగికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని, 2019 తరువాత సహకార సంఘాల్లో చేరిన సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. నిరసనల్లో ప్రత్తిపాడు, కొరెటిపాడు, అమరావతి, పెదకూరపాడు, చేబ్రోలు శాఖ సిబ్బంది, నాయకులు గోగినేని కిషోర్, బాషా, మెట్టు శేషగిరిరావు, జగదీష్ పాల్గొన్నారు.



గుంటూరు మార్కెట్ యార్డు వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులై శుక్రవారం ప్రమాణ స్వీకారానికి బయలుదేరిన జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బీట్రగుంట మల్లికను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు, ఎర్రగోపు నాగేశ్వరరావు, బాబూరావు, సదాశివరావు, హుస్సేను, గణేశ్ - గుంటూరు (ఆంధ్రజ్యోతి).

పర్యాటక అవకాశాలపై సమీక్ష

● రెండో రోజు గోవాలో అధికారుల బృందం



గోవా పర్యటనలో కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సముద్రతీర పరిరక్షణ నిబంధనలు, పర్యావరణ సమతుల్యతలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న మరిన్ని అవకాశాలపై కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం దృష్టి సారించింది. రెండో రోజు గోవా పర్యటనలో భాగంగా శుక్రవారం అక్కడి అధికారులతో పలు సమీక్షలు నిర్వహించింది. వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటిశుద్ధి వంటివి గోవాలో అమలవుతున్న తీరును బృందం పరిశీలించింది. ఇందుకు సంబంధించి అక్కడి ఏజెన్సీలతో అధికారులు సమావేశమయ్యారు. గోవా పర్యాటకంలో భాగంగా అక్కడి సాంస్కృతిక, వారసత్వ సంపదలను ఆతిథ్యానికి అనుగుణంగా ఎలా మలుచుకున్నారో కూడా సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా గోవాలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన అగువాడ జైలు మ్యూజియంను సందర్శించిన అధికారుల బృందం అక్కడి నమూనాలను అధ్యయనం చేసింది. రెండో రోజుల గోవా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి విధానాలపై ఓ అంచనాకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఓ వైపు పర్యాటక పురోగతిపై దృష్టి పెడుతూనే, మరో వైపు ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

జీడీసీసీబీ నిధుల దుర్వినియోగం

● మరో నిందితుడి అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీడీసీసీ బ్యాంక్ నల్లపాడు బ్రాంచ్‌లో నిధులు దుర్వినియోగం కేసులో మరో నిందితుడు వెలిశెల ఏడుకొండలును సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీసీఎస్ స్టేషన్‌లో నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచి డీఎస్పీ మధుసూదనరావు వివరాలు వెల్లడించారు. నిధుల దుర్వినియోగం కేసులో ఏ-10 పల్నాడు జిల్లా మాచవరానికి చెందిన వెలిసెల ఏడుకొండలు కదలికలపై నిఘా ఉంచి, అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఇతను నల్లపాడు జీడీడీసీ బ్యాంక్ పాలకవర్గంలోని ఏడుగురు సభ్యుల కమిటీలో ఎస్సీ కోటా కింద నామినేట్ అయినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల న్యాయస్థాన కస్టడీకి ఆదేశించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావు, వెనుక నిందితుడు ఏడుకొండలు

ఈ కేసులో పరారీలో ఉన్నారని త్వరలో అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

మనసు పడవ.. ఇల్లు కదిలితే!



హౌస్‌బోట్ మోడల్



హౌస్‌బోట్ మోడల్

● తీరానికి సరికొత్త పర్యాటక శోభ

● రూ.9.5 కోట్లతో 2 హౌస్‌బోట్లు

● నేడు నిర్మాణపనులు ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హౌస్‌బోట్ షికారు చేయాలంటే కేరళ వంటి రాష్ట్రాలకు వెళ్లాల్సిందే.. అదే తరహాలో హౌస్‌బోట్‌లు తయారీ చేసి బాపట్ల జిల్లా కేంద్రంలోని సూర్యలంక సముద్రతీరంలో షికారు చేసే అవకాశం కల్పిస్తున్నారు. దీనికోసం రూ.9.5 కోట్లు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ ఆధ్వర్యంలో 2 హౌస్‌బోట్‌లు నిర్మించనున్నారు. సూర్యలంకరోడ్డులోని ఆదర్శనగర్ వద్ద పేరలి డ్రెయిన్ నుంచి సముద్ర మార్గంలో నిజాంపట్నం వరకు వెళ్లి.. తిరిగొచ్చే విధంగా హౌస్‌బోట్ షికారుకు ప్రణాళిక రూపొందించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది.

శనివారం బోట్ తయారీ పనులు ప్రారంభించనున్నారు. రూ.6కోట్లతో 6 బెడ్ రూమ్‌లు, కాన్ఫరెన్స్‌హాలు, ఇతర సౌకర్యాలతో 100 మంది కెపాసిటితో హౌస్ బోట్ నిర్మించనున్నారు. అదే విధంగా రూ.3.5 కోట్లతో నిర్మించే బోట్‌లో రెండు బెడ్ రూమ్‌లు, ఇతర విలాసవంతమైన సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందులో 30మంది ప్రయాణించవచ్చు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక తీరానికి హౌస్‌బోట్ షికారు కొత్తశోభను తీసుకురానుంది. ఇప్పటికే నిత్యం వేలాదిమంది పర్యాటకులు సూర్యలంక తీరానికి వస్తున్నారు. ఈ ప్రాంతాన్ని రూ.97.52 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో పాటు పర్యాటకులకు విలాసవంతమైన అత్యాధునిక హౌస్‌బోట్ షికారు కూడా అందుబాటులోకి రానుంది.



హౌస్‌బోట్ షికారుకు నిర్ణయించిన సూర్యలంక రోడ్డులోని ఆదర్శనగర్ వద్ద పేరలి డ్రైన్



హౌస్‌బోట్ తయారీ కేంద్రం పక్కనే ఉన్న నల్లమడ డ్రైన్

నేడు ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

బాపట్ల మండలం హైదర్‌పేట గ్రామం వద్ద నల్లమడ డ్రెయిన్ పక్కనే హౌస్‌బోట్ నిర్మాణ పనులు శనివారం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు, గుత్తేదారులు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఎమ్మెల్యే వేగేశన పిలుపునిచ్చారు.

గ్రామీణ డాక్ సేవక్‌లు.. తపాలా వ్యవస్థకు బలమైన పునాది

● చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి



సీఎం చంద్రబాబు పాల్గొనే గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ డాక్ సేవకులు తపాలా వ్యవస్థకు బలమైన పునాది అని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (సీజీఎంజీ) శ్రీదేవి అన్నారు. గుంటూరు నగర శివారులోని బొమ్మిడాల నగర్‌లో ఉన్న సత్యసాయి స్పిరిట్యువల్ సొసైటీలో ఈ నెల 22న ఆదివారం జరగనున్న సమ్మేళన ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కమ్యూనికేషన్స్ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రంలో 9,100 బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్న డాక్ సేవకులు ఈ వ్యవస్థకు బలమైన పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమంగా పనిచేసిన 10 మంది జీడీసీలను సత్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారులు యలమందయ్య, వీరనారాయణ, వైవీఎన్ రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, అదనపు ఎస్పీ జి.వి. రమణమూర్తి, బొమ్మిడాల నగర్ సత్యసాయి స్పిరిట్యువల్ సొసైటీ ట్రస్ట్ ప్రాంగణంలో ఏర్పాటు పనులను శుక్రవారం పరిశీలించారు. వీఐపీ, వీవీఐపీ భద్రతా ప్రణాళికలు, వాహనాల పార్కింగ్, వేదిక, ట్రాఫిక్ మళ్లింపు తదతర అంశాలపై చర్చించారు. రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 8 వేల మంది తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొననున్న నేపథ్యంలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నియామకం వంటి భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, ఈస్ట్ డీఎస్పీ అజీజ్, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఆహ్వానం

క్రోసూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో 2026 - 27 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు క్రోసూరులోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మేరీ సుజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 164 మోడల్ స్కూళ్లలో ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి సమాచారానికి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఈ నెల 23 నుంచి మార్చి 31 మధ్య నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ ద్వారా పేమెంట్ గేట్ వే ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



వేరుకుళ్లు తెగులు సోకిన మిర్చి పంట

మిర్చి పంటకు వేరుకుళ్లు

● అధికారుల సలహాల కోసం ఆశలు

క్రోసూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మిర్చి పంటకు వేరుకుళ్లు తెగులు సోకి రైతులు లబోదిబోమంటున్నారు. 88 తాళ్ళూరు, నాగవరం, ఉయ్యందన గ్రామాల పరిధిలో మిర్చి పంటలో ఈ తెగులు ఎక్కువగా ఉందని వాపోతున్నారు. ఎకరాకు రూ.2 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టామని, మొక్క ఎదుగుదల, కాపు సక్రమంగానే ఉన్నప్పటికీ ఒక పక్క నుంచి పసుపు పచ్చగా మారి ఎండిపోతుందని రైతులు చెబుతున్నారు. మొక్క పీకి చూస్తే వేళ్లన్నీ.. నల్లగా మాడిపోయి ఉన్నాయని, కాండం దగ్గర కూడా నల్లగా మొక్కలు కమిలిపోయి ఉన్నట్లు వెల్లడిస్తున్నారు. మూడు గ్రామాల పరిధిలో సుమారు ఐదు వందల ఎకరాల వరకు ఈ తెగులు సోకినట్లు వివరిస్తున్నారు. మిగతా భాగం పంట కూడా ఇలానే అవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. పంటలను సంరక్షణకు సూచనలివ్వాల్సిన హార్టికల్చర్ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు పంటలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని పల్నాడు జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు.

కౌలుకు తీసుకొని నష్ట పోయా

● మాబూ సుభానీ, 88 తాళ్ళూరు




మహబూబ్ సుభానీ

ఈ సంవత్సరం పది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి పంట వేశాను. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. తెగులు కారణంగా.. పంట పూర్తిగా ఎండిపోతుందని ఆందోళనగా ఉంది. అధికారులు సందర్శించి మిర్చి పంటను కాపాడాలి.



అచ్చెన్నాయుడు, అప్పారావులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, అభిమానులు



వైస్ చైర్మన్, డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

మిర్చియార్డుకు.. రైతే అతిథి

(5వ పేజీ తరువాయి)

పాటు నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 2019-24 పూర్తిగా ధ్వంసమైన యార్డును పున:నిర్మాణం చేయాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. రైతుల సమస్యలపై వేగంగా స్పందించాలని, అప్పుడే వారికి న్యాయం దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న యార్డు అవసరాలకు సరిపోవడం లేదని, విశాల ప్రాంతంలో యార్డును ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదిస్తే తప్పకుండా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కుర్రా అప్పారావు సమర్థపాలనలో యార్డు ప్రతిష్ఠ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అగ్రస్థానంలో నిలుపుతా : కుర్రా అప్పారావు

రైతులను, వ్యాపారులను, అధికారులను, కమిటీ సభ్యులను సమన్వయం చేసుకుని యార్డును అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు తెలిపారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రైతుల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పాలకవర్గానికి సూచించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ తొలిసారి చిలకలూరిపేట నియోజకవర్గానికి కీలక పదవి దక్కిందన్నారు. రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగాలని సూచించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ 1993 నుంచి కుర్రా అప్పారావు పరిచయమని, కలిసి చదువుకున్నామని గుర్తుచేసుకున్నారు. తండ్రిలాగానే నిజయితీ పరుడు అని, ఆయన సారథ్యంలో యార్డు పురోగమిస్తుందని ఆకాంక్షించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ యార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, రైతులను ప్రయోజనాలను కాపాడాలన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ యార్డుకు వచ్చిన చెడ్డ పేరును చెరిపేలా కమిటీ కృషి చేయాలన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి మాట్లాడుతూ అప్పారావు నేతృత్వంలో డైరెక్టర్ల సమష్ఠి సహకారంతో యార్డును మరింత అభివృద్ధి చేయాలన్నారు. మాచర్ల, గన్నవరం ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కుర్రా అప్పారావు ముందు.. అప్పారావు తర్వాత ఉండేలా యార్డు అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న మిర్చి సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కమిటీకి సూచించారు.

వేడుకగా ప్రమాణ స్వీకారం

తొలుత చైర్మన్‌గా కుర్రా అప్పారావు, వైస్ చైర్‌పర్సన్‌గా బిట్రగుంట మల్లిక, డైరెక్టర్లుగా కొనకళ్ల వెంకట సత్యనారాయణ, ముడావత్ మంగాబాయి, మొహ్మద్ హఫీజ్, మేళం సైదయ్య, షేక్ ఖాదర్‌బీ, బత్తుల జాన్‌సైదా, దర్శనపు విజయమ్మ, ఇమ్మడి వెంకటలక్ష్మి, డాకుమళ్ల భాగ్యారావు, కుత్తూరు శ్రావణి కుమారి, కటకంశెట్టి విజయలక్ష్మి, చంద్రగిరిబాబు, నక్కల వంశీకృష్ణలతో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రమాణ స్వీకారం చేయించారు.

బాధ్యతల స్వీకరించిన అప్పారావు

గుంటూరు: గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంతో కలిసి చైర్మన్‌గా కుర్రా అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకముందు వారు విఘ్నేశ్వరుని ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఏఎంసీ పరిపాలన భవనంలో అప్పారావు మినిట్స్ ఫైల్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా జీఎంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర అప్పారావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక, పాలకవర్గం వైస్‌చైర్‌పర్సన్ బిట్రగుంట మల్లిక, సభ్యులు కొనకళ్ల వెంకట సత్యన్నారాయణ, ముడావత్ మంగాబాయి, కటకంశెట్టి విజయలక్ష్మి, మొహమ్మద్ హఫీజ్, మేళం సైదయ్య, షేక్ ఖాదర్‌బి, జాన్ సైదా బత్తుల, విజయమ్మ దర్శనపు, చంద్రగిరిబాబు, వెంకటలక్ష్మి ఇమ్మడి, డక్కుమళ్ల భాగ్యారావు, నక్కల వంశీకృష్ణ, కుత్తూరు శ్రావణకుమారి తదితరులు హాజరయ్యారు.



ప్రమాణ స్వీకారోత్సవ సభలో ప్రసంగిస్తున్న యార్డు చైర్మన్ కుర్ర అప్పారావు



కుర్రా అప్పారావుని సత్కరిస్తున్న భాష్యం రామకృష్ణ



కుర్ర అప్పారావు తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు పుల్లారావు, రామాంజనేయులు, భాష్యం ప్రవీణ్

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సీఈఓ వీర్ల జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన కారుణ్య నియామకాల ప్రక్రియ ద్వారా అర్హులైన ఇద్దరు అభ్యర్థులకు ఆఫీసు సబార్డినేట్లుగా నియామక ఉత్తర్వులు అందజేశారు. కోలా ఆశిష్ బెన్నీని నరసరావుపేట ఎంపీపీ కార్యాలయానికి, ఏహెచ్ఎస్ వెంకటేశ్వర్లును గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేటాయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ నూతన సంవత్సరం ఒక మంచి పనితో ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేయాలని, ఏసీసీ రూల్స్ తప్పని సరిగా తెలుసుకొని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్, ఏ సెక్షన్ ఏవో నిర్మల భారతి పాల్గొన్నారు.

రబీ రికార్డు

(5వ పేజీ తరువాయి)

సాధారణ విస్తీర్ణం 56,962 ఎకరాలు కాగా 89,643 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది 49,100 ఎకరాల్లో సాగు కాగా ఈ సారి 40,493 ఎకరాలు పెరిగింది. ఇది 157 శాతంగా నమోదైంది. జిల్లాలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 27,065 ఎకరాలు కాగా గత ఏడాది 35,925 ఎకరాల్లో, ఈ సారి 1,06,540 ఎకరాల్లో సాగైంది. సాగు 394 శాతంగా నమోదైంది. కంది సాధారణ విస్తీర్ణం 7,510 ఎకరాలు కాగా 22,490 ఎకరాల్లో సాగు చేశారు. 299 శాతంగా నమోదైంది. శనగ సాధారణ విస్తీర్ణం 28,243 ఎకరాలకు 28,243 ఎకరాల్లో సాగైంది. బాపట్ల జిల్లాలో వరి సాగు సాధారణం కన్నా తగ్గింది. 28,555 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 72,050 ఎకరాలు కాగా 1,00,277 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాగు 139 శాతంగా నమోదైంది. జొన్న 26,060 ఎకరాల్లో, శనగ సాధారణ విస్తీర్ణం 67,540 ఎకరాలు కాగా 89,435 ఎకరాల్లో సాగైంది. పెసర 33,762 ఎకరాల్లో, మినుము 80,105 ఎకరాల్లో సాగు చేశారు. గుంటూరు జిల్లాలో మొక్కజొన్న విస్తృతంగా సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 50,835 ఎకరాలు కాగా 68,425 ఎకరాల్లో సాగు చేయగా 158 శాతంగా నమోదైంది. శనగ సాధారణ విస్తీర్ణం 20,302 ఎకరాలు కాగా 36,475 ఎకరాల్లో సాగు చేయగా 211 శాతంగా నమోదైంది. పెసర 29,840 ఎకరాల్లో, మినుము 17,803 ఎకరాల్లో, జొన్న 39,875 ఎకరాల్లో సాగు చేశారు.

నిషేధంతో తగ్గిన పొగాకు

పొగాకు సాగు 77,865 ఎకరాల్లో తగ్గింది. ప్రభుత్వం నల్ల బర్లీ పొగాకు సాగును నిషేధించడంతో మూడు జిల్లాల్లో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ, జొన్న పంటలు సాగు చేశారు. పల్నాడు జిల్లాలో గత ఏడాది 15,157 ఎకరాల్లో, బాపట్లలో 64,580, గుంటూరు జిల్లాలో 11,150 ఎకరాల్లో రైతులు సాగు చేయగా ఈ ఏడాది పల్నాడులో 2,480, బాపట్లలో 9,010, గుంటూరులో 1,532 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది మూడు జిల్లాల్లో 90,887 ఎకరాల్లో పొగాకు సాగు చేయగా ఈ సారి 13,022 ఎకరాల్లో సాగు చేశారు.

సమాన అవకాశాలతోనే సామాజిక న్యాయం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు అందితే సమాజంలో సామాజిక న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని 'సంపద పున:పంపిణీతో సామాజిక, ఆర్థిక న్యాయం' అనే అంశంపై శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాలకు, తమ శక్తి, శ్రమ ద్వారా సంపద సృష్టిస్తున్న వారికి సంపద పున:పంపిణీ జరగాలని సీపీఐ కోరుకుంటుందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్‌లో రూ.20లక్షల కోట్ల ఉద్దీపన పథకాలలో సామాజిక న్యాయం, పేదలకు స్థానం ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా దేశ సంపదలో 46 శాతం కేవలం ఒక శాతం, 10శాతం మంది దగ్గర 75శాతం సంపద పోగుపడిందన్నారు. మోదీ పాలనలో కార్పొరేట్లకు రూ.20 లక్షల కోట్లు రుణమాఫీ, రాయితీలు ఇచ్చారని, కానీ దేశంలోని రైతాంగానికి మాత్రం ఒక్క రూపాయి అప్పు మాఫీ చేయలేదని విమర్శించారు. జన విజ్ఞాన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం అమలులో కేరళ రాష్ట్రం ముందుందని, ఆ రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన రాష్ట్రాలు ముందుకు రావాలని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన నేటికి సామాజిక న్యాయం గురించి చర్చించుకోవడం శోచనీయమన్నారు. జంగాల అజయ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వేల్పూరి నరసింహారావు, చల్లా చిన్న ఆంజనేయులు, పుప్పాల సత్యనారాయణ, ముప్పాళ్ళ శివశంకరరావు, కాబోతు ఈశ్వరరావు, తన్నేటి ప్రభుదాస్ తదితరులు ఈ సమావేశంలో ప్రసంగించారు. సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు అధ్యక్షత వహించారు.



బలవర్ధకమైన ఆహారం తీసుకుంటున్నా నీరసం, నిస్సత్తువలు వేధిస్తుంటే, అదనపు శక్తిని అందించే స్నాక్స్ తినాలి. అందుకోసం బిస్కెట్లు, ఎనర్జీ బార్స్‌ను ఎంచుకోడానికి బదులుగా, ఇదిగో ఈ పోషకభరిత స్నాక్స్‌ను ఇంట్లోనే తయారుచేసుకోండి.

శక్తినిచ్చే స్నాక్స్

నోరూరించే జొన్న వడ

వంటిల్లు



చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి జొన్నలు. గ్లూటేన్ లేని సురక్షితమైన పోషకాహారమిది. కప్పు జొన్నల్లో 12 గ్రాముల ఫైబర్ ఉంటుంది. వీటిలో పీచు కూడా ఎక్కువే! కాబట్టి వీటినెలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం...

కావలసిన పదార్థాలు:

జొన్న పిండి - 1 కప్పు. శనగపిండి - అర కప్పు
అల్లం తురుము - అర టీస్పూను
వెల్లుల్లి తరుగు - 1 టీస్పూను
పెరుగు - 1 కప్పు
ఉప్పు, కారం, పసుపు - సరిపడా
నీళ్లు - తగినన్ని. నువ్వులు - 2 టీస్పూన్లు
నూనె - వేపుడుకు సరిపడా

తయారీ విధానం:

- పైన చెప్పిన పదార్థాలన్నిటినీ గిన్నెలో వేసి నీళ్లు జోడించి ముద్దలా కలుపుకోవాలి
- గుండ్రంగా వడలు చేసుకుని పక్కన పెట్టుకోవాలి
- వేడి నూనెలో వడలను ఎర్రగా వేయించుకోవాలి
- కొబ్బరి లేదా అల్లం చట్నీతో వేడిగా వడ్డించాలి.

బలవర్థకమైన ఖర్జూర లడ్లు

ఖర్జూరంలో విటమిన్ బి6, రాగి, మెగ్నీషియం ఉంటాయి. జీడిపప్పులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రక్తవృద్ధికి తోడ్పడి నిస్సత్తువను దూరం చేస్తాయి. కాబట్టి వీటినెలా తయారు చేయాలంటే....



కావలసిన పదార్థాలు:

ఖర్జూరాలు - 1 కప్పు
పచ్చి కొబ్బరి - అర కప్పు
జీడిపప్పు - 1 కప్పు
నెయ్యి - రెండు టీస్పూన్లు

తయారీ విధానం:

- ఖర్జూరాలను విత్తనాలు తీసి గంట పాటు నీళ్లలో నానబెట్టి, ఆరబెట్టుకోవాలి
- జీడిపప్పులో కొబ్బరి కలిపి, బ్లెండ్ చేయాలి
- దీన్లోనే ఖర్జూరాలు, నెయ్యి కూడా వేసి మళ్లీ బ్లెండ్ చేయాలి
- ఇలా తయారైన చిక్కని మిశ్రమాన్ని ఉండలు చుట్టాలి
- వీటిని ఫ్రిజ్‌లో చల్లబరిచి పిల్లలకు ఇవ్వాలి

రక్తాన్ని పెంచే రాగి బిస్కెట్లు

రాగుల్లోని క్యాల్షియం ఎముక బలాన్ని పెంచుతుంది. వీటిలోని పీచు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచితే, ఐరన్ రక్తవృద్ధికి తోడ్పడుతుంది. కాబట్టి చక్కెర జోడించకుండా రాగులతో బిస్కెట్స్ ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం!



కావలసిన పదార్థాలు:

రాగి పిండి - 1 కప్పు
యాలకుల పొడి - అర టీస్పూను
సొంఠి - చిటికెడు
గుడ్డు - 1, ఉప్పు - అర చెంచా
రైస్ బ్రాన్ ఆయిల్ - అర కప్పు

తయారీ విధానం:

- రాగి పిండి, యాలకుల పొడి బాండీలో వేసి నూనె లేకుండా రెండు నిమిషాల పాటు వేయించాలి
- ఇప్పుడు గుడ్డు, సొంఠి, ఉప్పు వేసి కలపాలి
- చివర్లో నూనె వేసి ముద్దలా కలపాలి
- ఈ ముద్దను చిన్న ఉండలుగా చుట్టి, గుండ్రంగా బిస్కెట్లుగా వత్తుకోవాలి
- ఈ బిస్కెట్లను బటర్ పేపర్ వేసిన ట్రేలో పరుచుకోవాలి
- ఓవెన్‌ను ప్రీ హీట్ చేసుకోవాలి
- 180 డిగ్రీల దగ్గర 8 నిమిషాలపాటు బేక్ చేసి తీయాలి

ఎడారి తేనె ఖర్జూరం

భోజనకుతూహలం

ఖర్జూరం ఎడారి నేలలో పుట్టిన మధుర ఫలం. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిలోని కాల్షియం, ఫాస్ఫరస్, ఇనుము, పొటాషియం.. ఇతర ఖనిజాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే మన పూర్వీకులు తేనె లేదా బెల్లం బదులుగా దీనిని ఉపయోగించమని సూచించారు. ఖర్జూరంలోని ప్రత్యేకతలేమిటో చూద్దాం..

- ఎండు ఖర్జూరం రక్తస్రావాన్ని శాంతింపచేసే ఔషధం. ప్రతి రోజు ఒక ఖర్జూరం తినటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.
- ఖర్జూరం దప్పికను తగ్గిస్తుంది. ఆయాసం, ఎక్కిళ్లు, శ్వాసకోశ సమస్యల నుంచి నివారణకు ఇది ఉపకరిస్తుంది.
- కొందరికి ఆకలి వేయదు. ఏదైనా తిన్నా రుచిగా అనిపించదు. అలాంటి వారికి ఖర్జూరం మంచి ఔషధం.
- లేత ఖర్జూరం కొంత వగరుగా ఉంటుంది. కానీ దానిని తినటం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.
- ఖర్జూరపు గింజలలో కూడా అనేక పోషక పదార్థాలు ఉన్నాయి. అందువల్ల ఈ గింజలను వేయించి గోధుమ పిండితో కలిపి రోటీలు చేసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో కాఫీ పౌడర్‌లో చికోరి బదులుగా ఉపయోగిస్తారు.
- అరబ్, ఆఫ్రికా దేశాల్లో ఖర్జూరపు బెల్లాన్ని ఎక్కువగా



వాడతారు. మన దేశంలో దీని వాడకం తక్కువ.
- దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యల్లో ఉపశమనం కోసం ఖర్జూరాన్ని వాడవచ్చు.
- ఎండు ఖర్జూరాన్ని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగితే అలసట తీరుతుంది. మధుమేహ రోగులు కూడా ఈ నీటిని పరిమితంగా తీసుకోవచ్చు.
- ఖర్జురాన్ని ఎక్కువగా తినకూడదు. ఎక్కువగా తింటే అనేక రకాల జీర్ణసమస్యలు ఎదురయ్యే అవకాశముంది.

• గంగరాజు అరుణాదేవి

డిజిటల్ డిటాక్స్

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మన చేతిలో ఫోన్ లేని క్షణాన్ని ఊహించుకోలేం. పొద్దున్న లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు ఏదో ఒక స్క్రీన్ మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. సోషల్ మీడియా నోటిఫికేషన్లు, అనవసరమైన ఈ మెయిల్స్ నిరంతర వార్తల ప్రవాహం.. వెరసి మన మెదడు ఒక రకమైన డిజిటల్ ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'డిజిటల్ డిటాక్స్' అనే పదం మార్మోగుతోంది.



ఏంటీ డిజిటల్ డిటాక్స్

శరీరంలోని వ్యర్థాలను తొలగించుకోవడానికి మనం ఎలాగైతే ఉపవాసం ఉంటామో, మన మనసుపై పేరుకుపోయిన డిజిటల్ భారాన్ని తగ్గించుకోవడమే ఈ డిజిటల్ డిటాక్స్ ఉద్దేశం. అంటే నిర్ణీత సమయం వరకు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండటం.

ఎందుకు అవసరం?

నిరంతరం ఫోన్ వైపు చూడటంవల్ల మనలో ఏకాగ్రత లోపిస్తుంది. ఎదుటివారితో నేరుగా మాట్లాడటం తగ్గిపోయి వర్చువల్ ప్రపంచమే నిజమని భ్రమపడుతుంటాం. ఇది నిద్రలేమికి, మానసిక ఆందోళనకు దారితీస్తుంది. దీని నుంచి బయటపడాలంటే డిజిటల్ బ్రేక్ తప్పనిసరి.

ఇంటిని స్వర్గధామం చేద్దాం

ఇల్లు శుభ్రంగా ఉంటే మనసు ప్రశాంతంగా ఉంటుంది. పెద్దగా కష్టపడకుండానే మీ ఇంటిని ఎప్పుడూ కొత్తదానిలా ఉంచుకోవడానికి కొన్ని స్మార్ట్ చిట్కాలు ఇక్కడ ఉన్నాయి.

వాసన లేని ఫ్రిజ్

ఫ్రిజ్ నుంచి ఒక్కోసారి వింత వాసన వస్తుంటుంది. అలా కాకుండా ఉండాలంటే ఒక చిన్న గిన్నెలో కొంచెం వంటసోడా లేదా సగం కోసిన నిమ్మకాయను ఉంచండి. అది చెడువాసనలను పీల్చేస్తుంది.



మరకలు వదిలించండి

దుస్తుల మీద నూనె మరకలు పడితే వెంటనే దానిపై కొంచెం పౌడర్ చల్లండి. అది నూనెను పీల్చుకుంటుంది. ఆ తర్వాత డిటర్జెంట్‌తో ఉతికితే మరక సులభంగా వదులుతుంది.

గోడలపై గీతలు

పిల్లలు గోడలపై క్రేయాన్స్‌తో గీతలు గీస్తే, కొంచెం టూత్‌పేస్ట్ రాసి మెత్తని గుడ్డతో తుడవండి. గోడ పెయింట్ పోకుండానే గీతలు మాయమవుతాయి.

చరిత్రను తిరగరాసిన సరిత

స్ఫూర్తి

నీలి ఆకాశం.. మంచు కురిసే కొండలు.. మలుపులు తిరిగే పట్టాలు! 146 ఏళ్ల డార్జిలింగ్ టాయ్ ట్రైన్ చరిత్రలో ఇప్పటి వరకు వినిపించని ఒక కొత్త సంతకం.. సరిత యోల్మో. పురుషులకే పరిమితమైన బాధ్యతను చిరునవ్వుతో స్వీకరించి, హిమాలయాల సాక్షిగా సరికొత్త రికార్డు సృష్టించిన ఈ 'వండర్ ఉమెన్' స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది!



డార్జిలింగ్ మంచు కొండల మధ్య కూత పెడుతూ సాగే టాయ్ ట్రైన్ ప్రయాణం పర్యాటకులకు ఒక మధుర స్వప్నం. అయితే ఫిబ్రవరి 5 నుంచి ఆ ప్రయాణంలో ఒక కొత్త మార్పు కనిపిస్తోంది. తెల్లటి యూనిఫాం ధరించి, చిరునవ్వుతో టికెట్లు తనిఖీ చేస్తూ పర్యాటకులను పలకరిస్తున్న 55 ఏళ్ల సరిత యోల్మో ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. న్యూ జల్పాయిగురి నుంచి డార్జిలింగ్ వరకు సాగే 10 గంటల సుదీర్ఘ ప్రయాణంలో ఆమె ఒక్కరే టీటీఈగా బాధ్యతలు నిర్వర్తిస్తూ చరిత్ర సృష్టించారు.

అనౌన్సర్‌గా మొదలై.. ఆఫీసర్‌గా ఎదిగి

సరిత ప్రయాణం ఏమీ పూలబాట కాదు. 1991లో రైల్వేలో సాధారణ ఉద్యోగినిగా చేరిన ఆమె.. తన 34 ఏళ్ల కెరీర్‌లో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. మొదట కుర్సియాంగ్‌లోని రైల్వే ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేశారు.



విధిని మార్చుకున్న వైనం

నిజానికి కుర్సియాంగ్‌లో ప్రెస్ మూతబడినప్పుడు సరిత నీరుగారిపోలేదు. ఆ సవాలును ఒక అవకాశంగా మార్చుకున్నారు. "ఒకవేళ ఆ ప్రెస్ మూతపడకపోయి ఉంటే, నేను ఈ రోజు ఇలా టీటీఈగా మీ ముందు ఉండేదాన్ని కాదు. విధి నా కోసం ఏదో గొప్పది దాచి ఉంచిందని ఇప్పుడు అర్థమవుతోంది" అని ఆమె పంచుకున్న మాటలు మనల్ని ఆలోచింపజేస్తాయి.

అయితే, ఆ ప్రెస్ మూతపడటంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. 2019లో న్యూ జల్పాయిగురికి బదిలీ అయిన ఆమె అక్కడ రైల్వే అనౌన్సర్‌గా, ఆ తర్వాత ఎంక్వైరీ కౌంటర్‌లో పనిచేస్తూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. తన పట్టుదలతో ఎట్టకేలకు కమర్షియల్ విభాగానికి మారి నేడు ప్రతిష్ఠాత్మకమైన టీటీఈ హోదాను దక్కించుకున్నారు.

పర్యాటకుల ఆనందం

సాధారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఐదారుగురు టీటీఈలు బృందంగా పనిచేస్తారు. కానీ, డార్జిలింగ్ టాయ్ ట్రైన్‌లో సరిత ఒక్కరే పూర్తి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. "మొదట్లో కాస్త కంగారు పడ్డాను, కానీ ప్రయాణికుల ఆదరణ చూశాక అంతా మర్చిపోయాను" అని ఆమె ఆనందంగా చెబుతారు. ఒక మహిళా ఆఫీసర్‌ని చూసిన ప్రయాణికులు ఆశ్చర్యపోవడమే కాకుండా ఆమెతో ఫొటోలు దిగడానికి పోటీపడుతున్నారు. ఇది ఉద్యోగం మాత్రమే కాదు, ప్రయాణికులతో మానవీయ సంబంధాన్ని ఏర్పరచుకునే అవకాశం అని ఆమె అంటారు.

బాధ్యత గల తల్లి

సరిత విజయం వెనుక ఆమె కుటుంబ ప్రోత్సాహం ఎంతో ఉంది. ఆమె భర్త దావా యోల్మో రైల్వేలోనే సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. "సరిత అంకితభావం కలిగిన ఉద్యోగి మాత్రమే కాదు.. బాధ్యత గల తల్లి, మంచి భార్య కూడా. ఇప్పుడు ఆమెపై మరింత బాధ్యత పెరిగింది" అని ఆయన గర్వంగా చెబుతారు. ఇటు కుటుంబాన్ని, అటు వృత్తిని బ్యాలెన్స్ చేస్తూ ఆమె సాగిస్తున్న ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

వేసవి దాహం.. ఇలా మాయం

వేసవి వచ్చిందంటే చాలు శరీరం డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. కేవలం నీళ్లు మాత్రమే కాకుండా ఈ కింది పానీయాలు మీ శరీరానికి తక్షణ శక్తిని, చలువను అందిస్తాయి.

మసాలా మజ్జిగ: మన సంప్రదాయ పానీయం మజ్జిగకు మించిన చలువ చేసే పదార్థం మరోటి లేదు. ఇందులో ఉండే ప్రొబయాటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మజ్జిగలో కాస్త అల్లం ముక్కలు, పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకు, వేయించిన జీలకర్ర పొడి కలిపితే అది రుచితోపాటు ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది.

గసగసాల పానీయం: గసగసాల్లో సహజంగానే చలువ చేసే గుణం ఉంటుంది. గసగసాలను నానబెట్టి మెత్తగా రుబ్బి పాలు లేదా నీళ్లలో కలిపి కొంచెం బెల్లం చేర్చి తాగాలి. ఇది రాత్రిపూట మంచి నిద్రపట్టేలా కూడా చేస్తుంది.

సబ్జా గింజలు: సోషల్ మీడియాలో 'సూపర్ ఫుడ్'గా పేరు తెచ్చుకున్న సబ్జా గింజలు వేసవిలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను తక్ష



ణమే తగ్గిస్తాయి. నిమ్మరసం లేదా షర్బత్‌లో నానబెట్టిన సబ్జా గింజలను కలిపి తాగడం వల్ల పొట్టలో మంట తగ్గుతుంది.

పుచ్చకాయ-పుదీనా జ్యూస్: పుచ్చకాయలో 90 శాతానికిపైగా నీరు ఉంటుంది. పుచ్చకాయ ముక్కలను మిక్సీలో వేసి అందులో కొన్ని పుదీనా ఆకులు, చిటికెడు నల్ల ఉప్పు కలిపితే అద్భుతమైన రిఫ్రెష్ డ్రింక్ రెడీ అవుతుంది.

బార్లీ వాటర్: శరీరంలోని వ్యర్థాలను బయటకి పంపి కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడటంలో బార్లీ నీరు నంబర్ వన్. బార్లీ నీటిని మరిగించి చల్లారాక అందులో నిమ్మరసం కలుపుకొని తాగితే నీరసం రాకుండా ఉంటుంది.

ప్రేమ లేఖలతో బంధం పదిలం

లైఫ్



కరీనా, సైఫ్ అలీ ఖాన్ దంపతులు, ఇప్పటికీ ఒకరికొకరు ప్రేమలేఖలు రాసుకుంటూ ఉంటామని చెప్పి అకస్మాత్తుగా మీడియాను ఆశ్చర్యపరిచారు. నిజంగానే ప్రేమలేఖలు బంధాన్ని బలపరిచే సాధనాలుగా ఉపయోగపడతాయా?

కరీనా కపూర్, సైఫ్ అలీ ఖాన్ ఎప్పుడూ కపుల్ గోల్స్‌ను నిర్దేశించుకుంటూనే ఉంటారు. వాళ్ల ప్రేమ జీవితం గురించి వివరిస్తూ, తామిద్దరం ఇప్పటికీ పుట్టిన రోజునాడు ఒకరికొకరు ప్రేమలేఖలు రాసుకుంటూ ఉంటామని తాజాగా వెల్లడించారు. ఆధునిక ప్రేమల్లో మాటలకే ప్రాధాన్యం ఎక్కువ. నేటి దంపతులు సందేశాలు, ఫోన్ కాల్స్, వాయిస్ నోట్స్ ద్వారా పరస్పరం సంభాషించుకుంటూ ఉంటారు. ఈ సంభాషణల ద్వారా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటారే తప్ప భావోద్వేగాలను పంచుకోరు, బహిర్గతం చేసుకోరు. ప్రేమను మాటల్లో, చేతల్లో కనబరచడం కచ్చితంగా అవసరమే! కానీ మన మాటలు పదే పదే మనసును తాకేలా ఉండాలంటే, వాటికి అక్షర రూపాన్నివ్వాలంటున్నారు ప్రముఖ లైఫ్ కోచ్, సైకోథెరపిస్ట్... 'డెల్నా రాజేష్'. ఆమె ఏమంటున్నారంటే...

అర్థం చేసుకునే వ్యవధి చిక్కుతుంది

"కీప్యాడ్ మీద వేగంగా వేళ్లు కదిలించి సందేశాన్ని సృష్టించడం, టైప్ చేసిన సందేశాన్ని చెరిపేయడం.. రెండూ సులభమే! అలాగే అందుకున్న సందేశానికి వెనువెంటనే సమాధానం ఇచ్చేయడమూ సాధ్యమే! ఇక్కడ ఆలోచనకు తగిన సమయం ఉండకపోవచ్చు. ప్రతిస్పందన రెప్పపాటులో జరిగిపోవచ్చు. ఈ దుందుడుకుతనం అపార్థాలకు దారితీసి, తిప్పలను తెచ్చిపెట్టొచ్చు. పైగా ఫోన్ సందేశాల్లో అసలైన భావం వ్యక్తం అవకపోవచ్చు. కానీ ఉత్తరం వీటికి పూర్తి భిన్నం. ఉత్తరం రాయాలంటే కుదురుగా కూర్చోవాలి. మనసులోని ఆలోచనలను ఒక కొలిక్కి తీసుకొచ్చి, వాటికి అక్షర రూపమివ్వడానికి సమయం పడుతుంది. ఆలోగా అవతలి వ్యక్తికి చెప్పాలనుకున్న విషయం గురించి మనలో స్పష్టత ఏర్పడుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా ఉత్తరం చదవడం ద్వారా వెంటనే ప్రతిస్పందించకుండా మన హృదయాన్ని అర్థం చేసుకునే తీరుబడి అవతలి వ్యక్తికి దక్కుతుంది. ఈ వ్యవధితో భావోద్వేగ భద్రత సాధ్యపడుతుంది.

ఉత్తరాలు వ్యక్తిగత రికార్డులు

ప్రేమలేఖలు రాసుకోవడం ప్రేమకు చిహ్నం మాత్రమే కాదు. ప్రేమాప్యాయతలు, మరమ్మతులు, నిరీక్షణలు, క్షమాపణలు, కృతజ్ఞతలు, జ్ఞాపకాల వ్యక్తిగత రికార్డులు కూడా! దీర్ఘకాల అనుబంధాలు తరచూ ఒక నిశ్శబ్ద శత్రువుతో పోరాడుతూ ఉంటాయి. అదే... 'భావోద్వేగా మతిమరుపు'. దంపతులు తొలిప్రేమ మృదుత్వాన్నీ, మాధుర్యాన్నీ మర్చిపోతారు. అంతకాలం కలిసి ఉన్న కారణాన్ని మర్చిపోతారు. ఉత్తరాలు ఈ మతిమరుపు నుంచి రక్షణ కల్పిస్తాయి. జీవితం బరువెక్కినప్పుడు, ముడిపడిన బంధం వెనకున్న భావోద్వేగాల మూలాల్లోకి ప్రయాణించడానికి ఉత్తరాలు సహాయపడతాయి. తండ్రి/తల్లి, ప్రొవైడర్, కేర్ గివర్, పర్ఫార్మర్... మొదలైన పాత్రలను అందుకోక ముందు, ఒకర్నొకరు ఎంచుకున్న ఇద్దరు వ్యక్తులమనే విషయాన్ని దంపతులు గుర్తుచేసుకోడానికి ఉత్తరాలు దోహదపడతాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఉత్తరాలు రాసుకోవడం వల్ల వాటిని పదే పదే తిరిగి చదువుకోడానికీ, అక్షరాలను స్పృశించడానికీ వీలు పడుతుంది. కాబట్టి దంపతులు ఈ పాత అలవాటును పునఃప్రారంభించడం ఎంతో అవసరం. ఒక చిన్న నోట్‌తో మొదలుపెట్టి, మనసులోని భావాలను పదాల్లో వ్యక్తపరుస్తూ ఉత్తరాలు రాయడం సాధన చేయాలి."

ప్రీ సీడింగ్‌పై విమర్శలు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 ఫార్మాట్‌పై విమర్శలు వినిపిస్తున్నాయి. తొలి రౌండ్‌లో గ్రూప్ టాపర్స్‌గా నిలిచిన నాలుగు జట్లు కూడా సూపర్ 8లో గ్రూప్-1లోనే ఉన్నాయి. ఇక రెండో స్థానంలో నిలిచిన జట్లన్నీ గ్రూప్-2లో ఉన్నాయి. టోర్నీ ఆరంభానికి ముందే ర్యాంకులను బట్టి ఈ స్లాట్‌లను ఐసీసీ కేటాయించింది (ఉదాహరణకు ఎ1, బి1, సి1, డి1). కానీ దీని ద్వారా భారీ అసమతుల్యత కనిపిస్తోందని సోషల్ మీడియాలో అభిమానులు ఆరోపిస్తున్నారు. ఎందుకంటే అద్భుత ఆటతీరుతో టాపర్స్‌గా నిలిచిన రెండు జట్లు కూడా గ్రూప్-1 నుంచి సెమీస్‌కు ముందే నిష్క్రమించాల్సి ఉంటుంది. అటు రెండో స్థానంలో నిలిచిన జట్లు మాత్రం గ్రూప్-2 నుంచి సెమీస్‌కు వెళతాయి. ఫలితంగా గ్రూప్ టాపర్స్‌కు అన్యాయం జరిగినట్టేనని వాదిస్తున్నారు.



ఇక సూపర్ ఫైట్

బరిలో 8 జట్లు

నేటి నుంచి సెమీస్ బెర్తులకు పోటీ



టీ20 వరల్డ్‌కప్

భారత్‌కు సవాల్

కొలంబో: సంచలన ఫలితాలతో ఆసక్తికరంగా సాగుతున్న టీ20 వరల్డ్‌కప్ ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. 20 జట్లతో ఆరంభమైన ఈ మెగా టోర్నీలో ప్రస్తుతం 8 జట్లు మిగిలాయి. వీటి మధ్య శనివారం నుంచి మార్చి 1 వరకు సూపర్-8 పోరు సాగనుంది. గ్రూప్ 'ఎ' నుంచి భారత్, పాకిస్థాన్.. గ్రూప్ 'బి' నుంచి జింబాబ్వే, శ్రీలంక.. గ్రూప్ 'సి' నుంచి వెస్టిండీస్, ఇంగ్లండ్.. గ్రూప్ 'డి' నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఈ దశకు చేరుకున్నాయి. ఇక సెమీఫైనల్స్‌లో చోటే లక్ష్యంగా ఈ జట్లన్నీ అమీతుమీ తేల్చుకోనున్నాయి. మాజీ విజేత ఆస్ట్రేలియాతో పాటు అఫ్ఘానిస్థాన్ గ్రూప్ దశ నుంచే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. అయితే తాజా ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విడదీశారు. గ్రూప్-1లో భారత్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్.. గ్రూప్-2లో న్యూజిలాండ్, ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్ ఉన్నాయి. ఇందులో ప్రతీ జట్టు మూడు మ్యాచ్‌లు ఆడనుంది. రెండింట్లో నుంచి టాప్-2గా నిలిచిన జట్లు సెమీస్‌కు వెళతాయి. పాయింట్లు సమంగా ఉంటే నెట్ రన్‌రేట్ కూడా కీలకమవుతుంది కాబట్టి ప్రతీ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

వాస్తవానికి గ్రూప్-1 పరిశీలిస్తే భారత్‌కు పెద్దగా పోటీ లేదేమోననిపిస్తుంటుంది. కానీ ఈ మెగా టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా సూపర్-8కు వచ్చిన జట్లన్నీ ఇదే గ్రూప్‌లో ఉన్నాయనే విషయం మరువరాదు. అంచనాలకు మించిన ఆటతీరుతో ఈసారి వెస్టిండీస్, జింబాబ్వే చెలరేగుతున్నాయి. ముఖ్యంగా ఆసీస్, శ్రీలంకలను జింబాబ్వే మట్టికరిపించింది. ఎలాంటి తడబాటు లేకుండా దూకుడుగా సాగుతున్న ఈ జట్లను తక్కువ అంచనా వేస్తే కష్టమే. ముందుగా భారత జట్టు ఆదివారం సఫారీలతో ఆడనుంది. దీంతో 2024 టోర్నీ ఫైనల్ మ్యాచ్ రిపీట్ కానుంది. మరోవైపు గ్రూప్-2లో అన్నీ పటిష్ట జట్లే కావడంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగడం ఖాయం. ముఖ్యంగా పాక్‌పై తీవ్ర ఒత్తిడే నెలకొంది. అన్నీ సవ్యంగా కుదిరితే మరోసారి దాయాది జట్ల మధ్య సమరానికి కూడా ఆస్కారం లేకపోలేదు.



పాక్‌తో కివీస్ ఢీ

సూపర్-8లో ఆరంభ పోరు నేడే

రాత్రి 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గ్రూప్-2లో ఉన్న పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య శనివారం తొలి సూపర్-8 మ్యాచ్ జరగనుంది. భారత్ చేతిలో ఓడి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పాక్ తమ చివరి మ్యాచ్‌లో నమీబియాపై చెలరేగింది. ఇక స్పిన్నర్లు తారిఖ్, ఎబ్రార్, సయీమ్, నవాజ్, షాదాబ్‌ల అండతో కివీస్‌పై పాక్ పంజా విసరాలనుకుంటోంది. అయితే బ్యాటర్లు మాత్రం విఫలమవుతున్నారు. ఓపెనర్ సాహిబ్జాదా ఫామ్‌లో ఉన్నా, బాబర్ ఆజమ్‌పై ఒత్తిడి నెలకొంది. అటు కివీస్‌కు అనుభవం కలిగిన బౌలర్లున్నారు. కానీ బ్యాటింగ్‌లో ఓపెనర్లు సైఫర్ట్, అలెన్ మాత్రమే సత్తా చాటుతున్నారు. మిడిలార్డర్‌లో ఫిలిప్స్, చాప్‌మన్, మిచెల్‌లో నిలకడ లేదు. పాక్ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కోవాలంటే వీరంతా మెరుగ్గా రాణించాలి.

మన పోరుకు అంపైర్లు వీళ్లే

ముంబై: సూపర్-8లో ఆదివారం దక్షిణాఫ్రికాతో భారత్ ఆడే మ్యాచ్‌కు అనుభవజ్ఞులైన రిచర్డ్ కెటిల్‌బరో, క్రిస్ గఫానె ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. టీవీ అంపైర్‌గా అలెక్స్ వార్ఫ్, ఫోర్త్ అంపైర్‌గా క్రిస్ బ్రౌన్‌ను ఎంపిక చేసినట్టు ఐసీసీ శుక్రవారం ప్రకటించింది. ఇక, పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య జరిగే సూపర్-8 ఆరంభ పోరుకు రోడ్నీ టక్కర్, పాల్ రీఫిల్ ఫీల్డ్ అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అలాగే, సూపర్-8లో అన్ని మ్యాచ్‌లకు అంపైర్ల పేర్లను ఐసీసీ వెల్లడించింది.

టైటిల్ పోరుకు మనమ్మాయిలు

- రాధ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- సెమీస్‌లో లంక చిత్తు
- మహిళల రైజింగ్ స్టార్స్ ఆసియా కప్

బ్యాంకాక్: మహిళల రైజింగ్ స్టార్స్ టీ20 ఆసియా కప్‌లో భారత్-ఎ జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. కెప్టెన్ రాధా యాదవ్ (4/19, 31 నాటౌట్) ఆల్‌రౌండ్ షోతో విజృంభించడంతో మనమ్మాయిల బృందం ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో భారత్ ఐదు వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుచేసింది. తొలుత బౌలింగ్‌లో ప్రత్యర్థి భరతం పట్టిన భారత సారథి రాధా యాదవ్.. ఛేదనలోనూ విలువైన పరుగులు రాబట్టి జట్టును టైటిల్ ఫైట్‌కు చేర్చింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన లంక.. భారత బౌలింగ్ ధాటికి 19.4 ఓవర్లలో 118 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ సంజనా కావిండి (31) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో రాధ (3.4-0-19-4) నాలుగు, ప్రేమా రావత్ (2/9), తనూజా కన్వర్ (2/20) చెరో రెండు వికెట్లు పడగొట్టారు. స్వల్ప స్కోరు ఛేదనలో ఓపెనర్ దినేశ్ వ్రింద (42)కు తోడు రాధా యాదవ్ (31 నాటౌట్), అనుష్క శర్మ (27) సత్తా చాటడంతో భారత్ 13.3 ఓవర్లలోనే 119/5 స్కోరు చేసి గెలిచింది. లంక బౌలర్ షాషిని 2 వికెట్లు తీసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా రాధా యాదవ్ నిలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత మహిళలు టైటిల్ పోరులో తలపడతారు. మరో సెమీస్‌లో 54 రన్స్‌తో పాకిస్థాన్‌ను బంగ్లాదేశ్ ఓడించింది.



రాధా యాదవ్ (4/19, 31 నాటౌట్)

విజయంతో ఇంటికి

ఆఖరి మ్యాచ్‌లో ఒమన్‌ను చిత్తుచేసిన ఆసీస్

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌ను మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా అదిరే విజయంతో ముగించింది. పసికూన ఒమన్‌తో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' ఆఖరి మ్యాచ్‌లో ఆసీస్ 9 వికెట్ల తేడాతో నెగ్గింది. నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన కంగారూలు తమ గ్రూప్ నుంచి ఇప్పటికే సూపర్-8కు దూరమైన విషయం తెలిసిందే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 16.2 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. వసీం అలీ (32) టాప్ స్కోరర్. స్పిన్నర్ ఆడమ్ జంపా నాలుగు వికెట్లతో దెబ్బతీయగా.. మ్యాక్స్‌వెల్, బార్ట్‌లెట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో ఆసీస్ కేవలం 9.4 ఓవర్లలోనే 108/1 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 32) తొలి వికెట్‌కు 93 పరుగులు జోడించి వెనుదిరిగాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జంపా నిలిచాడు.



భార్యతో విడిపోయిన రాహుల్ చాహర్

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో శిఖర్ ధవన్, మహ్మద్ షమీ, యజ్వేంద్ర చాహల్, హార్దిక్ పాండ్యా వివాహబంధంలో ఇమడలేక భార్యలతో విడాకులు తీసుకున్నారు. వీరి జాబితాలో మరో క్రికెటర్ చేరాడు. 26 ఏళ్ల లెగ్ స్పిన్నర్ రాహుల్ చాహర్ తన భార్య ఇషానీ జోహర్‌తో విడిపోయాడు. ఇషానీతో తన బంధం ముగిసిందనీ, విడాకులు తీసుకున్నట్టు చాహర్ శుక్రవారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. ఫ్యాషన్ డిజైనర్ అయిన ఇషానీ, చాహర్ పెళ్లి 2022 మార్చిలో జరిగింది. క్రికెటర్ దీపక్ చాహర్ సోదరుడైన రాహుల్ చాహర్ టీమిండియా తరఫున ఓ వన్డే, ఆరు టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఐపీఎల్‌లో ఆడుతున్న రాహుల్‌ను ఈ ఏడాది వేలంలో రూ. 5.2 కోట్లకు చెన్నై సూపర్ కింగ్స్ దక్కించుకుంది.

పాక్ హాకీ కెప్టెన్‌పై నిషేధం ఎత్తివేత

కరాచీ: పాకిస్థాన్ హాకీ జట్టు కెప్టెన్ షకీల్ అమ్మాద్ భట్‌పై విధించిన నిషేధాన్ని ఆ దేశ ప్రభుత్వం ఎత్తివేసింది. అలాగే షకీల్ పట్ల పాక్ హాకీ సమాఖ్య (పీహెచ్‌ఎఫ్) మాజీ అధ్యక్షుడు తారిఖ్ బగ్టీ వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తచేసింది. ఇకనుంచి పాక్ హాకీకి ఎలాంటి నష్టం రాకుండా చూసుకుంటామని తెలిపింది. ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలో ఆటగాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలో పీహెచ్‌ఎఫ్ దారుణంగా విఫలమైందనీ, అక్కడ తాము ఓ దశలో అంట్లు కూడా తోమాల్సి వచ్చిందంటూ జట్టు కెప్టెన్ షకీల్ మీడియా ముందు వాపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పీహెచ్‌ఎఫ్ చీఫ్ పదవికి తారిఖ్ బగ్టీ గురువారం రాజీనామా చేశాడు. అయితే, తారిఖ్ పోతూపోతూ క్రమశిక్షణ చర్యల కింద షకీల్‌పై రెండేళ్లపాటు నిషేధం విధించాడు. దీనిపై తీవ్రంగా విమర్శలు రావడంతో షకీల్‌పై నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది.

ఏఎఫ్‌సీ ఆసియా కప్ జట్టులో సౌమ్య



న్యూఢిల్లీ: వచ్చేనెల ఆస్ట్రేలియాలో జరిగే ఏఎఫ్‌సీ మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. 26 మందితో కూడిన ఈ జట్టులో తెలంగాణ అమ్మాయి గుగులోత్ సౌమ్యకు చోటు దక్కింది. ఇక, గత ఆసియా కప్ (2022)లో పోటీపడ్డ జట్టులోని ఎనిమిది మందికి ఈసారి చోటు కల్పించారు. కొత్తగా ఆరుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను తీసుకున్నారు. ఇక, టోర్నీలో భాగంగా గ్రూప్-సిలోని భారత్ తన తొలి మ్యాచ్‌ను మార్చి 4న వియత్నాంతో ఆడనుంది. 7న జపాన్‌తో, 10న చైనీస్ తైపీతో పోటీపడనుంది. ఈ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్స్‌లో నెగ్గిన జట్లు వచ్చే ఏడాది బ్రెజిల్ జరిగే ఫిఫా వరల్డ్ కప్‌నకు నేరుగా అర్హత సాధిస్తాయి.

మనోళ్ల ఫీల్డింగ్ చెత్తగా ఉంది

మాజీ పేసర్ వరుణ్

న్యూఢిల్లీ: లీగ్ మ్యాచ్‌లన్నింటిలో గెలిచిన టీమిండియా టీ20 వరల్డ్ కప్ సూపర్-8కు దూసుకుపోయింది. భారత్ ఆట తీరుతో ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు. కానీ మనోళ్ల ఫీల్డింగ్ మాత్రం చెత్తగా ఉందని ఘాటుగా వ్యాఖ్యానించాడు మాజీ పేసర్ వరుణ్ ఆరోన్. 'గత 18 నెలలుగా భారత్‌కు ఫీల్డింగ్ పెద్ద సమస్యగా మారింది. జట్టు క్యాచింగ్ పర్సంటేజ్ 70 శాతానికంటే తక్కువగా ఉంది. ప్రతి మ్యాచ్‌లోనూ వారు కనీసం రెండు నుంచి మూడు క్యాచ్‌లు జారవిడుస్తున్నారు. సూపర్-8, సెమీఫైనల్లో అలా చేయరని ఆశిస్తున్నా' అని వరుణ్ అన్నాడు.



ఆస్ట్రేలియా X భారత్

మహిళల మూడో టీ20 నేడు

(మ. 1.45 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

భారత్‌కు ఊరట

55% ఎగుమతులకు మేలు..పెట్రో, స్మార్ట్‌ఫోన్లపై నో టారిఫ్‌లు

- రొయ్యల ఎగుమతులకు బూస్ట్
- వస్త్ర ఎగుమతుల్లో బంగ్లాతో పోటీ

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టివేయటంతో భారత్‌కు ఊరట లభించనుంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో దాదాపు 55 శాతం భారత ఎగుమతులపై ప్రస్తుతం ఉన్న 18 శాతం సుంకాల భారం 3 శాతానికి తగ్గుతుందని భావిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు భారత ఎగుమతులపై 50 శాతంగా ఉన్న సుంకాలను ట్రంప్ సర్కార్ ఇటీవలే 18 శాతానికి కుదించింది.

వస్త్ర, మత్స్య ఎగుమతులకు దన్ను

అమెరికా సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దాదాపు 55 శాతం భారత ఎగుమతులపై సుంకాల పోటు 3 శాతానికి తగ్గనుంది. మన దేశం నుంచి అమెరికాకు జరిగే ఎగుమతుల్లో విలువపరంగా దాదాపు 40 శాతం వాటా ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ఔషధాలు, పెట్రోలియం

800 కోట్ల డాలర్ల ఎగుమతులపై మాత్రం భారం

ఉత్పత్తులపైనా సుంకాల పోటు పూర్తిగా తగ్గనుంది. ఈ తీర్పుతో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి చేసే టెక్స్‌టైల్, రత్నాభరణాలు, తోలు ఉత్పత్తులు, మత్స్య ఎగుమతులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి జరిగే రొయ్యల ఎగుమతులకూ పెద్ద ఊరట లభించనుంది. అయితే దుస్తులు, వస్త్రాల ఎగుమతుల్లో చైనా, బంగ్లాదేశ్‌ల నుంచి మాత్రం గట్టి పోటీ ఎదురు కానుంది.

కొన్ని రంగాలకు నిరాశ

సుంకాల చెల్లవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, కొన్ని భారత ఎగుమతులపై మాత్రం సుంకాల పోటు తప్పదని తెలుస్తోంది. ముఖ్యంగా స్టీల్, అల్యూమినియం, ఆటోమొబైల్ విడిభాగాల దిగుమతులపై అమెరికా 25 నుంచి 50 శాతం సుంకాలు విధించనుంది. అమెరికా జాతీయ ప్రయోజనాలకు ముప్పు అనే పేరుతో ట్రంప్ కొన్ని రంగాలకు చెందిన వస్తువుల దిగుమతులపై ఈ సుంకాల భారం మోపారు. ప్రస్తుత తీర్పులో అమెరికా సుప్రీంకోర్టు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిధిలోకి వచ్చే భారత ఎగుమతులు దాదాపు 800 కోట్ల డాలర్ల వరకు ఉంటాయని పరిశ్రమల వర్గాల అంచనా. ఇటీవల కుదిరిన తాత్కాలిక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంతో అమెరికా మన ఎగుమతులపై విధించిన సుంకాలను 18 శాతానికి తగ్గించింది.

ప్రపంచ స్టాక్ మార్కెట్లకు జోష్

ట్రంప్ సుంకాలను రద్దు చేస్తున్నట్లు అమెరికా సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించిన వెంటనే యూఎస్ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లోంచి లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో ఎస్ అండ్ పీ 500 సూచీ 0.7 శాతం, నాస్‌డాక్ 1.2 శాతం, డౌజోన్స్ 0.60 శాతం పెరిగాయి. యూరప్ మార్కెట్లు సైతం లాభాల్లో ముగిశాయి. వచ్చే సోమవారం భారత స్టాక్ సూచీలూ భారీ లాభాలను నమోదు చేసే అవకాశాలున్నాయి. ఎందుకంటే, అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా శుక్రవారం రాత్రి సెషన్ (సాయంత్రం 4.35 గంటల నుంచి అర్ధరాత్రి 2.45 గంటల వరకు)లో గిఫ్ట్ నిఫ్టీ ఇంట్రాడే కనిష్ఠ స్థాయి నుంచి 400 పాయింట్ల మేర పుంజుకుంది. రాత్రి 12 గంటల సమయానికి సూచీ 246.50 పాయింట్ల (0.96 శాతం) లాభంతో 25,816 వద్ద ట్రేడైంది.



మనకు మేలే..

భారత్ సహా ప్రపంచంలోని పలు దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై భారత ఎగుమతిదారులు హర్షం వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాల బాధిత దేశీయ కంపెనీలకు భారీ ఊరట లభించనుందన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పంద బేరసారాల్లో భారత్‌కు మరింత పట్టు పెరగనుందన్నారు.

- తాజా తీర్పుతో అమెరికా భారత్‌పై విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలను తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత భారత్ నుంచి అమెరికాకు 55 శాతం ఎగుమతులకు 18 శాతం సుంకాల నుంచి కూడా మినహాయింపు లభించనుంది. **- అజయ్ శ్రీవాస్తవ, వ్యవస్థాపకులు, జీటీఆర్ఐ**
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని అంచనా వేయగలిగే సామర్థ్యాన్ని తాజా తీర్పు పునరుద్ధరిస్తుంది. అలాగే, ట్రంప్ విధించిన దేశ ఆధారిత సుంకాల నుంచి ఎగుమతిదారులకు భారీ ఊరట లభించనుంది. అయినప్పటికీ, సెక్షన్ 232 ప్రకారంగా స్టీల్, అల్యూమినియంపై విధించిన 50 శాతం, కొన్ని వాహన విడిభాగాలపై విధించిన 25 శాతం సుంకాలు మాత్రం కొనసాగనున్నాయి. **- ఎస్‌సీ రల్హాన్, ప్రెసిడెంట్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్**
- అమెరికా సుప్రీంకోర్టు తీర్పు భారత ఎగుమతిదారులకు ఊరటతోపాటు మన ఉత్పత్తుల పోటీతత్వాన్నీ పెంచనుంది. అలాగే, గడిచిన కొన్ని నెలల్లో ట్రంప్ ప్రభుత్వం వసూలు చేసిన సుంకాల రిఫండ్ క్లెయిమ్‌కూ అవకాశం లభించనుంది. **- మనోజ్ మిశ్రా, గ్రాంట్ థోర్నటన్ భారత్ భాగస్వామి**

బిజినెస్



టాటా పంచ్ ఈవీ కొత్త వెర్షన్

ముంబై: టాటా మోటార్స్.. ఎలక్ట్రిక్ కారు 'పంచ్' సరికొత్త వెర్షన్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.9.69 లక్షలు (ముంబై ఎక్స్‌షోరూమ్). కాగా బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ (బీఏఏఎస్) కింద ఈ కారు ప్రారంభ ధర రూ.6.49 లక్షలు ప్లస్ బ్యాటరీ ఈఎంఐ ప్రతి కిలోమీటరుకు రూ.2.6గా నిర్ణయించినట్లు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ విభాగం ఎండీ, సీఈఓ శైలేశ్ చంద్ర చెప్పారు. మరిన్ని మెరుగులు దిద్దిన ఈ కొత్త పంచ్ కారు 40 కిలోవాట్ల ఎల్‌ఎఫ్‌పీ ప్రిస్మాటిక్ సెల్ బ్యాటరీతో లభిస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 355 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.

భారత్‌కు నోవార్టిస్ గుడ్‌బై

- 70% వాటా క్రిస్ క్యాపిటల్‌కు విక్రయం
- డీల్ విలువ రూ.1,446 కోట్లు

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే బహుళ జాతి ఔషధ సంస్థ నోవార్టిస్ ఏజీ.. భారత్‌కు గుడ్‌బై చెబుతోంది. నోవార్టిస్ ఇండియా లిమిటెడ్‌లో తనకు ఉన్న 70.68 శాతం వాటాను ప్రైవేట్ ఈక్విటీ సంస్థ క్రిస్ క్యాపిటల్‌కు రూ.1,446 కోట్లకు విక్రయించింది. దీనికి సంబంధించిన ఒప్పందంపై శుక్రవారం సంతకాలు జరిగినట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఈ అమ్మకం ఈ ఏడాది మూడో త్రైమాసికానికల్లా పూర్తవుతుందని పేర్కొంది. దీంతో క్రిస్‌క్యాపిటల్..నోవార్టిస్ ఇండియా ఈక్విటీలో వాటాదారుల వద్ద ఉన్న షేర్ల నుంచి 26 శాతం వాటా కోసం త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది.



ఈ-కామర్స్ డిస్కౌంట్ పోర్టల్ హాఫ్‌పే.కామ్.. ఎకనామిక్ టైమ్స్ ఎమర్జింగ్ డీ2సీ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకుంది. ముంబైలో జరిగిన ఈటీ గ్రేట్ ఇండియా రిటైల్ సమ్మిట్‌లో హాఫ్‌పే సహ వ్యవస్థాపకులు తిరుమల రావు చామల్ల ఈ అవార్డును అందుకున్నారు. ప్రతి వస్తువుపై 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ డిస్కౌంట్‌ను అందిస్తున్న హాఫ్‌పే వ్యాపార మోడల్‌ను జ్యూరీ ప్రత్యేకంగా ప్రశంసించింది. అంతేకాకుండా వినియోగదారులు ఈ విధానానికి ఎంతగానో ఆకర్షితులవుతారని తెలిపింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన వేణు సోమినేని, తిరుమల రావు ఈ హాఫ్‌పే.డాట్‌కామ్‌ను ప్రారంభించారు.

హైదరాబాద్‌లో రూ.2,000 కోట్ల పెట్టుబడులు

వరల్డ్ ట్రేడ్ సెంటర్, హోటల్ ఏర్పాటు : బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్.. హైదరాబాద్‌లో పెద్దఎత్తున కార్యకలాపాలు విస్తరిస్తోంది. ఇప్పటికే రెండు ప్రాజెక్టులను పూర్తి చేసిన సంస్థ తాజాగా మరో 4 ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు రెడీ అవుతోంది. ఇందుకోసం రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ మైసూర్ తెలిపారు. ప్రతిపాదిత పెట్టుబడులతో మొత్తం 35 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. నియోపోలిస్‌లో బ్రిగేడ్ గేట్‌వే పేరుతో అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులో వరల్డ్ ట్రేడ్ సెంటర్, ఇంటర్ కాంటినెంటల్ హోటల్ సహా మాల్స్, రెసిడెన్షియల్ ఫ్లాట్స్‌ను నిర్మిస్తున్నట్లు అమర్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ 2029 నాటికి అందుబాటులోకి వస్తుందని అమర్ వెల్లడించారు. అలాగే సనత్ నగర్‌లో మరో రెండు రెసిడెన్షియల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కాగా హైదరాబాద్‌లో తొలిసారిగా ఈ నెల 21-22 తేదీల్లో బ్రిగేడ్ షోకేస్ పేరుతో ప్రాపర్టీ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మళ్లీ లాభాల్లోకి మార్కెట్లు

ముంబై: శుక్రవారం వారాంతపు ట్రేడింగ్ రోజున మార్కెట్ పునరుజ్జీవం సాధించింది. వాణిజ్య ఒప్పందం పురోగతికి సంబంధించి ఆశావహ సంకేతాలతో పాటు పాక్స్ సిలికాలో భారత్ భాగస్వామి అవుతోందన్న వార్తలు మార్కెట్లో ఉత్తేజం నింపాయి. బ్యాంకింగ్, మెటల్ షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతు కూడా ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఒక దశలో 633.94 పాయింట్ల మేరకు లాభపడి ఇంట్రాడేలో 83,132.08 స్థాయిని తాకినా చివరికి ఆ లాభాన్ని 316.57 పాయింట్లకు కుదించుకుని 82,814.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 116.90 పాయింట్ల లాభంతో 25,571.25 వద్ద పాజిటివ్ ధోరణిలో క్లోజయింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 187.95 పాయింట్లు, నిఫ్టీ 100.15 పాయింట్లు లాభపడ్డాయి. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.1,89,341.06 కోట్లు పెరిగి రూ.4,67,11,355.63 కోట్లకు (5.14 లక్షల కోట్లు) చేరింది.

ఎవర్‌గ్రీన్ హెల్త్‌కేర్‌తో మెడికవర్ జట్టు

ఎయిర్ అంబులెన్స్ సేవల్లో సహకారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెడికవర్ హాస్పిటల్స్.. ఎవర్‌గ్రీన్ హెల్త్‌కేర్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రెండు సంస్థలు.. మెడికవర్ త్వరలో ప్రారంభించే ఎయిర్ అంబులెన్స్ సేవల విషయంలో సహకరించుకుంటాయి. ఈ సహకారం కింద అత్యవసర పరిస్థితుల్లో అధునాతన వైద్యసేవలు అవసరమైన రోగులను దేశవిదేశాల్లోని ఆస్పత్రులకు తరలిస్తారు. ఇది క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు యుద్ధ ప్రాతిపదికన ఎయిర్ అంబులెన్స్‌లో వైద్య సేవలు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు తరలించవచ్చు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	530
వరంగల్	497	గోదావరి	490
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	112
కర్నూలు	115	నెల్లూరు	117
విశాఖపట్నం	115	అనంతపురం	117
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,56,170 ▼	1,43,150 ▼	2,70,000 ▲
విజయవాడ	1,59,000 ▲	1,45,000 ▼	2,50,000 ▲
విశాఖపట్నం	1,59,549 ▲	1,43,150 ▲	2,70,000 ▲
రాజమండ్రి	1,57,360 ▲	1,44,250 ▲	2,45,000 ▼
ప్రొద్దుటూరు	1,54,100 ▼	1,41,770 ▼	2,53,500 ▼
ముంబై	1,55,066 ▲	1,42,040 ▲	2,50,314 ▲

గొర్రెల కాపరి సీఎం అయ్యాడని

పట్టభద్రుల కళ్లు ఎర్రబడ్డాయి!



» ఫేస్‌బుక్‌లో సిద్దరామయ్య 9పోస్టులు

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'గొర్రెల కాపరి ముఖ్యమంత్రి అయ్యాడని పట్టభద్రుల కళ్లు ఎర్రబడ్డాయి' అని కర్ణాటక సీఎం సిద్దరాయ్య ఫేస్‌బుక్ ఖాతాలో శుక్రవారం పోస్టులు పెట్టారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై చర్చలు సాగుతున్న తరుణంలో ఆయన పెట్టిన పోస్టు కలకలం రేపుతోంది. 'గొర్రెలు కాసేవారు సీఎం అయిపోయారు. ఆర్థిక నిపుణులతో సమానంగా నిలబడి వరుసగా బడ్జెట్‌లు ప్రవేశపెట్టి ప్రశంసలు పొందుతున్నారనే అసహనం. ద్వేషం, అసూయతో వారి కళ్లు మండుతున్నాయి' అని పేర్కొన్నారు. ఎవరి పేరూ ప్రస్తావించకుండా సిద్దరామయ్య ఇలా ఒకేరోజు ఏకంగా 9పోస్టులు పెట్టారు. సామాజిక న్యాయం కోసం తుదిశ్వాస వరకు పోరాడతానన్నారు.

33 మంది బాలురపై అత్యాచారం చేసిన దంపతులకు మరణశిక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: మైనర్ బాలురపై అత్యాచారాలకు పాల్పడి, ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ జంటకు ఉత్తరప్రదేశ్‌లోని బాందాలో ఉన్న ప్రత్యేక కోర్టు శుక్రవారం మరణ శిక్ష విధించింది. నీటి పారుదల శాఖలో జూనియర్ ఇంజినీరుగా పనిచేసిన రామ్‌భావన్, అతడి భార్య దుర్గావతికి ఈ శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. 2010-2020 మధ్య పలు జిల్లాల్లో 33 మంది బాలురపై వీరు అత్యాచారం చేసినట్టు రుజువయింది. బాధితుల్లో మూడేళ్ల బాబు కూడా ఉన్నాడు.

పీఎస్‌ఎల్వీ-సీ62 వైఫల్యంపై విశ్లేషణ కమిటీ

» కె.విజయరాఘవన్ అధ్యక్షతన కేంద్రం ఏర్పాటు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పీఎస్‌ఎల్వీ-సీ 62 రాకెట్ ప్రయోగ విఫలంపై కేంద్ర ప్రభుత్వం విశ్లేషణ కమిటీని నియమించింది. ఈ ఏడాది జనవరి 12న శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించిన ఈ రాకెట్ సాలిడ్ మోటారులో సాంకేతిక లోపం తలెత్తి ప్రయోగం విఫలమైన విషయం తెలిసిందే. గత ఏడాది మే 18న పీఎస్‌ఎల్వీ-సీ61 ప్రయోగం కూడా మూడో దశలో సాంకేతిక సమస్యతో విఫలమైంది. దీన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. పీఎం మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కె.విజయరాఘవన్ అధ్యక్షతన మాజీ ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ సహాధ్యక్షుడిగా విశ్లేషణ కమిటీని నియమించింది. దీంతో షార్ సెంటర్‌తో పాటు తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ సెంటర్‌కు వెళ్లి ప్రయోగ వైఫల్యానికి కారణాలను సభ్యులు పరిశీలించారు.

27 నుంచి ఇస్రో 'యువికా' రిజిస్ట్రేషన్లు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం 'యువికా-2026' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. మార్చి 31 వరకు అవకాశం ఉంటుందని, 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని ఇస్రో ఓ ప్రకటనలో వెల్లడించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించేందుకు ఇస్రో ఏటా 'యువికా' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్‌లపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించనున్నారు. మేలో రెండు వారాల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో పాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్రన్ స్పేస్ అప్లికేషన్ సెంటర్లలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సునీతా విలియమ్స్ రోదసి యాత్ర..

ప్రాణాంతక వైఫల్యమే!



అంగీకరించిన నాసా.. నివేదిక విడుదల

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: రెండేళ్ల క్రితం సునీతా విలియమ్స్, విల్మోర్ ప్రయాణించిన వ్యోమనౌక స్టార్‌లైనర్ అత్యంత తీవ్రమైన సాంకేతిక వైఫల్యాలకు లోనైందని నాసా తాజాగా ప్రకటించింది. ఆ ఘటనను టైప్-ఏ ప్రమాదంగా వర్గీకరించింది. 2003లో భారత మూలాలున్న కల్పనాచావ్లాతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములను బలిగొన్న కొలంబియా ప్రమాదం కూడా టైప్-ఏ ఘటనే గమనార్హం. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకోవటానికి 2024 జూన్ 5వ తేదీన స్టార్‌లైనర్‌లో సునీత, విల్మోర్ బయల్దేరిన విషయం తెలిసిందే. అక్కడ 8-14 రోజులు ఉండి తిరిగి భూమి మీదకు రావాల్సిన వారి ప్రయాణ షెడ్యూల్.. స్టార్‌లైనర్‌లో సాంకేతిక లోపాల వల్ల దాదాపు ఏడాది వాయిదా పడింది. అంతర్జాతీయంగా ఆసక్తి రేకెత్తించిన ఈ ఘటనపై గురువారం నాసా 311 పేజీల నివేదికను విడుదల చేసింది. స్టార్‌లైనర్ నింగిలోకి దూసుకెళ్లిన వెంటనే దానిని ముందుకు నడిపించే ప్రొపల్షన్ వ్యవస్థలో సమస్యలు మొదలయ్యాయని పేర్కొంది. ఐఎస్ఎస్‌కు వ్యోమనౌక చేరుకునే సమయానికి ఐదు థ్రస్టర్లు లేదా మినీ ఇంజిన్లు పని చేయటం నిలిచిపోయాయని, హీలియం లీకేజీ మొదలైందని వెల్లడించింది. ఏదో రకంగా వ్యోమనౌకను ఐఎస్ఎస్‌తో అనుసంధానించగలిగినా, స్టార్‌లైనర్ మరమ్మతులకు చాలా సమయం పట్టిందని తెలిపింది. మొత్తమ్మీద, తిరుగు ప్రయాణానికి స్టార్‌లైనర్ సిద్ధమైనా, వ్యోమగాముల ప్రాణాలను రిస్క్‌లో పెట్టకుండా.. ఆ వ్యోమనౌకను ఖాళీగానే 2024 సెప్టెంబరులో భూమి మీదకు సురక్షితంగా తీసుకువచ్చారు. ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చిన సునీత, విల్మోర్ల తిరుగు ప్రయాణం 2025 మార్చిలోగానీ సాధ్యపడలేదు. స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌకలో వారిని తిరిగి తీసుకొచ్చారు. కాగా, స్టార్‌లైనర్ వైఫల్యంతో 20 కోట్ల డాలర్ల (రూ.1820 కోట్ల) నష్టం వాటిల్లిందని నాసా నివేదిక వెల్లడించింది. స్టార్‌లైనర్‌ను రూపొందించిన కంపెనీ బోయింగ్‌ను నాసా తీవ్రంగా ఆక్షేపించింది. షెడ్యూల్‌లోగా ప్రయోగం జరగాలన్న అంశానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, రక్షణ నిబంధనల్ని గాలికి వదిలేసిందని విమర్శించింది.

గ్రహాంతరవాసుల సమాచారం

బహిర్గతం చేస్తాం: ట్రంప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: గ్రహాంతరవాసుల(ఏలియన్స్) ఉనికిపై త్వరలో తాజా సమాచారం అందుబాటులోకి రానుంది. గ్రహాంతర జీవులు, అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్(యూఎఫ్‌వో)లకు సంబంధించి అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న ఫైళ్లను విడుదల చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారు. గ్రహాంతరవాసుల ఉనికిపై గతవారం ఒక పాడ్‌కాస్ట్‌లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వ్యాఖ్యలు చేయడాన్ని గురువారం ట్రంప్ విమర్శించారు. ఒక రహస్య సమాచారాన్ని వెల్లడించి ఒబామా పెద్ద తప్పు చేశారని, ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. గ్రహాంతరవాసుల ఉనికిపై తనకు ఎలాంటి అభిప్రాయం లేదని స్పష్టం చేశారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే ఫైళ్ల విడుదలపై ట్రంప్ ప్రకటన చేశారు. పాడ్‌కాస్ట్‌లో ఒబామా మాట్లాడుతూ, "గ్రహాంతరవాసులు ఉన్నమాట నిజమే. అయితే వారిని నేను చూడలేదు. ఏరియా 51లో వారిని ప్రభుత్వం నిర్బంధించిందనడంలో నిజం లేదు. అక్కడ ఎలాంటి భూగర్భ కేంద్రాలు లేవు' అని పేర్కొన్నారు. ఆ తర్వాత తాను చేసిన వ్యాఖ్యలను ఆయన సోషల్ మీడియాలో సమర్థించుకున్నారు. "ఈ విశ్వం చాలా విశాలమైనది. ఇతర గ్రహాల్లో జీవం ఉండే అవకాశాలు ఉన్నాయి. కానీ సౌర వ్యవస్థల మధ్య దూరాలు బాగా ఎక్కువ కావడంతో ఏలియన్లు మనల్ని సందర్శించే అవకాశాలు తక్కువ. గ్రహాంతరవాసులు మాతో సంబంధాలు కలిగి ఉన్నారని చెప్పడానికి నేను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎలాంటి ఆధారాలు లభించలేదు" అని ఒబామా వివరించారు.

దానగుణ సంపన్నులు

భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశంలో సంపన్నులేనా?...లేదంటే సామాన్యులు, సాధారణ గృహస్థులు కూడా దానధర్మాలు చేస్తున్నారా? ఎందుకు చేయడం లేదు? ఏటా రూ.54వేల కోట్ల మేర దానం చేస్తున్నారు. ఇందులో 45.9 శాతం మత సంస్థలకు అందిస్తుంటే 41.8 శాతం బిచ్చగాళ్లకు ఇస్తున్నారు. నెలకు కేవలం నాలుగయిదు వేల రూపాయలు ఖర్చు పెట్టగలిగే వారు కూడా తమకు ఉన్నదాంట్లో ఎంతో కొంత దానం చేస్తున్నారు. అందువల్లనే ప్రపంచంలోనే దాణగుణం ఉన్న ప్రజలుగా భారతీయులు గుర్తింపు పొందారు. 'భారత దేశం ఎలా ఇస్తోంది..' పేరుతో అశోకా విశ్వవిద్యాలయం పరిధిలోని సీఎస్ఐపీ అనే విభాగం నిర్వహించిన మూడో విడత సర్వేలో ఈ విషయం వెల్లడయింది. శ్రమదానం, స్వచ్ఛంద సేవల ద్వారా తమ వంతు సాయం చేస్తామని 30% మంది చెప్పడం గమనార్హం. వ్యక్తిగతంగా కలిసి మాట్లాడడం వల్లనే ఎక్కువ విరాళాలు వస్తున్నాయి. 25% ఈ రూపంలోనే వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో సమాచారం పెడుతుంటే 15% వస్తున్నాయి.

డేటా సెంటర్లపై త్వరలో ఆర్థిక సర్వే

» రాష్ట్రంలో ఎక్సలెన్స్ సెంటర్ పెట్టాలి

» ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు ప్రసన్నకుమార్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'దేశంలో కొత్తగా ఏర్పాటవుతున్న డేటా సెంటర్లతో ఆర్థిక పురోగతి ఎలా ఉంటుంది? ఎంతవరకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి? అనే అంశాలపై త్వరలో ఆర్థిక సర్వే నిర్వహించనున్నాం' అని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) జాతీయ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన ఆయన 2026-27 సంవత్సరానికి జాతీయ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను వాల్తేరు క్లబ్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రభుత్వం ఏ కొత్త చట్టాలు చేసినా, వాటిని సరళీకృతం చేసి ప్రజలకు చేరువగా తీసుకువెళ్లేది సీఏలే. కృత్రిమ మేధ అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న మాట వాస్తవమే అయినా అకౌంటెంట్లకు నష్టం లేదు. అయితే ఆధునిక సాంకేతికతను ప్రతి రంగంలోను ఉపయోగించుకోక తప్పదు. మేం ఇప్పటికే ఏఐ టూల్స్ వినియోగిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అది ప్రభుత్వ పాలసీపై ఆధారపడి ఉంటుంది. సీఏ చేస్తే ఉపాధికి ఢోకా లేదు. త్వరలో యువతకు ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం' అని ప్రసన్నకుమార్ తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా

వినోద్ జాఖడ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ నూతన అధ్యక్షుడిగా రాజస్థాన్‌కు చెందిన వినోద్ జాఖడ్ నియమితులయ్యారు. ఏఐసీసీ) శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటివరకు ఎన్ఎస్‌యూఐ చీఫ్‌గా సేవలందించిన వరుణ్ చౌదరి కృషిని ఏఐసీసీ అభినందించింది.

బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ విడుదల

» 11 గంటలపాటు పోలీస్ కస్టడీలో

లండన్, ఫిబ్రవరి 20: బ్రిటన్ రాజు చార్లెస్-3 సోదరుడు ఆండ్రూ మౌంట్‌బాటన్ విండ్సర్‌ను పోలీసులు విడుదల చేశారు. అమెరికా లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు బ్రిటన్ రహస్య పత్రాలను చేరవేయటంతోపాటు తన కార్యాలయాన్ని అసాంఘిక వ్యవహారాలకోసం వినియోగించుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలపై ఆండ్రూను థేమ్స్‌వ్యాలీ పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేశారు. 11 గంటలపాటు తమ అదుపులో ఉంచుకుని సాయంత్రం విడుదల చేశారు. ఆండ్రూపై దర్యాప్తు కొనసాగుతుందని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, ఎప్‌స్టీన్, ఆండ్రూ దారుణాలపై బ్రిటన్ మీడియా రోజుకో కొత్త సంచలనాన్ని బయటపెడుతోంది. బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజీలో ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయసున్న బాలికను ఎప్‌స్టీన్ బంధించి ఎలక్ట్రిక్ షాక్ ఇస్తుంటే ఆండ్రూ పక్కనే ఉన్నాడని తాజాగా బయటపెట్టింది.

టాప్ 500 బిట్‌శాట్ ర్యాంకర్లకు

ట్యూషన్ ఫీజు మాఫీ

» బిట్స్ పిలానీ చరిత్రాత్మక నిర్ణయం

బిట్స్ పిలానీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు ఆర్థిక అడ్డంకులు ఉండకూడదనే సంకల్పంతో బిట్స్ పిలానీ కీలక నిర్ణయం తీసుకుంది. 2026- 27 విద్యా సంవత్సరం నుంచి బిట్‌శాట్‌లో టాప్ 500 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పూర్తి ట్యూషన్ ఫీజును మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.20 లక్షల వరకు ఉన్న అర్హులైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు పూర్తి ట్యూషన్ ఫీజును సంస్థ భరిస్తుంది. అయితే, సంబంధిత క్యాంపస్‌లో కనీసం 7.5 సీజీపీఏ కొనసాగించడం తప్పనిసరి. అడ్మిషన్ ఆఫర్‌లోనే ఇది హామీగా ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఈ విధానాన్ని దశలవారీగా విస్తరించి, అన్ని అడ్మిషన్లకూ ట్యూషన్- బ్లైండ్ విధానం అమలు చేయాలన్నదే లక్ష్యమని సంస్థ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి. రామ్‌గోపాల్ రావు వెల్లడించారు. భవిష్యత్తులో ప్రతి అడ్మిషన్ కూడా ట్యూషన్- బ్లైండ్‌గా మార్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు



సుహాస్, శివానీ నగరం జంటగా గోపీ అచ్చర తెరకెక్కించిన 'హే బల్వంత్' చిత్రం శుక్రవారం విడుదలైన సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. నిర్మాత నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ 'ప్రేక్షకులు మంచి సినిమా అని ప్రశంసిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ 'అన్ని ప్రాంతాల నుంచి సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది' అని తెలిపారు. దర్శకుడు గోపి మాట్లాడుతూ 'నవ్వీ నవ్వీ రిలాక్స్ అవుతున్నాం అని ప్రేక్షకులు అంటున్నారు' అని పేర్కొన్నారు.


నలభై ఆరేళ్ల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో



దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. భారతీయ చలన చిత్ర చరిత్రలో అత్యంత అరుదైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. ఇద్దరు అగ్రశ్రేణి దిగ్గజాలు... సూపర్‌స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ నాలుగు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఒకే సినిమాలో కలసి నటించబోతున్నారు. గత కొన్నాళ్లుగా వీరిద్దరి కాంబినేషన్‌పై వస్తున్న వార్తలకు ముగింపు పలుకుతూ రెడ్ జెయింట్ సంస్థ దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇచ్చింది. ప్రత్యేక పోస్టర్‌తో ఈ భారీ కలయికను ధ్రువీకరించింది. ఈ పోస్టర్‌లో ఇద్దరు స్టార్ల ముఖాలను చూపించకుండా, కేవలం వారి చేతులను మాత్రమే చూపించారు. రజనీకాంత్ గుర్తుగా ఒక చేతికి బంగారు కడియం, కమల్‌హాసన్ గుర్తుగా మరో చేతికి ఉంగరం ఉన్నాయి. 'కొందరు శాసిస్తారు, కొందరు పాలిస్తారు' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ ప్రకటన అభిమానుల్లో అంచనాలను పెంచింది. 'కేహెచ్Xఆర్‌కే' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి దర్శకుడిగా తొలుత లోకేశ్ కనగరాజ్ పేరు వినిపించినప్పటికీ తాజా సమాచారం ప్రకారం 'జైలర్' ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్ట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రజనీ, కమల్‌పై ఒక రెట్రో స్టైల్ ప్రోమో షూట్ చేశారు. దీన్ని నేడు విడుదల చేయనున్నారు. 80ల నాటి గెటప్స్‌లో వారిద్దరూ ఎలా ఉండబోతున్నారో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 1979లో వచ్చిన 'నినైతలే ఇనిక్కుమ్' (అందమైన అనుభవం) చిత్రంలో కమల్, రజనీ చివరిసారి కలసి నటించారు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో అతిథి పాత్రల్లో కనిపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చనున్నారు.



విరోధంతో బతకలేవు.. పట్టుదల వదిలేయ్!




అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కన్నడ స్టార్ యశ్ కథానాయకుడిగా నటించిన 'టాక్సిక్' టీజర్ వచ్చేసింది. పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో టీజర్ ఆద్యంతం ఆసక్తిని కలిగించింది. 'యుద్ధం వేరు..వాళ్ల కుతంత్రాలు వేరు..అందరితో విరోధం పెట్టుకొని బతకలేవు..పట్టుదల వదిలేయ్..' అంటూ పవర్‌ఫుల్ డైలాగులతో టీజర్ ఆరంభమవుతుంది. మొత్తంగా ఇది ఓ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ అని టీజర్‌ని చూస్తే అర్థమవుతోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై కె.వెంకటనారాయణ, యశ్ నిర్మిస్తున్నారు. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

'కాక్ టైల్ 2'లో రష్మిక పాత్ర అదేనా?!



ముగ్గురు పాపులర్ స్టార్స్ రష్మిక మందన్న, కృతి సనన్, షాహిద్ కపూర్ నటిస్తున్న 'కాక్‌టైల్ 2' చిత్రం షూటింగ్ పూర్తయింది. దీపిక, డయనా, సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రలు పోషించగా మోడరన్ రిలేషన్ షిప్, ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా వచ్చిన 'కాక్‌టైల్ '(2012) చిత్రానికి సీక్వెల్‌గా రూపుదిద్దుకున్న 'కాక్‌టైల్ 2' కథాంశం ఏమిటన్నది దర్శకుడు హోమీ అదజానియా వెల్లడించకపోయినప్పటికీ ఈ సినిమా గురించి ఇప్పుడు ప్రచారంలో ఉన్న వార్త అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. అదేమిటంటే ఈ సినిమాలో రశ్మిక, కృతి స్వలింగ సంపర్క జంటగా నటిస్తున్నారట. 'కాక్ టైల్ 2 సినిమా కథ ఇదేనని బీ టౌన్ వర్గాలు పేర్కొంటున్నాయి. సినిమా చాలా ప్రత్యేకంగా ఉంటుందని మాత్రం దర్శకుడు హోమీ అదజానియా చెబుతున్నారు.

ఉత్కంఠభరితంగా



శశాంక్ దర్శకత్వంలో ప్రమోద్ కులకర్ణి నిర్మిస్తున్న హారర్ థ్రిల్లర్ 'మా ఊరి బావి'. మహేశ్ మంజ్రేకర్, గోర్ధన్ సింగ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. గోర్ధన్ సింగ్ మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధ పరిశోధనాత్మక కథనంతో రూపొందుతోన్న చిత్రమిది. నా పాత్ర విలక్షణంగా ఉండబోతోంది' అని చెప్పారు. 'ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెక్కిస్తున్న చిత్రమిది' అని దర్శకుడు చెప్పారు.

ఆసక్తికరమైన టైటిల్‌తో



ఆసక్తికరమైన టైటిల్‌తో రూపొందుతున్న ముక్కోణపు ప్రేమకథా చిత్రం 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి'. పవన్ మహావీర్‌ను హీరోగా పరిచయం చేస్తూ, జి. శైలజా రెడ్డి నిర్మిస్తున్నారు. శివాల ప్రభాకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సాయికార్తీక్ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందిస్తున్నాం. ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది' అని చెప్పారు. 'మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. ప్రతి పాత్రకు ప్రత్యేకత ఉంటుంది' అని నిర్మాత అన్నారు.

ఇండియాలో

షకీరా షో



గ్లోబల్ పాప్ ఐకాన్ 'వాకా వాకా' ఫేమ్ షకీరా భారతీయ అభిమానులకు తీపి కబురు అందించారు. ఈ ఏడాది ఆమె తన గ్రాండ్ ఇండియా టూర్‌ను నిర్వహించబోతున్నారు. జొమాటో 'ఫీడింగ్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా ముంబై, ఢిల్లీ నగరాల్లో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. దీంతో చాలాకాలంగా షకీరా లైవ్ షో కోసం ఎదురుచూస్తున్న భారతీయ సంగీత ప్రియుల నిరీక్షణకు తెరపడింది.


షకీరా చివరిసారి 2007లో ఉదయ్‌పూర్‌లో ఒక ప్రైవేట్ వేడుకలో ప్రదర్శన ఇచ్చారు. పాప్ లాటిన్, రాక్ సంగీత సమ్మేళనంగా షకీరా ఇచ్చే సంగీత ప్రదర్శన చూడడానికి అభిమానులు ఎదురుచూస్తున్నారు. మేలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జొమాటో యాప్‌లోని డిస్ట్రిక్ సెక్షన్ ద్వారా టికెట్లు అందుబాటులో ఉంటాయి. మార్చి మొదటి వారం నుంచి ముందస్తు బుకింగ్స్ ప్రారంభమవుతాయి. పూర్తి షెడ్యూల్, టికెట్ ధరల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ ప్రదర్శన ద్వారా సేకరించిన నిధులను భారతదేశంలోని అన్నార్తుల కోసం నిర్వహించనున్న సేవా కార్యక్రమాలకు వెచ్చించనున్నారు.

యువతకు నచ్చింది



'ప్రేమలో బ్రేకప్ తర్వాత టీనేజర్లు ఎలా బాధపడుతున్నారు, డిప్రెషన్‌కు లోనవుతున్నారు, ఆ బాధ నుంచి ఎలా బయటపడుతున్నారు అనే అంశాలను మా సినిమాలో ఆసక్తికరంగా చూపించాం. విజయం సాధిస్తుందనే నా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు నిర్మాత జవ్వాజి రామాంజనేయులు. అజయ్ దిషన్, ధనుషా జంటగా నటించిన 'బూకి' శుక్రవారం విడుదలై ప్రేక్షకాదరణ పొందుతోంది. తమిళ నటుడు విజయ్ ఆంటోనీ సమర్పణలో ఈ చిత్రాన్ని నిర్మించిన జవ్వాజి రామాంజనేయులు మాట్లాడుతూ 'ప్రతి ప్రేమకథా చిత్రం ప్రేమతో మొదలవుతుంది. కానీ మా సినిమా బ్రేకప్‌తో మొదలవుతుంది. ఈ కొత్త అంశం ప్రేక్షకులకు నచ్చింది. ఇప్పటి జనరేషన్ ఎంత స్పీడ్‌గా ప్రేమలో పడుతున్నారో అంతే స్పీడ్‌గా విడిపోతున్నారు. అది గమనించి వారిని సరైన ట్రాక్‌లోకి ఎలా తీసుకురావాలో చూపించాం. అది జనానికి నచ్చింది. అలాగే సునీల్ పోషించిన పాత్రను ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని చెప్పారు.

పనిలేని ప్రపంచం!



ఏఐ వ్యవస్థలు, రోబోలతో భవిష్యత్తులో 90% ఉద్యోగాలు, ఉపాధికి కోత!

(సెంట్రల్ డెస్క్)

సాఫ్ట్‌వేర్ కోడ్‌లు రాసేస్తోంది.. పాటలు పాడేస్తోంది.. చెప్పినట్టుగా వీడియోలు సృష్టిస్తోంది.. కోరినట్టుగా ఫొటోలనూ మార్చి ఇచ్చేస్తోంది.. మన సందేహాలకు సమాధానాలూ ఇస్తోంది.. జస్ట్ ఇప్పుడే మొదలైంది.. మానవ జీవితంలో కొన్ని వేల ఏళ్లుగా వచ్చిన మార్పులు ఒక ఎత్తయితే.. కృత్రిమ మేధ (ఏఐ)తో రాబోతున్న జరగబోతున్న మార్పులు అంతకుమించి ఉండబోతున్నాయని కృత్రిమ మేధ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇన్నాళ్లూ కొత్త ఆవిష్కరణలు వచ్చినప్పుడల్లా మనుషుల ఉద్యోగాల్లో, ఉపాధి తీరులో మార్పులు జరుగుతూ వస్తే... ఏఐ యుగంలో మాత్రం 90శాతం జనాభాకు అసలు ఉద్యోగాలు, ఉపాధి అనేదే లేకుండా పోతుందని కృత్రిమ మేధ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ప్రజలకు రోజువారీ వ్యక్తిగత పనులు, నచ్చిన వ్యాపకాలు తప్ప మరేమీ ఉండవనీ అంటున్నారు. ఏ సంపాదనా లేకపోతే బతికేదెలా!? ఖర్చులకు డబ్బులు ఎలాగన్న సందేహాలు వస్తున్నాయి కదా!! దానికీ కొన్ని సూచనలు చేస్తున్నారు.

ఏఐకి రోబోలూ జతకలిస్తే..

రోజురోజుకు ఏఐ సామర్థ్యం మరింతగా పెరుగుతోంది. ఇప్పటికే చాలా వరకు ఆన్‌లైన్/కంప్యూటర్ ఆధారిత పనులన్నీ ఏఐ చేసేస్తోంది. పిల్లలకు హోంవర్క్‌లు చేసిపెట్టడం, వ్యాసాలు రాసిపెట్టడం నుంచి రోగుల వైద్య నివేదికలను విశ్లేషించి సమస్యను గుర్తించడం దాకా ఏఐ వినియోగం విస్తృతమైంది. చెప్పిన సూచనలకు అనుగుణంగా ఫొటోలు, వీడియోలు సిద్ధం చేసే చాట్‌జీపీటీ, గ్రోక్, గూగుల్ జెమినీ.. కావాల్సినట్టుగా పాటలు రూపొందించి పెట్టే 'సునో' యాప్.. ఇలా ఎన్నో వచ్చేశాయి. ఇక ఏఐకి రోబోలు జతకలిస్తే.. మనుషులు చేసే దాదాపు అన్ని పనులూ అవే చేస్తాయి. ఇప్పటికే రిసెప్షనిస్టులుగా, చాట్‌బోట్‌ల రూపంలో టెలీకాలర్లుగా, ఆటోమేటిక్ కార్ల డ్రైవర్లుగా, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సైట్ల గోదాముల్లో సరుకులను సర్ది, ఆర్డర్లకు తగినట్టుగా తీసి ప్యాకింగ్‌కు సిద్ధం చేసే సిబ్బందిగా ఏఐ రోబోలు పనిచేస్తున్నాయి. కార్ల కంపెనీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ సంస్థలు తమ ఫ్యాక్టరీలలో రోబోలను వినియోగిస్తున్నాయి. మొత్తంగా భవిష్యత్తులో అత్యంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు పోవడం ఖాయమని 'గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ'గా గుర్తింపు పొందిన శాస్త్రవేత్త జెఫరీ హింటన్ స్పష్టం చేశారు.

సామాజిక, ఆర్థిక వ్యవస్థలన్నీ తలకిందులు!

భవిష్యత్తులో వ్యవసాయం నుంచి అంతరిక్షం దాకా అన్ని పనులూ ఏఐ రోబోలతో చేసేస్తుందని, దీనితో మానవ సామాజిక, ఆర్థిక వ్యవస్థలు సమూలంగా మారిపోతాయన్నది నిపుణులు చెబుతున్న మాట. మనుషుల్లో ఇప్పుడున్న ధనిక, మధ్యతరగతి, పేదలు వంటి వర్గాలు మారిపోయి.. మూడు కొత్త వర్గాలు ఏర్పడతాయని వారు స్పష్టంగా చెబుతున్నారు. ఒకటి అత్యంత సంపన్నమైన ఏఐ వ్యవస్థల యజమానులు.. రెండోది ఏఐ వ్యవస్థల నిర్వహణ, అభివృద్ధిని పర్యవేక్షించే మేనేజర్లు/ఇన్నోవేటర్లు.. మూడోది ఏఐ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయి చేయడానికి ఏమీ లేకుండా ఉండిపోయే ప్రజలు. ఏఐ కారణంగా 90శాతం మంది జనాభాకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని యూకేకు చెందిన ప్రముఖ ఏఐ శాస్త్రవేత్త స్టూవర్ట్ రస్సెల్, సన్ మైక్రోసిస్టమ్స్ సహవ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా ఇటీవలే పేర్కొన్నారు.

ఏఐ వ్యవస్థలు చేతిలో ఉన్నవారిదే 'పవర్'!


భారీగా సంపద పోగుపడిన 'ఏఐ' యజమానులే పవర్‌ఫుల్‌గా మారిపోతారని.. ప్రభుత్వాలనూ శాసించగలిగే పరిస్థితులు ఉంటాయని స్టూవర్ట్ రస్సెల్ తదితర ఏఐ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమ చేతిలోని ఏఐ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని.. సరుకుల ఉత్పత్తి నుంచి సేవల వరకు అన్నింటినీ నియంత్రించగలిగే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అందువల్ల ఏఐ విషయంలో స్పష్టమైన నియంత్రణ, పకడ్బందీ మార్గదర్శకాలపై ఇప్పుడే దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఏఐ వ్యవస్థల యాజమాన్యమే కీలకమని, దానిపై ప్రభుత్వాలు, సంస్థలు దృష్టిపెట్టాలని మైండ్ నెట్‌వర్క్ ఏఐ సంస్థ సీఈవో క్రిస్టియర్ పునెట్రీ సూచిస్తున్నారు.



1 భారీగా పెట్టుబడులు పెట్టి ఏఐ వ్యవస్థలు, రోబోలను ఏర్పాటు చేసే యజమానులు మొదటి వర్గంగా ఉంటారు. ప్రస్తుతం మనుషులు చేస్తున్న ఉద్యోగాలు, పనులన్నీ ఏఐ, రోబోలే చేస్తాయి. పరిశ్రమల్లో కార్మికులు ఉండరు. వ్యవసాయం, భవనాల నిర్మాణం వంటి శ్రమ ఆధారిత పనులు, ఇంటి పనులు, వంట పనులు.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, టీచర్లు, లాయర్లు, జర్నలిస్టులు, డ్రైవర్లు, కస్టమర్ కేర్ సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు, మార్కెటింగ్ ఉద్యోగులు, గ్రాఫిక్ డిజైనర్లు, కంటెంట్ క్రియేటర్లు, హెచ్‌ఆర్ ఉద్యోగులు, డెలివరీ బాయ్స్.. ఇలా అన్ని పనులనూ ఏఐ రోబోలు చేస్తాయి. ఆ పనులకు సంబంధించిన ఆదాయమంతా 'ఏఐ' వ్యవస్థల యజమానుల చేతికే వెళుతుంది.

2 ఏఐ వ్యవస్థల నిర్వహణ కోసం యజమానుల కింద పనిచేసే ఉద్యోగులు, ఏఐ వ్యవస్థలను మరింత మెరుగుపరిచే, సరికొత్త ఆవిష్కరణలు చేసే ఇన్నోవేటర్లు, ఏఐ చేయలేని భావోద్వేగాలతో ముడిపడిన పనులు చేసేవారు.. రెండో వర్గంగా ఉంటారు. వీరికి పని ఉంటుంది. అందుకు తగిన ఆదాయమూ ఉంటుంది. మొత్తంగా జనాభాలో కేవలం రెండు, మూడు శాతం యజమానులు, మరో ఏడెనిమిది శాతం ఉండే మేనేజర్లు/ఇన్నోవేటర్ల వద్దే మొత్తం సంపదలో 99శాతం సంపద కేంద్రీకృతమై ఉంటుంది.

3 అన్ని పనులూ ఏఐ వ్యవస్థలు, రోబోలే చేస్తుంటే.. చేయడానికి ఉద్యోగం, ఉపాధి ఏమీ లేకుండా ఉండిపోయే ప్రజలు 90శాతం ఉంటారు. వారికి దాదాపుగా ఎలాంటి ఆదాయమూ ఉండదు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంపైనే ఆధారపడాల్సి ఉంటుంది.



సంపద సృష్టి ఎలా? పంపిణీ ఎలా?

మనుషులకు ఉద్యోగాలు, ఉపాధి పోయినా.. ఆ పనులన్నీ ఏఐ వ్యవస్థలు, రోబోలతో జరిగిపోతూనే ఉంటాయి. పంటల నుంచి పరిశ్రమల్లో ఉత్పత్తుల దాకా ఇంకా మెరుగ్గా కొనసాగుతూ ఉంటాయి. వాటి నుంచి పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతూనే ఉంటుంది. ఇప్పటికంటే ఇంకా ఎక్కువగా సంపద సృష్టి జరుగుతూనే ఉంటుంది. ఆ సంపద అంతా 'ఏఐ' యజమానుల చేతిలోకే వెళుతుంది. కొంత ప్రభుత్వానికి చేరుతుంది. పని ఉండని ప్రజలకు ఖర్చుల కోసం 'యూబీఐ (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం-అందరికీ కనీస వేతనం)' కింద ప్రభుత్వమే ప్రతినెలా డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని ఏఐ నిపుణులు చెబుతున్నారు. వ్యవస్థలు కొనసాగాలంటే వినియోగం ఉండాలని, ప్రభుత్వమే డబ్బులు ఇచ్చి ఆ వినియోగాన్ని కొనసాగించక తప్పదని స్పష్టం చేస్తున్నారు. 'ఏఐ' యజమానులపై ఆదాయ పన్నును, ఏఐ వ్యవస్థలు చేసే ఉత్పత్తులపై పన్నులను పెంచడం ద్వారా 'యూబీఐ' కోసం అవసరమైన సొమ్మును ప్రభుత్వం సమకూర్చుకోవచ్చని అంటున్నారు.



ఐదేళ్లలో 80 కోట్ల ఉద్యోగాలకు కోత!

ఏఐ కారణంగా 2030 నాటికల్లా ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ సాక్స్ అంచనా వేయగా, ఆ సంఖ్య 80 కోట్లకుపైగానే ఉంటుందని కన్సల్టింగ్ సేవల కంపెనీ మెకెన్సీ పేర్కొంది. ఆ ఉద్యోగుల స్థానంలో ఏఐని వినియోగించడం వల్ల కంపెనీల ఉత్పాదకత, లాభాలు 14శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేశాయి.

ఉద్యోగాల మార్కెట్‌పై సునామీ లాంటిది ఏఐ

▸▸ ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా జార్జియేవా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కృత్రిమ మేధ (ఏఐ) ప్రవేశంతో ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ఉద్యోగాలకు ముప్పు ఉందని ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా జార్జియేవా చెప్పారు. ప్రారంభ స్థాయి ఉద్యోగాల విషయంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఎన్డీటీవీతో మాట్లాడుతూ హెచ్చరించారు. ఈ టెక్నాలజీ మార్పును "లేబర్ మార్కెట్లను తాకిన సునామీ" అని అభివర్ణించారు. అభివృద్ధి చెందిన దేశాల విషయంలో ఉద్యోగాల కోత 60 శాతం వరకూ కూడా పెరగవచ్చని, భారత్‌లో 26 శాతం వద్ద ఆగిపోవచ్చని ఐఎంఎఫ్ అధ్యయనాలను ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. "ఎవరు దీనిలో నలిగిపోతారు? మన ఆందోళన అంతా ఎంట్రీ లెవెల్ జాబ్స్ గురించే. ఈ స్థాయిలోని ఉద్యోగాలను సులువుగా ఆటోమేషన్ చేయవచ్చు. అంటే యువ గ్రాడ్యుయేట్లు ఏ రకమైన జాబ్‌ను ఎంచుకోవాలి? ఏఐతో వస్తున్న మార్పులకు అనుగుణంగా విధానాలను రూపకల్పన చేసి ప్రజలను సిద్ధం చేయడంలో మనం వెనకబడి ఉన్నాం" అని జార్జియేవా చెప్పారు.


300 బిలియన్ డాలర్లు.. ఏఐలో భారీగా పెట్టుబడులు

▸▸ ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పలు ఒప్పందాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు సందర్భంగా భారత్‌కు భారీగా పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. కృత్రిమ మేధలో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇక భారత్‌తో పాటు విదేశీ ప్రభుత్వాలు అంగీకరించినవి కూడా కలిపితే ఆ పెట్టుబడుల విలువ మొత్తం 300 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని తెలిపాయి. ఇవన్నీ ఐదు నుంచి ఏడేళ్ల వ్యవధిలో కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. వీటిలో 70 బిలియన్ డాలర్లు గతంలోనే నిశ్చయమైనవి కాగా, 90 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఇటీవల ప్రకటించారు. ఇవన్నీ కూడా ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, కంప్యూటింగ్ సామర్థ్యం పెంపునకు సంబంధించినవే. రిలయన్స్ కంపెనీ ఒక్కటే వచ్చే ఏడేళ్లలో ఏఐ, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సుమారు 110 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ఈ ఏడాది ప్రారంభంలో తెలిపింది. ఇక అదానీ గ్రూప్ 2035 నాటికి 150 బిలియన్ డాలర్లను పునరుత్పాదక ఆధారిత ఏఐ డేటా సెంటర్లు, దానికి అనుబంధ విభాగాల్లో పెట్టుబడులు పెడుతుంది. ఇక మైక్రోసాఫ్ట్ 2030 నాటికి గ్లోబల్ సౌత్‌లో 50 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి నిర్ణయించుకోగా, దానిలో 17.5 బిలియన్ డాలర్లు భారత్‌కే కేటాయించింది.

ద్వైపాక్షిక చర్చలు.. సీఈవోలతో మంతనాలు

ఏఐ సదస్సు సందర్భంగా ప్రధాని బిజీబిజీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 చివరి రోజు శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరుస సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. 16 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో అబ్రిడ్జ్, అదాలత్ ఏఐ, బ్రెయిన్‌సైట్ ఏఐ, క్రెడో ఏఐ, ఏకా కేర్, గ్లీన్, ఇన్నోగుల్, ఇన్‌విడియో, మికో, ఆరిజన్, ప్రొఫేజ్, రాసెన్, రుబ్రిక్, సత్‌సూర్, సూపర్‌నోవా, సైఫా ఐఏ కంపెనీల వ్యవస్థాపకులు, సీఈవోలు పాల్గొన్నారు. వ్యవసాయం, ఉన్నత విద్య తదితర రంగాల్లో ఏఐ వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌తో సమావేశమై ఏఐ సద్వినియోగానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే, స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిన్, లీచెస్టైన్ యువరాజు అలోయిస్, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రలతో వేర్వేరుగా సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశాలన్నీ సుహృద్భావ వాతావరణంలో ఫలవంతంగా జరిగాయని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

యూత్ కాంగ్రెస్ నిరసన

▸▸ భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ చొక్కాలు విప్పి అర్ధనగ్న ప్రదర్శన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐ సమ్మిట్ జరుగుతున్న భారత మండపంలోని హాలు నంబర్ 5లోకి దూసుకొచ్చిన పలువురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసనకు దిగారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోదీ, డొనాల్డ్ ట్రంప్ చిత్రాలు ప్రింట్ చేసిన టీషర్టులను ప్రదర్శించడంతో పాటు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, ఎప్‌స్టీన్ ఫైళ్ల విషయంలో మోదీ లొంగిపోయారంటూ ఆరోపణలు చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి బయటకు లాక్కెళ్లారు. యూత్ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త, జడ్చర్లకు చెందిన పి.నరసింహ యాదవ్ నేతృత్వంలో ఈ నిరసన జరిగింది. దేశ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకే కాంగ్రెస్ నేతలు ఈ విధంగా వ్యవహరించారని బీజేపీ తీవ్రంగా మండిపడింది. ప్రపంచ దేశాల ప్రతినిధుల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా కాంగ్రెస్ ప్రవర్తించడం సిగ్గు చేటని కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, శివరాజ్‌సింగ్ చౌహాన్, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషితో పాటు పలువురు బీజేపీ అగ్ర నేతలు దుయ్యబట్టారు.

క్వాంటమ్.. కేరాఫ్ ఏపీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో ఈ ఒప్పందాలు కుదిరాయి. అమరావతిలో క్వాంటమ్ ఏఐ సెంటర్, అంతర్జాతీయ క్వాంటమ్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ అకాడమీల ఏర్పాటు, క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో లక్ష మంది యువతకు శిక్షణ... అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ వివరాలు..

దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ వర్సిటీ..

రాజధాని అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్యాంపస్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నిధులు సమకూర్చుతుంది. 10 ఎకరాల భూమి, క్వాంటమ్ హార్డ్‌వేర్‌ను రాష్ట్రం సమకూర్చాల్సి ఉంటుంది. కార్యక్రమంలో కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్, ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

అమరావతిలో క్వాంటమ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యూనీసీసీ)తో రాష్ట్రప్రభుత్వం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి క్వాంటమ్ ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంవోయూలో పేర్కొన్నారు. ఒప్పంద కార్యక్రమంలో యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



వరల్డ్ ఎకనామిక్ ఫోరం రౌండ్ టేబుల్ చర్చలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతిలో వైజర్ టాలెంట్ హబ్..

వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టెమ్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ రిసెర్చ్ (వైజర్) సంస్థ భాగస్వామ్యంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు టాలెంట్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తాజా ఒప్పందంతో ఈ ఏడాది చివరి నాటికి 3.50 లక్షల మంది, 2027 నాటికి 6 లక్షల మందికి ఏఐ క్వాంటమ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. భవిష్యత్తులో 35 లక్షల మందికి శిక్షణ ఇవ్వడమే ఈ ఒప్పంద లక్ష్యం. కాగా, ఏపీలోని 50కి పైగా ఉన్నతవిద్యా సంస్థలో ఏఐ అకాడమీలు, ఏఐ శాండ్‌బాక్స్ ఏర్పాటు చేసేందుకు కాలిబో ఏఐ సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అలాగే క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో వచ్చే 3-5 ఏళ్లలో రాష్ట్రంలోని లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం ఐబీఎంతో ఎంవోయూ కుదుర్చుకుంది. కార్యక్రమానికి ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రిసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్.. తదితరులు హాజరయ్యారు.

రాష్ట్రవ్యాప్త ఏఐ టెక్ హబ్..

ఐదంచెల 'స్వదేశీ ఏఐ స్టాక్' ఆధారంగా రాష్ట్రస్థాయి ఏఐ టెక్ హబ్ నిర్మించేలా భారత్‌జెన్, నెక్స్‌టీజెన్, ఐబీఎంతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతో పాటు 22 భారతీయ భాషలను అనుసంధానించే ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. భారత్‌జెన్ సీఈవో రిషిబాల్, ప్రతినిధి రామకృష్ణన్, నెక్స్‌టీ జెన్ సీఈవో రాజగోపాల్, ఐబీఎం రిసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ ఏఐ ట్యూటర్..

పాఠశాల విద్యార్థులకు ఏఐ ట్యూటర్ ఏర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్, బోధన్ ఏఐతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ఏఐ ట్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఈ ఎంవోయూ కుదిరింది. ఈ ట్యూటర్ ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉంటూ, విద్యార్థులకు వ్యక్తిగత శిక్షణ అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, ప్రొఫెసర్ మితేశ్ పాల్గొన్నారు.

క్రియేటర్ ఎకానమీ సెంటర్‌గా ఏపీ

ఏఐ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను క్రియేటర్ ఎకానమీ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి వివిధ టెక్ కంపెనీల భాగస్వామ్యం అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. టెక్ నైపుణ్యాలు ఉన్న యువశక్తి ఏపీకి అతిపెద్ద వనరుగా అభివర్ణించారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో యువతను నిపుణులుగా తయారు చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటామని వెల్లడించారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో భాగంగా భారత్ మండపంలో ఉన్న ఏపీ పెవిలియన్‌లో దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో సీఎం చంద్రబాబు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఏపీకి సహాయ, సహకారాలు అందించే అంశాలపై వారితో చర్చించారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, ఆరామ్‌కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహ్మాన్ ఐతుకైర్, లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్, ఆధార్ ఫౌండర్ సీటీవో శ్రీకాంత్ నాదముని, కాలిఫోర్నియాకు చెందిన ఖోస్లా వెంచర్స్ ఎండీ వినోద్ ఖోస్లాతో సీఎం భేటీలు నిర్వహించారు.

గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఏపీ అనుకూలం

రాష్ట్రంలో సౌర విద్యుత్తు సహా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై సౌదీ ఆరామ్‌కో ప్రతినిధులతో చంద్రబాబు చర్చలు జరిపారు. . గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఏపీ అత్యంత అనువైన ప్రాంతమని వివరించారు. ప్రముఖ టెక్ కంపెనీ అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ సందర్భంగా క్రియేటర్ ఎకానమీని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి సహకారం అందించాలని కోరారు. ఏపీలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటు కోసం సహకారం అందించాలని ఎన్‌విడియా వైస్ ప్రెసిడెంట్ కాలిస్టారెడ్మెండ్‌కు విజ్ఞప్తి చేశారు.

మన క్వాంటం వ్యాలీ గురించి అంతా మాట్లాడతారు: సీఎం

సమీప భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు వస్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో భాగంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్వర్యంలో నిర్వహించిన 'కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం' అంశంపై రౌండ్‌టేబుల్ సదస్సులో ఆయన ప్రసంగించారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో విశాఖపట్నం డేటా హబ్‌గా మారుతోందన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టమ్‌ను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఏఐ అద్భుతాలను సాధిస్తుందన్న విశ్వాసం ఉందని, పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లడంపై ఏపీ దృష్టి సారిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

ఏఐ రంగంలో చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టే

ప్యాక్స్ సిలికాపై భారత్ సంతకం

▸▸ ఇండియాలో ఏఐ మౌలికవసతుల కల్పనకు అమెరికా కంపెనీల నుంచి భారీ పెట్టుబడులు

▸▸ కేంద్రం చేపట్టిన సెమీకండక్టర్ మిషన్‌కు ఊతం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కృత్రిమ మేధకు అత్యంత కీలకమైన సెమీకండక్టర్లు, అత్యంత అరుదైన ఖనిజ లోహాల సరఫరా గొలుసుల వంటివాటిలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన 'ప్యాక్స్ సిలికా' అనే వ్యూహాత్మక కార్యక్రమంలో భారత్ కూడా భాగస్వామి అయింది. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో.. ఈ ప్యాక్స్ సిలికా డిక్లరేషన్‌పై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో చేరడంవల్ల భారత్‌కు ఏఐ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. అమెరికాకు చెందిన ఏఐ కంపెనీలు భారత్‌లో ఏఐ మౌలిక వసతులపై పెట్టుబడులు పెడతాయి. మోదీ సర్కారు చేపట్టిన సెమీకండక్టర్ మిషన్‌కు బలమైన మద్దతు లభిస్తుంది. ఇండియా- అమెరికా మధ్య టెక్నాలజీ సంబంధాలు మరింత బలపడతాయి. కృత్రిమ మేధ రంగంలో చైనా గుత్తాధిపత్యాన్ని తగ్గించే అంతర్జాతీయ వ్యూహంలో భారత్ కీలక భాగస్వామి అవుతుంది.

ప్యాక్స్ సిలికా అంటే?


ప్యాక్స్ సిలికా అంటే.. లాటిన్ భాషలో 'సిలికా శాంతి' అని అర్థం. ఆ పేరే ఎందుకు అంటే.. చరిత్రలో 'ప్యాక్స్ రోమనా', 'ప్యాక్స్ బ్రిటానికా', ప్యాక్స్ అమెరికానా' అనే పదబంధాలు కనిపిస్తాయి. వీటిలో ప్యాక్స్ రోమనా అంటే.. రోమన్ సామ్రాజ్య హయాంలో నెలకొన్న సుదీర్ఘ శాంతికాలం. ఇదే క్రమంలో బ్రిటిషర్ల ఆధిపత్యం కొనసాగిన కాలాన్ని ప్యాక్స్ బ్రిటానికా అని, అమెరికన్ల ఆధిపత్యం కొనసాగిన కాలాన్ని 'ప్యాక్స్ అమెరికానా' అని అంటారు!

8 ఏళ్ల ఏఐ మేధావి..!

ఏఐ సదస్సులో చిచ్చర పిడుగు రణ్‌వీర్ సచ్‌దేవా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో రణవీర్ సచ్‌దేవా అనే 8 ఏళ్ల చిచ్చరపిడుగు కీలక ప్రసంగంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. అతి పిన్న వయసులోనే అల్గారిథంలు, తదుపరి తరం మౌలిక సదుపాయాల గురించి అలవోకగా మాట్లాడి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. రణ్‌వీర్ సచ్‌దేవా ఒక ఏఐ సాంకేతిక నిపుణుడు. రచయిత. అత్యంత క్లిష్టమైన ఏఐ కాన్సెప్ట్‌లను పిల్లలకు అర్థమయ్యేలా, తేలికైన కథనాలుగా సరళీకరించి చెప్పడంలో పరిణతి సాధించాడు. గతంలో ఆరేళ్ల వయసులోనే టెక్నాలజీ, కృత్రిమ మేధ ఆవిష్కరణలపై మాట్లాడిన అతి పిన్నవయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో అతని పేరు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ప్రస్తుతం ఆసియాలో ఉన్న అతి పిన్న వయస్కుడైన టెడ్‌ఎక్స్ స్పీకర్ రణ్‌వీరే. ఇండియా ఏఐ సదస్సులో రణ్‌వీర్ కృత్రిమ మేధకు పెరుగుతున్న ప్రాముఖ్యతపై మాట్లాడాడు. ఈ క్రమంలో ఆధునిక సాంకేతికత, ప్రాచీన భారతీయ తత్వశాస్త్రాల మధ్య సంబంధాన్ని హైలెట్ చేశాడు. రణ్‌వీర్ ప్రస్తుతం హార్వర్డ్ యూనివర్సిటీలో మెషిన్ లెర్నింగ్ కోర్సును అభ్యసిస్తున్నాడు. అలాగే ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్‌కు అంబాసిడర్‌గా, ఈసీబీ సస్టెయినబుల్ యూత్, సిటీ వన్ ఇనీషియేటివ్, చక్ర డైలాగ్స్ ఫౌండేషన్‌లకు టెక్నాలజీ అంబాసిడర్‌గా పనిచేస్తున్నాడు. రణ్‌వీర్ రాసిన తొలి పుస్తకం 'ఆర్ యూ బోర్న్ విత్ ఏఐ..?' అతనికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిపెట్టింది.





శాసనమండలిలో చెప్పులతో.. శ్రీవారి చిత్రపటాలను ప్రదర్శిస్తున్న వైసీపీ సభ్యులు

వైసీపీ మహాపచారం

(మొదటి పేజీ తరువాయి)

మంచి బుద్ధి ప్రసాదించాలి' అంటూ నినాదాలు చేశారు. బ్యాడ్జీలు, పోస్టర్లు, బ్యానర్లతో అసెంబ్లీలోకి వచ్చేందుకు అనుమతి లేదంటూ మార్షల్స్ అడ్డు చెప్పారు. అయినా వారు వినకుండా ముందుకొచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో.. గేటు మూసి వారి చేతుల్లోని స్వామి పోస్టర్లు, ప్లకార్డులను, బ్యానర్లను మార్షల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 10.07 గంటలకు మండలి సమావేశం మొదలవగా.. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీపై ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి.. ఇందాపూర్-హెరిటేజ్ సంస్థపై వైసీపీ సభ్యులు కుంభా రవిబాబు, తూమాటి మాధవరావు, మంగమ్మ ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించి.. ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే వైసీపీ సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, హనుమంతరావు, రవిబాబు, వరుదు కల్యాణి, కల్పలత, రమేశ్ యాదవ్, విక్రాంత్ తదితరులు ఇందాపూర్ డెయిరీపై చర్చకు అనుమతించాలంటూ స్వామి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. బూట్లు, చెప్పులతో స్వామి ఫొటోలు ప్రదర్శించడంపై మంత్రి పయ్యావుల కేశవ్, అధికార కూటమి సభ్యులు మండిపడ్డారు. 'వైసీపీ నేతలకు బుద్ధుందా? రాజకీయం కోసం దేవుడి ఫొటోలను సభలో ప్రదర్శించి, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తారా? దేవుడిని రాజకీయాల్లోకి లాగే దుర్మార్గపు చర్య. వైసీపీ సభ్యులకు దేవుడంటే భయం లేదు.. నమ్మకమూ లేదు. విచక్షణ లేకుండా వారి నాయకుడు చెప్పినట్లు నడచుకుంటున్నారు. హిందువుల గౌరవం, జాతి నమ్మకాన్ని దెబ్బతీసేలా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని అంటూ కేశవ్ తన హెడ్ ఫోన్‌ను విసిరికొట్టారు. మంత్రి లోకేశ్, కూటమి ఎమ్మెల్సీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా.. వైసీపీ ఎమ్మెల్సీలు పెద్దగా నినాదాలు చేయడంతో.. టీడీపీ ఎమ్మెల్సీలు కూడా పోడియం వద్దకు వెళ్లి, వారిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఉదయం 10.11 సమయంలో 5 నిమిషాలు సభను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. వైసీపీ సభ్యులు సభ నుంచి బయటకు వచ్చే సమయంలో ప్లకార్డులతో పాటు స్వామి పోస్టర్లను వైసీపీ సభ్యులు అక్కడే పడేశారు.



బూట్లు వేసుకొని శ్రీవారి చిత్రపటాలతో శాసనమండలికి వస్తున్న వైసీపీ సభ్యులు

చైర్మన్ వద్ద కూటమి నిరసన

అనంతరం మంత్రులు లోకేశ్, కేశవ్ సహా కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు చైర్మన్ చాంబర్‌కు వెళ్లారు. వేంకటేశ్వరస్వామిని ఉద్దేశపూర్వకంగా ప్రతిరోజూ సభలో అపవిత్రం చేస్తున్నారని, ఇవాళ బూట్లు, చెప్పులు ధరించి స్వామి ఫొటోలను చేతపట్టుకుని ప్రదర్శించడం, టేబుల్‌పై స్వామి చిత్రపటాలను విసిరివేయడంపై నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సభలోకి దేవుడి ఫొటోలను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. మోషేన్‌రాజు స్పందిస్తూ.. వైసీపీ సభ్యులు చేసింది తప్పేనని.. వారిని పిలిచి మాట్లాడతానని చెప్పారు. మాట్లాడడం కాదని, బహిరంగ క్షమాపణలు చెప్పించి, లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. తర్వాత బొత్సను చైర్మన్ తన చాంబరుకు పిలిపించి వివరణ కోరారు. జరిగినదానికి క్షమాపణ చెబుతారా అని అడిగారు. తామెందుకు క్షమాపణలు చెబుతామని బొత్స అన్నారు. తమ సభ్యులు తన సీటు వద్దే బూట్లు, చెప్పులు విడిచి పోడియం దగ్గరకు వచ్చారని చెప్పారు. మండలి నడవకుండా ఇలాగే కొనసాగడం సరికాదని.. ఇరుపక్షాల నుంచి ముగ్గురేసి సభ్యులు కూర్చుని సంప్రదింపులు జరుపుకోవాలని చైర్మన్ సూచించారు. తర్వాత 1.07 గంటలకు మండలి పునః ప్రారంభమైంది. వైసీపీ సభ్యులు మళ్లీ ప్లకార్డులు పట్టుకుని పోడియం వద్దకు వచ్చారు. చంద్రబాబు గతంలో బూట్లు వేసుకుని శ్రీవారి ఫొటో పట్టుకున్నట్లు ప్లకార్డులను ప్రదర్శించారు. చంద్రబాబే భక్తులకు క్షమాపణ చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. దీంతో టీడీపీ సభ్యులు కూడా పోడియం వద్దకు వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. 4 రోజులుగా సభను అడ్డుకోవడం సరికాదని బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఈ పరిణామాలతో ఒక్క నిమిషంలోనే (1.08గంటలకు) సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా మండలిలో బడ్జెట్‌పై చర్చే కాదు.. అసలే కార్యకలాపాలూ సాగలేదు.

జగన్.. వెంకన్నతో పెట్టుకోవద్దు: లోకేశ్

శ్రీవారికి చేసిన మహాపాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరో మహాపరాధానికి జగన్ పాల్పడ్డారని లోకేశ్ ధ్వజమెత్తారు. 'మీకు దేవుడంటే భక్తి లేదు, భయమూ లేదు. మీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో స్వామి చిత్రపటాలు పట్టుకుని మహాపరాధం చేశారు. అంతేకాకుండా కౌన్సిల్‌లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్లిపోవడం క్షమించరాని పాపం. వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్' అని 'ఎక్స్‌'లో పేర్కొన్నారు.

మహిళా ఎమ్మెల్సీలకు చీరలు

సభ వాయిదా పడ్డాక వైసీపీ ఎమ్మెల్సీలు బొత్స చాంబర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ముగ్గురు మహిళా సభ్యులకు బొత్స చీరలు బహూకరించారు. దీంతో.. పురుష ఎమ్మెల్సీలు తమకూ కావాలని డిమాండ్ చేశారు. వారికి సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని చేనేత స్టాల్స్ నుంచి చీరలు కొని అందిస్తామని బొత్స చెప్పారు.

ప్రభుత్వం తోకముడిచింది: బొత్స

మండలిలో ప్రభుత్వం తోకముడిచిందని బొత్స అన్నారు. సభ వాయిదా పడ్డాక అసెంబ్లీ ఆవరణ బయట వైసీపీ అనుకూల మీడియా సంస్థలతో ఆయన మాట్లాడారు. 'మా సభ్యులు సభలో చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటో పట్టుకున్నట్లు ఒక్క ఆధారం గానీ, క్లిపింగ్ గానీ చూపెట్టమనండి' అని సవాల్ విసిరారు. దీనికి మంత్రి లోకేశ్ తక్షణమే 'ఎక్స్‌'లో స్పందించారు. మండలిలో బొత్స తాము బూట్లు, చెప్పులతో స్వామి చిత్రపటాన్ని పట్టుకోలేదని చెప్పిన వీడియోను.. వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో స్వామి ఫొటోలను పట్టుకున్న వీడియోను కలిపి ట్యాగ్ చేశారు.

వైసీపీ పాపాలు కడుగుతున్నాం

- 22ఏ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్: మంత్రి అనగాని
- వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలకు అసెంబ్లీ ఆమోదం



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ, ప్రజల భూములను కబళించారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. అప్పట్లో వారు చేసిన పాపాలను తాము కడుగుతున్నామని అన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, విపత్తు నిర్వహణకు రూ.9,164 కోట్ల బడ్జెట్ కేటాయింపును ఆమోదించాలని శుక్రవారం శాసనసభలో ఆయన ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అడ్డం పెట్టుకొని 1.75 లక్షల ఎకరాలు కాజేయాలని వైసీపీ నాయకులు ప్రయత్నించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెవెన్యూ వ్యవస్థలో పూర్తిస్థాయి సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో పాత పొరపాట్లను సరిచేసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని, దీనివల్ల విశ్వసనీయ, కచ్చితమైన భూ రికార్డులు సిద్ధమవుతాయన్నారు. రీసర్వే చేసిన గ్రామాల్లో రాజముద్రతో 15 రకాల రక్షణ అంశాలతో కూడిన పాస్‌బుక్‌లు అందిస్తున్నామని చెప్పారు. 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

'లోవోల్టేజీ' నివారణకు 8 వేల కోట్లు: గొట్టిపాటి



రాష్ట్రంలో విద్యుత్తు లోవోల్టేజీ సమస్య నివారణకు రూ.8 వేల కోట్లతో చర్యలు చేపడుతున్నామని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇంధన శాఖకు కేటాయించిన రూ.13,942 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను సభ ముందుంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూలస్తంభమైన విద్యుత్తు రంగంలో సంస్కరణలకు సీఎం చంద్రబాబు నాంది పలికారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూడౌన్‌లో భాగంగా 13 పైసలు తగ్గించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిదిసార్లు విద్యుత్తు చార్జీలు పెంచారని, రూ.30వేల కోట్ల ట్రూఅప్ చార్జీలు వేశారని, రెన్యూవబుల్ ఎనర్జీ డెవలపర్స్‌ను బెదిరించారని ఆరోపించారు.

సీమలో 'బెంచ్' ఏర్పాటు హైకోర్టులో పెండింగ్: ఫరూక్

రాయలసీమలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. తన శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన రూ.1,352 కోట్లను ఆమోదించాలని ఆయన ప్రతిపాదించారు. రాష్ట్రంలో కోర్టు భవనాలు, మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్‌కు నివేదిక అందిస్తామని చెప్పారు. కాగా హోంశాఖ, రెవెన్యూ, ఇంధన, న్యాయ, మైనార్టీ శాఖల మంత్రులు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను సభ ఆమోదించింది.

బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధి చేస్తాం: కందుల దుర్గేశ్

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో బౌద్ధ క్షేత్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట తదితర ప్రాంతాలను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు.

మినరల్స్‌లో ఏపీని కీలకంగా మారుస్తాం: కొల్లు

కేంద్రం క్రిటికల్ మినరల్ పార్కుల ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో ఉన్న అపార ఖనిజ వనరుల తవ్వకాలతోపాటు వాటిని ప్రాసెస్ చేసే వేల్యూయాడెడ్ (విలువ జోడింపు) పరిశ్రమలను ఏర్పాటు చేయడం (ఇంటిగ్రేటెడ్ వేల్యూచైన్) ద్వారా రేర్ ఎర్త్ మినరల్స్ తయారీలో ఏపీని కీలకంగా మారుస్తాం' అని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

పుష్కరాలకు కాలుష్య నివారణకు చర్యలు: నిమ్మల

వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను పురస్కరించుని కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి: బీసీ జనార్దనరెడ్డి

పుష్కరాలు జరిగే నియోజకవర్గాల్లోని రహదారులను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి బీసీ జనార్దనరెడ్డి తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

ఆ సిమెంట్ కంపెనీలపై చర్యలు: మంత్రి భరత్

గురజాల నియోజకవర్గంలో పాతకేళ్ల కిందట ప్రభుత్వ భూములు తీసుకుని, ఇంతవరకు ఫ్యాక్టరీలు పెట్టని వివిధ సిమెంట్ కంపెనీలపై చర్యలు తీసుకుంటామని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఇప్పటికే ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశామన్నారు.

25, 26న విచారణకు రండి!

- రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీలకు మండలి చైర్మన్ నోటీసులు

తమ పదవులకు రాజీనామా చేసిన ఐదుగురు వైసీపీ ఎమ్మెల్సీలను విచారణకు హాజరుకావాలంటూ మండలి చైర్మన్ మోషేన్ రాజు నోటీసులు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం ఇచ్చిన నోటీసుల్లో 25, 26న విచారణకు రావాలని పేర్కొన్నారు. 25న జయమంగళం వెంకటరమణను, 26న కల్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, మర్రి రాజశేఖర్‌ను విచారణకు రావాలని మండలి చైర్మన్ నోటీసుల్లో కోరారు.

జగన్ డైరెక్షన్‌లోనే!

చెప్పులు వేసుకుని దేవుడి ఫొటోలను ప్లకార్డుల్లా ప్రదర్శిస్తారా?

తమ విధానం ఇదేనని జగన్ చెబుతున్నారా?

హిందువుల మనోభావాలు దెబ్బతీశారు.. క్షమాపణలు చెప్పాలి

మంత్రులు పయ్యావుల, దుర్గేశ్, సవిత, ఎమ్మెల్సీ వీర్రాజు డిమాండ్



అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న మంత్రులు కేశవ్, లోకేశ్, దుర్గేశ్, సవిత, నిమ్మల తదితరులు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జగన్ డైరెక్షన్‌లోనే వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో చెప్పులు, బూట్లు వేసుకొని వెంకటేశ్వరస్వామి ఫొటోలను ప్లకార్డుల్లా ప్రదర్శిస్తూ అపహాస్యం చేశారని, మహాపచారానికి పాల్పడ్డారని కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు మండిపడ్డారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా శ్రీవారి ఫొటోలను విసిరిపడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఆ దేవదేవుడే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ మహాపచారంపై జగన్, వైసీపీ సభ్యులు హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి లోకేశ్ నేతృత్వంలో అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు.

మనోభావాలు దెబ్బతీశారు: పయ్యావుల

వైసీపీ సభ్యులు చట్టసభల సాక్షిగా హిందువుల మనోభావాలు దెబ్బతీశారని, హద్దులు దాటి ప్రవర్తించారని పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. దేవుడిని రాజకీయాల్లో వాడుకోవడంలో వైసీపీ పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. 'రాజకీయాల్లో ఎంత దూరమైనా పోవచ్చు. ఏ ఎత్తుగడలైనా వేయవచ్చు కానీ.. ప్రత్యక్ష దైవంగా కొలిచే వెంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి తీసుకురావడం అంటే వైసీపీకి, ఆ పార్టీ అధినేత జగన్‌కు దేవుడి పట్ల ఏ రకమైన ఆలోచన ఉందో సమాజం ఆలోచించుకోవాలి' అని పేర్కొన్నారు. రోడ్డు మీద స్వామి ప్రసాదం ఇస్తే.. చెప్పులు వదిలేసి తీసుకునే సంస్కృతి మనదని పేర్కొన్నారు. వైసీపీ సభ్యులు సభలో చేసిన చర్య హిందూ సమాజాన్ని రెచ్చగొట్టేదిగా తాము భావిస్తున్నామన్నారు. ఇదే దేవదేవుని పట్ల వైసీపీ విధానమా? అని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామి పట్ల, హిందూత్వం పట్ల తమపార్టీ విధానం ఏంటో జగన్ స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. జగన్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు.

అత్యంత దుర్మార్గం: కందుల

వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ప్లకార్డులా పట్టుకుని సభలోకి రావడం అత్యంత దుర్మార్గమని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. వైసీపీ సభ్యుల తీరు హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపర్చిందని, దీన్ని జనసేన పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలపై గౌరవం లేని వైసీపీ నాయకత్వం.. దేవుడిని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం దుర్మార్గమన్నారు. స్వామి చిత్రపటాలను సభలోకి తీసుకురావడమే కాకుండా, తిరిగి వెళ్లేటప్పుడు వాటిని టేబుళ్లపైకి విసిరేయడం వారి అహంకారానికి నిదర్శమని మండిపడ్డారు. ఈ ఘటనను మండలి చైర్మన్ తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరించకపోతే, భవిష్యత్తులో మరిన్ని అపచారాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

వెంకన్న ఆగ్రహానికి గురికాక తప్పదు: సవిత

వైసీపీ సభ్యులు వెంకన్న ఫొటోలను సభలో విచ్చలవిడిగా పడేసి అపచారానికి పాల్పడ్డారని, దీనికి ఆ కలియుగ దైవం ఆగ్రహానికి గురికాక తప్పదని బీసీ సంక్షేమ మంత్రి సవిత హెచ్చరించారు. జగన్, వైసీపీ సభ్యులు తక్షణమే హిందువులకు, ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. దేవుడి ఫొటోలతో రాజకీయం చేయడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. వైసీపీ సభ్యులకు మహిళలన్నా గౌరవం లేదని, దేవుడన్నా భయం లేదన్నారు. సమస్యలపై చర్చించకుండా, తప్పులు బయటపడకుండా వైసీపీ సభ్యులు ఎంతటి నీచానికైనా దిగజారతారన్నారు.

క్షమించరాని నేరం: సోము వీర్రాజు

చెప్పులేసుకుని దేవుడి ఫొటోలతో సభలోకి రావడం క్షమించరాని నేరమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దేవుడి ఫొటోలను విసిరేయడం అవమానకరమన్నారు. ఇదంతా వైసీపీ సభ్యులకు పై నుంచి వచ్చిన డైరెక్షన్‌లోనే జరిగిందని తాను భావిస్తున్నానన్నారు. దీనిపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒక్క పింఛనూ తొలగించలేదు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క పింఛనూ తొలగించలేదని సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పింఛన్లు, రుణాలపై జగన్ నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడి, ప్రజల్లో అపోహలు, భయాలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 20 నెలల్లో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పింఛన్లు మాత్రమే తొలగించామన్నారు.

హిందూ జాతికి క్షమాపణలు చెప్పాలి

- వైసీపీపై దేవదాయ శాఖ మంత్రి ఆనం ఫైర్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరు హిందూ జాతి తలదించుకునేలా ఉందని దేవదాయ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్సీలు వేంకటేశ్వరస్వామిని అవమానించారని, దేవుడిని రాజకీయాల్లోకి లాగి అపవిత్రం చేస్తున్నారన్నారు. ఇది జగన్ ఆదేశాలతోనే జరిగిందన్నారు. హిందూ జాతికి వైసీపీ క్షమాపణలు చెప్పాలన్నారు.

ఇది బ్లాక్ డే: టీడీపీ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ

జగన్ హిందువుల మనోభావాలను దెబ్బతీశారని టీడీపీ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ విమర్శించారు. స్వామి ఫొటోను సభలోకి చెప్పులు వేసుకుని ప్లకార్డుల్లా తీసుకురావడం దేశ సంస్కృతికే బ్లాక్ డే అన్నారు.

చర్యలు తీసుకోవాలి: జనసేన ఎమ్మెల్యే నాయకర్

వైసీపీ సభ్యుల తీరును ప్రతి హిందువు తప్పుపడుతున్నారని జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. వారిపై చైర్మన్ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

వారిని సస్పెండ్ చేయరా: చీఫ్ విప్ అనూరాధ

చెప్పులు వేసుకుని శ్రీవారి చిత్రపటాన్ని ప్రదర్శించడానికి వైసీపీ మహిళా ఎమ్మెల్సీలకు సిగ్గులేదా అని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. ఆందోళన చేస్తున్న సభ్యులను సస్పెండ్ చేయకుండా చైర్మన్ వాయిదాలు వేస్తున్నారని, ఇంత అన్యాయం ఎప్పుడు చూడలేదన్నారు.

వారి తీరు సరికాదు: ఎమ్మెల్సీ గాదె

వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని తీసుకొచ్చి, ప్లకార్డుల్లా వాడడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు.

సత్యకుమార్‌కు డిప్యూటీ స్పీకర్ ప్రశంస

ప్రశ్నోత్తరాల్లో అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలిచ్చినందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను సభాధ్యక్ష స్థానంలో ఉన్న రఘురామ కృష్ణరాజు ప్రశంసించారు. ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ, వాటి అభివృద్ధిపై అనేక ప్రశ్నలు అడిగారు. వాటన్నింటికీ సమాధానాలిచ్చేందుకు మంత్రి బాగా హోంవర్క్ చేశారని డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యానించారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తే.. ఊరుకోం!

గుర్తుపెట్టుకోండి...
ఇది రాజారెడ్డి రాజ్యాంగం కాదు

- తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు
- శాసనసభలో హోంమంత్రి అనిత



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో మా ఇష్టం వచ్చినట్లుగా ఎలా పడితే అలా ప్రవర్తిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఇష్టానుసారంగా వ్యవహరించేవారు ఇది రాజారెడ్డి రాజ్యాంగం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. 'తప్పు చేస్తే ఏ పార్టీ అయినా, ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే' అని స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా అసభ్య కామెంట్ల నియంత్రణకు త్వరలో చట్టం తీసుకొస్తామన్నారు. శుక్రవారం అసెంబ్లీలో హోంశాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. "గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను మర్చిపోలేం... మర్చిపోకూడదు. చంద్రబాబు ఇంటిపైనే దాడి చేసిన దుర్మార్గపు పాలన అది. పవన్ కల్యాణ్‌ను వాహనం దించి రోడ్డుపై అవమానించారు. లోకేశ్ పాదయాత్రలో దాడులు చేయించారు. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. గంజాయికి ఏపీ చిరునామాగా మారింది" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేశామని, 20 నెలల్లో 1.4 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవాన్ని పునరుద్ధరించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పోలీసులు సైబర్ నేరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నా.. బాధితులకు కోల్పోయిన నగదు పెద్దగా అందడం లేదని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాప్రతినిధుల్ని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల అంబటి రాంబాబు అంశంలో సంబంధం లేని తన ఫొటో పెట్టి ట్రోలింగ్ చేశారన్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను నియంత్రించాలన్నారు.

జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు

- గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తిచేయాలి. పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించేలా చర్యలు ప్రారంభించాలి
  - బగ్గు రమణమూర్తి, నరసన్నపేట.
- పీ4, దేవదాయ శాఖలను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలి. పీ4ద్వారా ఆలయాలను అభివృద్ధి చేసే అవకాశం ఉంది.
  - అదితి గజపతిరాజు, విజయనగరం.
- 22(ఎ) భూములను సాగు చేస్తున్న రైతులకు వారికి దక్కాల్సిన మూడింట రెండో వంతు భూమిని వారి పేరుపైకి మార్చాలి. ఇనాందారులు ముందుకు రాని కేసుల్లో ప్రత్యామ్నాయ పరిష్కారం చూపాలి
  - ఎస్.ఈశ్వరరావు, ఎచ్చెర్ల.
- ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి. బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుని, రాయితీలు ఇవ్వాలి
  - పల్లె సింధూరరెడ్డి, పుట్టపర్తి

నేడు శ్రీవారి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణలు

- మఠాధిపతులు, స్వామీజీలతో రౌండ్ టేబుల్ భేటీలు
- జూమ్ కాన్ఫరెన్సులో కూటమి నేతల నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి శాసనమండలిలో వైసీపీ సభ్యులు చేసిన మహాపచారంపై శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వేంకటేశ్వరుడి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణలు చేయాలని కూటమి పక్షాలు నిర్ణయించాయి. దీనిపై ప్రజల్లోకి వెళ్లాలని.. పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల్లో కూటమి నేతలు విలేకరుల సమావేశాలు నిర్వహించి దేవదేవుడికి జరిగిన అపచారాన్ని వివరించాలని.. ఇదే సమయంలో మఠాధిపతులు, స్వామీజీలతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులు కూడా నిర్వహించాలని నిశ్చయించాయి. వైసీపీ సభ్యుల తీరుపై చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం కూటమి పక్షాల మంత్రులు, నేతలతోపాటు పార్టీ అధ్యక్షులు జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోమువీర్రాజు., జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడిపై రాజకీయం బూమరాంగ్

దేవదేవుడి బొమ్మతో వైసీపీ చేసిన రాజకీయం బూమరాంగ్ అయిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. చెప్పులు, బూటు కాళ్లతో స్వామి పోస్టర్లు పట్టుకుని ప్రదర్శన చేయడంపై భక్తుల నుంచీ ఆగ్రహం వ్యక్తం కావడంతో జగన్ అండ్ కో ఆత్మరక్షణలో పడ్డారని చెబుతున్నాయి. లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో వైసీపీ నేతలు కూరుకుపోయారని.. దీనినుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు హెరిటేజ్ సంస్థను ఇరికించడానికి చేసిన ప్రయత్నాలు ఘోరంగా దెబ్బతినడం.. ఢిల్లీ హైకోర్టు జగన్ రోత మీడియాపై ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఎదురుదాడికి యత్నించి భంగపడ్డారని స్పష్టం చేస్తున్నాయి.

రాంబాబు అనే కుక్కకీ ఒక రోజొస్తుంది

▸▸ చంద్రబాబు, లోకేశ్ నా ఇంటిపై దాడి చేయించారు: అంబటి

అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రతి కుక్కకీ ఓ రోజు వస్తుంది... ఈ రాంబాబు అనే కుక్కకి కూడా ఒక రోజు వస్తుంది' అని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం గుంటూరులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చావనైనా చస్తాను కానీ తగ్గేది లేదని స్పష్టం చేశారు. 'సీఎం చంద్రబాబు, లోకేశ్ నా ఇంటిపై దాడి చేయించి, మానిటర్ చేశారు. బెదిరించి, భయపెట్టాలని చూస్తే భయపడేదిలేదు. పోలీసుల సాయంతో టీడీపీ నాయకులు నా ఇంటిపై దాడులు చేశారు. ఇలాంటిది ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా చూశామా? చంపితే చస్తా... బతికుంటే సాధిస్తా. అన్నింటికీ మూల్యం చెల్లించుకునే రోజులొస్తాయి. నాకూ ఒక రోజు వస్తుంది' అని అంబటి హెచ్చరించారు. కాగా, తాడేపల్లి నివాసంలో శుక్రవారం అంబటి జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా జగన్... 'కూటమి ప్రభుత్వంపై పోరులో ఏమాత్రం తగ్గొద్దు. కేసులకు భయపడొద్దు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ సహా అధికారపక్షానికి వత్తాసు పలుకుతున్న పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకుంటాం' అన్నారు.

మనమిత్ర వాట్సాప్ సేవలపై ప్రత్యేక డ్రైవ్: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. మనమిత్ర వాట్సాప్ సేవపై జిల్లాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణాల్లో ఏప్రిల్‌లోగా అసలు చెల్లిస్తే... వడ్డీ మాఫీ చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని చెప్పారు. రూ.260 కోట్ల అసలు, రూ.40 కోట్ల వడ్డీ వసూలు కావాల్సి ఉందని, రికవరీపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

పీఎం సూర్యఘర్, కుసుమ్ వేగవంతం చేయాలి: సీఎస్

పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ కార్యక్రమాలతోపాటు ఫీడర్ లెవల్ సోలరైజేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సీఎస్ విజయానంద్ కోరారు. సచివాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ, విద్యుత్తు పంపిణీ సంస్థల సీఎండీలతో సమీక్షలోనూ సీఎస్ మాట్లాడారు. పీఎం సూర్యఘర్, కుసుమ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, దేశం మొత్తం కోటి సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు లక్ష్యంగా ఉంటే రాష్ట్రంలోనే 20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎస్ చెప్పారు.

డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల సేకరణ-2027లో జిల్లా ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారులైన కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వీవీఎల్ఎన్ శర్మ కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారులతో జనాభా లెక్కల సేకరణకు సన్నద్ధతపై ఆయన చర్చించారు. జనాభా లెక్కల సేకరణ మొదటి దశలో హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సెస్, రెండో దశలో పాపులేషన్ ఎన్యుమరేషన్ జరుగుతుందన్నారు. ఈ సారి జనాభా లెక్కల సేకరణ డిజిటల్ విధానంలో జరుగుతుందని చెప్పారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో భారీగా అక్రమాలు: తల్లిదండ్రులు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'ఇంటర్ ప్రాక్టికల్స్‌లో అనేక అక్రమాలు జరిగాయి. దీనిపై విచారణ జరిపించాలి'అని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పలు అంశాలపై ఇంటర్ విద్యామండలి కార్యదర్శికి సంఘం ప్రతినిధులు మలిరెడ్డి కోటారెడ్డి, నరహరి శిఖరం, జి.ఈశ్వరయ్య ఓ వినతిపత్రం పంపారు. ఇటీవల ముగిసిన ప్రాక్టికల్స్‌లో అనేక కాలేజీలు, విద్యార్థుల నుంచి భారీగా నగదు వసూలు చేశాయని ఆరోపించారు.

మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'మున్సిపల్ టీచర్లకు కొన్నేళ్లుగా జీతాల్లో పీఎఫ్ మినహాయింపు ప్రక్రియ జరగడం లేదు. వెంటనే పీఎఫ్ సౌకర్యం కల్పించాలి' అని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బొనిగల హైమారావు, జె.శ్రీనివాసరావు కోరారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి నేతృత్వంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను శుక్రవారం సచివాలయంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

25న మహా ధర్నా: ఎస్టీయూ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వానికి గుర్తుచేసేందుకు 25న సమర శంఖం పేరుతో విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఎస్టీయూ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు.

డీవైఈవోల ఎంపిక ప్రక్రియపై హైకోర్టు స్టే

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డివైఈవో) పోస్టులకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రక్రియను నిలిపివేసినట్లు ఏపీపీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఈ నెల 24న జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష ఆగిపోయాయి. కాగా మహిళా కోటాపై కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో దీనిపై హైకోర్టు రెండు వారాల స్టేటస్ కో విధించింది. కాగా, టౌన్ ప్లానింగ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల తుది ఎంపిక ప్రక్రియకు ఏపీపీఎస్సీ చర్యలు ప్రారంభించింది. ఈనెల 23న సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసి, ఏడు పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది.

ఇద్దరు సలహాదారులకు క్యాబినెట్ హోదా

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ సలహాదారు సీహెచ్.సీతారామాంజనేయ ప్రసాద్, మాస్ కమ్యూనికేషన్ సలహాదారు పి.శ్రీధర్‌రావుకు క్యాబినెట్ హోదా కల్పించింది. ఈమేరకు శుక్రవారం సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు బీసీ గర్జన సభకు అనుమతి

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీసీ సింహగర్జన పేరుతో ఈ నెల 22న బీసీవై పార్టీ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతిచ్చింది. 'బహిరంగ సభను మధ్యాహ్నం 2 గంటల నుంచి 5వరకే నిర్వహించాలి. పిటిషనర్ తన సొంత ఖర్చుతో ఆహారం, తాగునీరు, ప్రాథమిక వైద్యసహాయంతో కూడిన అంబులెన్స్, సీసీటీవీ కెమెరాలు, పారిశుధ్య ఏర్పాట్లు చేసుకోవాలి. జాతీయ రహదారిపై ప్రయాణాలకు ఆటంకం కలిగించరాదు. ఎలాంటి ర్యాలీ నిర్వహించకూడదు. ఆహ్వానితుల సంఖ్య పది వేలకు మించకూడదు. శాంతిభద్రతల సమస్య తలెత్తితే పిటిషనర్ బాధ్యత వహించాలి. చట్టనిబంధనలు ఉల్లంఘిస్తే బలవంతపు చర్యలకు ఉపక్రమించే అధికారం పోలీసులకు ఉంటుంది' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం తీర్పు ఇచ్చారు.

రాష్ట్ర చరిత్రకు చిహ్నం అమరావతి గ్రంథాలయం: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించనున్న కేంద్ర గ్రంథాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి చిహ్నంగా ఉండాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం, పాఠశాల విద్యాశాఖపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. గ్రంథాలయ నమూనాను, నిపుణులు రూపొందించిన వీడియోను పరిశీలించి పలు సూచనలు చేశారు. 'లైబ్రరీ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉండాలి. మన చరిత్ర, వారసత్వానికి చిహ్నంగా నిలిచేలా ఉండాలి. ఆర్కైవ్స్, ఆడిటోరియంతో పాటు 15లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచాల'ని లోకేశ్ స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలు, మూల్యాంకనం, డీఎస్సీ అంశాలపైనా చర్చించారు. ఇందులో ఉన్నతాధికారులు కోన శశిధర్, వీ విజయరామరాజు, బీ శ్రీనివాసరావు, దీవన్ రెడ్డి, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.



(మొదటి పేజీ తరువాయి)

అనంతబాబుతో పోలీసుల కుమ్మక్కు

మధ్య ఉన్న అనుబంధానికి ఇదే స్పష్టమైన నిదర్శనం. ఇది ఏమాత్రం ఉపేక్షించరాని తప్పు. అత్యంత హేయమైన నేరంలో పోలీసుల తీరు ఆక్షేపణీయం" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో, 2022 మే 19న అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతదేహమై కనిపించారు. దీనిపై 5రోజుల తర్వాత అనంతబాబును పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అనంతబాబు తన నేరాన్ని అంగీకరించారని రిమాండ్ రిపోర్టులో తెలిపారు. కాగా, ఈ కేసులో బెయిల్ కోసం అనంతబాబు చేసిన అభ్యర్థనను దిగువకోర్టు, హైకోర్టు నిరాకరించాయి. హైకోర్టు తీర్పును 21 అక్టోబరు 2022న అనంతబాబు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అప్పట్లో ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. ఆ పిటిషన్ మరోసారి శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పోలీసులు, దర్యాప్తు సంస్థ వైఫల్యాలను ఎత్తిచూపుతూ సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. "పోలీసులు, దర్యాప్తు సంస్థల తీరు దారణంగా ఉంది. మరీ.. ఇంత నిర్లక్ష్యమా? ఒక వ్యక్తిని విచారణ పేరుతో లోపలే ఉంచడం లేదా విచారణను అనంతంగా పొడిగించడం అనే కొత్త ధోరణి కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. నిందితుడు ఏళ్ల తరబడి మధ్యంతర బెయిల్‌పై బయట తిరుగుతుండడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

ఇది కచ్చితంగా అపవిత్ర బంధమే

పోలీసులు, అధికారపక్షం మధ్య అపవిత్ర బంధానికి అనంతబాబు వ్యవహారమే నిదర్శనమని కోర్టు మండిపడింది. నిందితుడితో పోలీసులు చేతులు కలిపారని స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. "నిందితుడికి సీఆర్పీసీ సెక్షన్ 167(2) కింద డిఫాల్ట్ బెయిల్ సులభంగా వచ్చేలా పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నించారు. 2022 డిసెంబరు నుంచి నిందితుడు మధ్యంతర బెయిల్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. అత్యంత హేయమైన నేరం జరిగినప్పుడు ఇంత నిర్లక్ష్యమెలా వహిస్తారు? పోలీసులు, దర్యాప్తు సంస్థల పనితీరు ఇంత దారుణంగా ఉంటుందా?" అని ధర్మాసనం ప్రశ్నించింది. కాగా, నిందితుడికి పోలీసులు అన్ని విధాలా సహకరించారని, ఉద్దేశపూర్వకంగానే 92వ రోజున చార్జిషీట్ దాఖలు చేశారని బాధితుడి కుటుంబసభ్యులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా, 'పోలీసుల ఉద్దేశాలన్నీ అర్థమవుతూనే ఉన్నాయి కదా?' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

మీరైనా చర్యలు తీసుకోండి: న్యాయమూర్తి

ఏపీలో ప్రభుత్వం మారిన వెంటనే దర్యాప్తును వేగవంతం చేశామని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. "హత్య జరిగినప్పుడు అనంతబాబుకు చెందిన పార్టీనే(వైసీపీ) అధికారంలో ఉంది. అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న నిందితుడు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ దర్యాప్తును ప్రభావితం చేయగలిగారు. 2024లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే, దర్యాప్తు వేగవంతం చేశాం. ఫోరెన్సిక్ నివేదిక లేకపోవడంవల్లే చార్జిషీటు అసంపూర్ణంగా ఉందని గ్రహించాం. ప్రస్తుతం సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలు చేశాం" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, నాలుగేళ్లుగా దర్యాప్తు పూర్తికాలేదా? కనీసం ఆ అధికారులకు షోకాజ్ నోటీసులైనా ఇచ్చారా? వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారా? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. 'నిర్లక్ష్యానికి బాధ్యులైనవారిపై మీరైనా చర్యలు తీసుకోండి' అని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ అన్నారు.

డీజీపీకి పదవిలో ఉండే అర్హత ఉందా?: సీజేఐ

ఎస్పీ లేదా దర్యాప్తు అధికారిని నియంత్రించలేకపోతే, వారితో పనిచేయించుకోలేకపోతే ఇక డీజీపీకి ఆ అధికారం ఎందుకని సీజేఐ ప్రశ్నించారు. కింది స్థాయి అధికారులను దారిలో పెట్టలేని, నియంత్రించలేని డీజీపీకి ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా? అని నిలదీశారు. "నిందితుడు 2022 నుంచి మధ్యంతర బెయిల్‌ను అనుభవిస్తున్నారు. కానీ నేటికీ దర్యాప్తు మాత్రం పూర్తికాలేదు. ఇది రాష్ట్ర పోలీసుల నిర్లక్ష్యం కాకపోతే మరేమిటి?" అని ప్రశ్నించారు. సాక్షులను బెదిరించడానికి ప్రయత్నించినా, ఆధారాలను మాయం చేయాలని చూసినా తదుపరి విచారణ లేకుండానే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నిందితుడి ప్రవర్తనను న్యాయస్థానం పరిశీలిస్తూనే ఉంటుందని, ఆయన ప్రవర్తన, నియమావళిని బట్టే ప్రస్తుతం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఎంత కాలం ఉంటుందనేది ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించింది.

కీలక మార్గదర్శకాలు..

ఈ ఏడాది నవంబరు 30 లోపు విచారణను పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. స్వయంగా పర్యవేక్షిస్తూ, వారానికి ఒకసారి ట్రయల్ కోర్టులో విచారణ జరిగేలా చూడాలని ఏపీ హైకోర్టును కోరింది. ఈ కేసు విచారణకు సంబంధించి కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. కేసు ట్రయల్ బాధ్యతను సీనియర్ జ్యుడీషియల్ అధికారికి అప్పగించాలని ఏపీ హైకోర్టుకు సూచించింది. మార్చి 14లోపు అభియోగాల రూపకల్పనపై నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. మార్చి 31 లోగా ఈ కేసులో ఏమైనా తదుపరి దర్యాప్తు ఉంటే పూర్తి చేయాలని ఆదేశించింది. ఏప్రిల్ 18 లోగా నిందితుడిపై అభియోగాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పింది. అభియోగాలు నమోదు చేసిన వెంటనే, సాక్ష్యాల పరిశీలన లేదా సాక్షుల విచారణ ప్రక్రియను త్వరితగతిన ముగించాలని పేర్కొంది. ఆగస్టు 31లోపు మొత్తం 58 మంది సాక్షుల విచారణను పూర్తి చేయాలని ఆదేశించింది. నవంబరు 30 నాటికి ఈ కేసు విచారణ ముగించాలని స్పష్టం చేసింది. ఈ కేసును ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించాలని ఏపీ హైకోర్టుకు సూచించింది. ప్రస్తుత కేసు విచారణను అత్యంత ప్రాధాన్య క్రమంలో వేగంగా చేపట్టేందుకు వీలుగా.. ట్రయల్ కోర్టు జడ్జిని ఇతర కేసుల బాధ్యతల నుంచి మినహాయించాలని తెలిపింది. ఈ కేసు విచారణ ప్రక్రియను నిలిపివేస్తూ (స్టే విధిస్తూ) ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకూడదని హైకోర్టుకు స్పష్టం చేస్తూ, పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు తెలిపింది.

బిగుస్తున్న ఉచ్చు..

సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలతో నాటి పోలీసుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ ఘటన జరిగినప్పుడు కాకినాడ జిల్లా ఎస్పీగా రవీంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు. ఆయనతోపాటు అప్పటి అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు భీమారావు, మురళీ, సీఐ మురళీకృష్ణారెడ్డిపై వేటు తప్పదని ఆ శాఖ వర్గాలే చెబుతున్నాయి. అప్పటి జిల్లా ఎస్పీ రాయలసీమకు చెందిన అధికారి కావడంతోపాటు, అప్పటి సీఎం జగన్‌తో సన్నిహిత సంబంధాలు ఉండడంతో అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించారు. బాధితులు, దళితసంఘాలతో ఆందోళనలతో కేసును హత్య కేసుగా మార్చారు. కానీ, అనంతబాబును అరెస్ట్ చేయడానికి కనీసం ప్రయత్నం చేయలేదు. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో అనంతబాబును అరెస్ట్ చూపించారు. అరెస్టు సమయంలో, జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో అనంతబాబు గారు అని సంబోధించి భక్తి చాటుకున్నారు. హత్య జరిగిన ఘటనా స్థలిలో సీసీ ఫుటేజీలను సేకరించలేదు. నిందితుల కాల్ రికార్డులు సేకరించలేదు. గూగుల్ టేకవుట్ కోసం సకాలంలో ప్రయత్నించాల్సి ఉన్నా, జాప్యం చేయడంతో ఆ ఆధారాలు లభ్యం కాలేదు. హత్య అనంతరం అనంతబాబు నుంచి పోలీసులు ఐ ఫోన్‌ను సీజ్ చేశారు. కానీ పాస్‌వర్డ్‌ను తీసుకోలేదు. దీంతో ఇప్పటికీ ఐఫోన్‌ను తెరవలేదు. పైగా అనంతబాబుకు నేర చరిత్ర లేదంటూ చార్జిషీటులో పోలీసులు తమ భక్తిని మరోసారి చాటుకున్నారు.

జగన్.. మోదీకి వ్యతిరేకంగా మాట్లాడే దమ్ముందా?

▸▸ ఉపాధి పథకం పరిరక్షణ యాత్రలో షర్మిల



తెనాలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం.. ప్రజల ప్రయోజనాలను కాలరాస్తుంటే ప్రతిపక్షంలో ఉన్న జగన్ పోరాడాలి. కానీ రాష్ట్రంలోని పేదల ప్రయోజనాలకన్నా జగన్‌కు మోదీ ప్రయోజనమే మిన్నగా ఉంది. ఒక్క మగాడు కూడా లేని ఆ పార్టీ మోదీ ఎదుట సాగిలపడింది. బీజేపీకి అమ్ముడుపోయింది' అని పీసీసీ చీఫ్ షర్మిల విమర్శించారు. కేంద్రానికి అడ్డు చెప్పేందుకు అధికార పార్టీకి అనేక అడ్డంకులు రావచ్చని, ప్రతిపక్షంలో ఉన్న నీ నోరు ఏమయ్యిందని జగన్‌ను ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్త ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా శుక్రవారం గుంటూరు జిల్లా తెనాలిలో రైతులతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమెమాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించటమే ఒక తప్పయితే, మోదీ ప్రభుత్వం ఏకంగా చట్టాన్నే పూర్తిగా మార్చేసిందని మండిపడ్డారు. మోదీ తెచ్చిన కొత్త చట్టంతో గ్రామసభల అధికారాన్నే తొలగించారని, మన గ్రామానికి ఏం కావాలో కూడా ఢిల్లీ వాళ్లే నిర్ణయిస్తారట... అని ఎద్దేవ చేశారు. బిల్లుకు ఆనాడు మద్దతు తెలిపి, ఇప్పుడు డబ్బు కావాలంటూ ఢిల్లీ చుట్టూ చంద్రబాబు తిరగటమేంటని ప్రశ్నించారు. దీనిని జగన్మోహన్‌రెడ్డి అయినా ప్రశ్నిస్తున్నారా! అంటే అదీ లేదని, ఇది బీజేపీ పథకం కాబట్టి మోదీకి వ్యతిరేకంగా మాట్లాడే దమ్ము జగన్‌కు లేదన్నారు. వైసీపీ ఎంపీలయినా పార్లమెంటులో నోరు విప్పే పరిస్థితిలో లేరని, వైసీపీ ఎంపీల్లో ఒక్క మగాడూ లేకపోవటం రాష్ట్రానికి తీరని నష్టమన్నారు. బీజేపీకి బినామీలుగా, బానిసలుగా మిగిలిపోయారని విమర్శించారు. జగన్, చంద్రబాబు పుణ్యమా అని రాష్ట్రం రూ. 11 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌కు పేద ప్రజలకంటే, స్వప్రయోజనాలు, మోదీ జపమే ముఖ్యమని మండిపడ్డారు. జీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేసేవరకు పోరాటం ఆగదన్నారు.

నేటి నుంచి డీసీసీ అధ్యక్షులకు శిక్షణ

▸▸ ముగింపు కార్యక్రమానికి రాహుల్‌గాంధీ రాక

వికారాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకుగాను జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)ల అధ్యక్షులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా కేంద్రం అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో శనివారం ప్రారంభమయ్యే ఈ శిక్షణ తరగతులు మార్చి 2 వరకు కొనసాగనున్నాయి. ఈ తరగతులకు ఏపీ, తెలంగాణకు చెందిన 77మంది డీసీసీ అధ్యక్షులు హాజరు కానున్నారు. మార్చి 2న జరిగే ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు హాజరవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

'కల్తీ నెయ్యి'లో వారి పాపం తేల్చండి

రిటైర్డు ఐఏఎస్ దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీ ఏర్పాటు

▸▸ అప్పటి టీటీడీ సభ్యులు,అధికారుల తప్పిదాలపై విచారణ.. రూల్స్ సడలింపుపై లోతైన పరిశీలన

▸▸ అందులో ఎవరి బాధ్యత ఎంతనేది తేల్చనున్న కమిటీ

▸▸ 45 రోజుల్లోగా నివేదిక.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు



అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) కల్తీ నెయ్యి సరఫరా ఉదంతంలో నాటి బోర్డు సభ్యులు, అధికారుల వైఫల్యాలు, తప్పిదాలను తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రిటైర్డ్ ఐఏఎస్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో నం. 458) జారీ చేశారు. తిరుమల దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపింది. గత నెల 23న కోర్టులో తుది చార్జిషీట్ దాఖలు చేసింది. దీంతోపాటు సీబీఐ జాయింట్ డైరెక్టర్ తన సంతకంతో రెండు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. టీటీడీ నెయ్యి టెండర్లలో జరిగిన గోల్‌మాల్, నిబంధనల ఉల్లంఘన, అధికారుల స్థాయిలో జరిగిన తప్పిదాలు, బోర్డు సభ్యుల పనితీరు వంటి అనేకానేక అంశాలను అందులో ప్రస్తావించారు. టెండర్ నిబంధనలను సడలించడం వల్లే కల్తీనెయ్యి సరఫరాకు రాచబాటలు పడ్డాయని, ఇందులో నాటి అధికారుల పాత్ర ఉందని సీబీఐ జేడీ పంపించిన నోట్‌లో ఉంది. కల్తీనెయ్యి సరఫరా అనేది ఘోరమైన అపచారం, నేరం అని పేర్కొంటూ, ఇకపై ఎలాంటి తప్పులకూ ఆస్కారం లేకుండా టీటీడీలో పాలనాపరంగా, విధానపరంగా సమూల ప్రక్షాళన చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో నాటి కల్తీనెయ్యి ఉదంతంలో కమిటీ సభ్యులు, అధికారుల పాలనాపరమైన వైఫల్యాలను గుర్తించి, వాటి ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఏకసభ్యకమిటీని ఏర్పాటు చేసింది. కల్తీనెయ్యి ఉదంతంపై సీబీఐ ప్రభుత్వానికి పంపించిన నోట్‌లను పరిశీలించి, తప్పులు చేసిన నాటి బోర్డు సభ్యులు, సీనియర్ అధికారుల వైఫల్యాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కమిటీ పరిశీలించే అంశాలు..

నెయ్యి టెండర్ నిబంధనలు సడలించడం వెనక ఉద్దేశాలు, లోపాలు, పాలనా వైఫల్యాలను అంచనా వేయడం, టెండర్ నిబంధనలను సడలించడంలో శ్రద్ధ వహించారా? నిబంధనల ప్రకారం నడుచుకున్నారా? ఇందుకు హేతుబద్ధత ఉందా? అనేది కమిటీ పరిశీలించనుంది. సిట్ గుర్తించిన, లేవనెత్తిన వైఫల్యాల్లో కమిటీ సభ్యులు, అధికారుల పాలనాపరమైన బాధ్యత ఎంతనేది గుర్తిస్తుంది. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఈ కమిటీ పరిశీలన పూర్తిగా పాలనాపరమైన, ప్రభుత్వ పరమైన కోణాలకే పరిమితం కావాలని సీఎస్ దిశానిర్దేశం చేశారు. పరిశీలన, విచారణ సందర్భంగా ప్రభుత్వ ఆమోదంతో కమిటీ ఏ అధికారినయినా పిలవొచ్చని, లిఖితపూర్వక సమాధానాలు తీసుకోవచ్చని, రికార్డులను పరిశీలనకు తీసుకోవచ్చని తెలిపారు. కమిటీ తన పరిశీలనను 45 రోజుల్లోగా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశించారు. కమిటీ విచారణకు టీటీడీ పూర్తిగా సహకరించాలని ఆదేశాలు జారీచేశారు.



నరసాపురం పార్లమెంటు పరిధిలోని ప్రజాప్రతినిధులకు విందు ఇచ్చిన లోకేశ్

'కల్తీ' నుంచి తప్పించుకునేందుకే హెరిటేజ్‌పై బురద: పల్లా



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి తప్పించుకోవడానికే హెరిటేజ్‌పై వైసీపీ బురదచల్లుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ నేతృత్వంలోని సిట్ నివేదిక స్పష్టం చేస్తున్నా వైసీపీ క్లీన్ చిట్ నాటకం ఆడుతూ ప్రజలను మభ్యపెడుతోంది. తిరుమల నెయ్యి వ్యవహారంలో టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి స్వయంగా కల్తీ జరిగిందని ఒప్పుకున్నారు. ఆ అంశాన్ని పక్కనపెట్టి వేరే సంస్థలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఇలా నెయ్యి స్కాం నుంచి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారు. మూడు దశాబ్దాలకుపైగా నిష్కళంక చరిత్ర కలిగిన హెరిటేజ్ సంస్థపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని సహించం. ప్రజాసమస్యలను ప్రస్తావించాల్సిన అసెంబ్లీలో వైసీపీ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు కూడా గర్హనీయం' అని పల్లా పేర్కొన్నారు.

ఆయేషా కేసు క్లోజ్!

హత్యాచారం కేసు కొట్టివేస్తూ సీబీఐ కోర్టు తీర్పు

విజయవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో 18 ఏళ్ల కిందట సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్యాచారం కేసును విజయవాడ సీబీఐ కోర్టు కొట్టివేసింది. కేసుకు సంబంధించి ఆధారాలేమీ లేకపోవడంతో విచారణను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సీబీఐ కోర్టు న్యాయాధికారి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు వెలువరించారు. 'బాధితులు (ఆయేషా తల్లిదండ్రులు) కోరుకుంటే ప్రైవేటు పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు. న్యాయ సహాయం అందించడానికి కోర్టు సిద్ధంగా ఉంది. అయితే కేసులో నిందితులను తేల్చడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. ఇక న్యాయపోరాటం చేసే ఓపిక, శక్తి, ఆర్థిక స్తోమత లేవని బాధితులు చెప్పారు. వారి అభిప్రాయాలు, వాదప్రతివాదనలను విన్న తర్వాత కేసును కొట్టివేస్తున్నాం' అని పేర్కొన్నారు. కోర్టులో ఆయేషా తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా తరపున న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, సీబీఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపీనాథ్ వాదనలు వినిపించారు. అలాగే దర్యాప్తులో భాగంగా ఆయేషా సమాధి నుంచి సేకరించిన అవశేషాలను తిరిగి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోర్టు సీబీఐని ఆదేశించింది. హత్యాచారం కేసును సీబీఐకి అప్పగించిన తర్వాత.. రీపోస్టుమార్టం కోసం తెనాలిలోని ఆమె సమాధి నుంచి కొన్ని అవశేషాలను సేకరించారు. హైదరాబాద్‌లోని గాంధీ ప్రభుత్వాస్పత్రి వైద్యులు రీపోస్టుమార్టం నివేదిక అందజేశారు. తర్వాత సీబీఐ ఆ అవశేషాలను కోర్టుకు అప్పగించింది. వాటిని తిరిగి తమకు అప్పగించాలని ఆయేషా తల్లిదండ్రులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయాధికారి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఈ నెల 27వ తేదీన ఉదయం పది గంటలకు ఆయేషా తల్లిదండ్రులు, సీబీఐ అధికారులు కోర్టుకు రావాలన్నారు. అవశేషాలను తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాన్ని, ఎస్కార్ట్, భద్రతను సమకూర్చాలని సీబీఐ అధికారులను ఆదేశించారు. ఈ వాహనాన్ని తెనాలిలోని ఆయేషా సమాధి ఉన్న శ్మశాన వాటికకు తీసుకెళ్లాలని.. సీబీఐ, రెవెన్యూ అధికారులు, పోలీసులు, మత పెద్దల సమక్షంలో మత సంప్రదాయం ప్రకారం అవశేషాలను ఖననం చేయాలని.. ఈ ప్రక్రియను మొత్తం రికార్డు చేయాలని తీర్పులో స్పష్టం చేశారు.

ఇదీ జరిగింది..

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆయేషా మీరా విజయవాడ ఇబ్రహీంపట్నంలోని నిమ్రా ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ చదివేది. 2007 డిసెంబరు 27న హాస్టల్లో ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన పిడతల సత్యంబాబును 2008 ఆగస్టు 16న అరెస్టు చేశారు. కేసును విచారించిన మహిళా సెషన్స్ కోర్టు.. అతడిని దోషిగా నిర్ధారిస్తూ.. 2009 సెప్టెంబరు 30న జీవితఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. దీనిపై సత్యంబాబు 2010లో హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు 2017 మార్చి 30న అతడిని నిర్దోషిగా నిర్ధారించి తీర్పు వెలువరించింది. దీనిపై ఆయేషా మీరా తల్లిదండ్రులు 2018 జనవరి 27న హైకోర్టులో అప్పీలు చేశారు. కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిట్ దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో 2018 డిసెంబరు 16న కేసు సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. అయితే సీబీఐ దర్యాప్తు చేపట్టి ఐదేళ్లయినా ఎలాంటి ప్రగతీ లేదని ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించడంతో... సీబీఐ అధికారులు రీపోస్టుమార్టం చేయించారు. దర్యాప్తు పూర్తయిందంటూ గతేడాది హైకోర్టుకు నివేదిక సమర్పించారు. కొత్త సాక్ష్యాలు, ఆధారాలు ఏమీ లేవని, కేసు రికార్డు ధ్వంసమైందని నివేదించారు. ఘటన జరిగినప్పుడు ఆయేషాతోపాటు హాస్టల్లో ఉన్న స్నేహితులు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారని తెలిపారు. ఆమెకు ఐదుగురు స్నేహితులు ఉండగా.. ముగ్గురి వాంగ్మూలాన్ని వాట్సాప్ ద్వారా నమోదు చేసినట్లు వెల్లడించారు. సీబీఐ కూడా తమకు న్యాయం చేయలేదని ఆయేషా తల్లిదండ్రులు కొద్దిరోజుల క్రితమే ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మొత్తం కేసును కొట్టివేస్తూ సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.